Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

ముహూర్తం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం; తిథి: బహుళ నవమి రా.7.05 వరకు, అనంతరం దశమి; నక్షత్రం: విశాఖ రా.7.37 వరకు, అనంతరం అనురాధ; అమృతకాలం: సా.11.05 నుండి 12.10 వరకు; వర్జ్యం: రా.11.41 నుండి 1.18 వరకు; దుర్ముహూర్తం: ఉ.8.24 నుండి 9.12 వరకు, తదుపరి రా.10.48 నుండి 11.36 వరకు; రాహుకాలం: మ.3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ.9.00 నుండి 12.00 వరకు

సంపుటి: 64 • సంచిక: 15 • మంగళవారం 29 జనవరి 2019 •విజయవాడ * పేజీలు: 14 • వెల: 5.00 •Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad



ఇస్తారా ఇవ్వరా?

- నిధులపై కేంద్రం కాలయాపన
- ఢిల్లీ వెళ్లి నిలదీయండి
- తాడో పేడో తేల్చుకోండి
- న్యాయపోరాటానికైనా సిద్ధంకండి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులకు, అధికారులకు ఆదేశాలు

అమరావతి, ఆంధ్రప్రభ : కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి రావాల్సిన నిధులు విభజన హామీల నిధులను రాబట్టేందుకు ఆయా శాఖల అధికారులు ఢిల్లీకి వెళ్ళి సంబంధిత శాఖల కేంద్ర మంత్రులపై ఒత్తిడి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తన సహచర మంత్రివర్గ సభ్యులకు, అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ నిధుల కేటాయింపులో ఎంతో కాలయాపన చేస్తున్నదని మండిపడ్డారు. కేంద్రం వైఖరిని కడిగేందుకు ఢిల్లీకి వెళ్లి తక్షణమే రాష్ట్రానికి రావాల్సిన నిధులపై ఒత్తిడి పెంచాలని సూచించారు. సోమవారం ఉదయం సీఎం చంద్రబాబు నాయుడు వెలగపూడిలోని అమరావతి సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న పలువురు మంత్రులు, జిల్లా కలెక్టర్లు, ఇతర శాఖాధిపతులకు సీఎం చంద్రబాబు నాయుడు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు ఉపాధి హామీకి సంబంధించి 2వ పేజీలో...

చుక్కలపై వంకలు!

- సీనియర్ ఐఏఎస్ సాంబశివరావుపై చంద్రబాబు సీరియస్
- చేతగాకపోతే గుంటూరు కలెక్టర్‌ని సంప్రదించాలని ఆదేశం

9లో

పేదలకు సొమ్ము!

రాహుల్‌గాంధీ హామీ

నేరుగా ఖాతాల్లోకి



- కనీస ఆదాయ భరోసా
- పేదరిక నిర్మూలనకేనని వెల్లడి
- దేశాన్ని విభజించిన మోడీ
- చత్తీస్‌గఢ్‌లో రైతు కృతజ్ఞత సదస్సులో రాహుల్ ప్రకటన

రాయ్‌పూర్: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే, పేదలందరికీ కచ్చితంగా కనీస ఆదాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. సోమవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పర్యటించిన ఆయన రాయ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన రైతు కృతజ్ఞత సభలో పాల్గొని ప్రసంగించారు. నరేంద్రమోడీ సారధ్యంలోని బీజేపీ ప్రభుత్వం రెండు రకాల ఇండియాను తయారు చేసిందని రాహుల్ ఆరోపించారు. రాఫెల్ కుంభకోణం, అనిల్ అంబానీ, నీరవ్‌మోడీ, విజయ్ మాల్యా, మెహుల్ చోక్సీ తదితరులుండే ఇండియా ఒకటైతే, పేద రైతులుండే ఇండియా మరొకటని పేర్కొన్నారు. 15 ఏళ్ల తర్వాత తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు కారణమైన రైతులను ఈ సందర్భంగా అభినందించారు. లబ్దిదారులకు రుణమాఫీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చారిత్ర నిర్ణయం తీసుకుంది. కేంద్రంలో మా పార్టీ అధికారంలోకి వస్తే పేదలందరికీ కనీస ఆదాయం ఇవ్వాలని నిర్ణయించాం. పేద ప్రజలు ఆకలితో ఉండకూడదన్నదే దీని ఉద్దేశమని స్పష్టం చేశారు. లక్షలాది మంది సోదర సోదరీమణులు దారిద్ర్యం, పేదరికం అనుభవిస్తుంటే నవభారత నిర్మాణం సాధ్యం కాదని అన్నారు. ఆకలిని, పేదరికాన్ని నిర్మూలించడానికి ప్రతి ఒక్కరికి కనీస ఆదాయం పథకం మా దార్శనికతకు నిదర్శనమని రాహుల్ చెప్పారు.

హరితవిప్లవం, ఆహారభద్రత దిశగా అడుగులేసింది కాంగ్రెస్సే. ఇక్కడ పండే అన్నిరకాల పంటలు ప్రపంచ వ్యాప్తంగా డైనింగ్ టేబుళ్లపైకి చేరుతున్నాయి. అది అమెరికా అయినా జపాన్ అయినా మన పంటలే వంటలవుతున్నాయి. కాంగ్రెస్ ప్రతిపాదించిన భూసేకరణ చట్టం రైతులకు మేలు కలిగించేదిగా ఉండేది. మార్కెట్ ధరకు నాలిగింతలు రైతులకు చెల్లించాలని సూచించాం. 10ఏళ్లలో పరిశ్రమలు స్థాపించకుంటే తిరిగి ఆ భూమి రైతులకు చెందేలా నిబంధనలు ఉండాలని కోరాం. కానీ, బీజేపీ ప్రభుత్వం దీన్ని పక్కదారి పట్టించింది. పంచాయతీలకే అధికారం కట్టబెట్టింది. రైతులకు అన్యాయం జరిగేలా వ్యవహరించిందని రాహుల్ విమర్శించారు. రైతులకు రుణమాఫీ చేయడానికి డబ్బుల్లేవని శివరాజ్‌సింగ్, మోడీ చెప్పారు. కానీ దేశంలోని 15 మంది సంపన్నులకు కోట్లాది రూపాయలు మాఫీ చేశారు. బీజేపీ 15 ఏళ్లలో చేయలేదని మా ప్రభుత్వం 24 గంటల్లో చేసి చూపించిందని రాహుల్ నొక్కిచెప్పారు. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బాఘేల్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పీఎల్ పునియా తదితరులు పాల్గొన్నారు. గతేడాది ఇక్కడ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 90 స్థానాలకు గాను కాంగ్రెస్ 68 చోట్ల విజయం సాధించింది.

జనసేన ప్రచార రథాలు రెడీ!

- 17 రథాలను జెండా ఊపి ప్రారంభించిన పవన్

3లో





సిరీస్ మనదే

- 3-0 తేడాతో కివీస్‌పై విజయబావుట
- పదేళ్ల తర్వాత కివీస్ గడ్డపై తొలి సిరీస్
- కొనసాగుతున్న టీమిండియా జైత్రయాత్ర

10లో

కాంట్రాక్ట్ సిబ్బందికి తీపి కబురు

- వేతనాల్లో 50% పెంపు
- ఏప్రిల్ 1 నుంచి అమలు
- ఆర్థికశాఖ ఉత్తర్వులు

7లో

పచ్చకోట... మండపేట! ఏలూరు... ఏలికెవ్వరు?





- ఖరీదైన ఎన్నిక..
- బీసీ కార్డుతో వైకాపా
- సేన పవర్ ఎక్కువే
- ముక్కోణపు పోటీలో రాజెవరు?





- తారుమారౌతున్న పార్టీల బలాలు
- వర్గపోరుతో వైకాపా సతమతం
- జోష్ మీదున్న టీడీపీ
- అవకాశం కోసం జనసేన నిరీక్షణ





మండపేట, ప్రభ న్యూస్: టీడీపీకి కంచుకోటగా భావించే మండపేట నియోజక వర్గంలో ఈసారి ఎన్నికలు రసవత్త రంగా సాగనున్నాయి. రాష్ట్రంలోనే ఖరీదైన నియోజకవర్గంగా గుర్తింపు పొందిన తూర్పు గోదావరి జిల్లా మండపేట నియోజకవర్గం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇక్కడ కమ్మ సామాజిక వర్గీయులు దశాబ్దాలుగా ఏకచత్రాధిపత్యం వహిస్తున్నారు. ఇప్పుడు బీసీ కార్డుతో వైకాపా ఎన్నికలను ఎదుర్కొనేందుకు అస్త్రశస్త్రాలను సిద్ధంచేస్తోంది. నిర్ణయాత్మక పాత్ర పోషించే 3వ పేజీలో...

ఏలూరు, ప్రభన్యూస్: ఏలూరు ఏలికెవ్వరన్నది అంతు పట్టకుంది. పవర్ కోసం అధికార, విపక్షాలు కాలు దువ్వుతున్నాయి. కాపుల ఖిల్లాను దక్కించుకునేందుకు సేనానీ కన్నేశారు. పోటీ ద్విముఖమా? లేక త్రిముఖమా? తేలకుంది. ఏలూరు జిల్లా కేంద్రం కావడంతో పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఇక్కడ గెలుపు గుర్రాలపై అధికార, విపక్షా లు ఓ నిర్ణయానికి వచ్చాయంటారు. వైకాపా అభ్యర్థిగా ఆళ్ల నానియే 3వ పేజీలో...



ప్రియాంకకు తెలంగాణ బాధ్యతలు?!

- అధిష్టానం ఆలోచన
- దక్షిణాదిలో పార్టీ పునర్వైభవం కోసం వ్యూహం

3లో

పాత కేసుల బదిలీకి విస్తృత ధర్మాసనం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట విభజనకు ముందు హైకోర్టులో దాఖలైన ఏపీ కేసులను ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలా, వద్దా అనే అంశంపై తగిన నిర్ణయం తీసుకునేందుకు విస్తృత ధర్మాసనం ఏర్పాటు చేయాలని తెలంగాణ హైకోర్టు నిర్ణయించింది. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన కేసులను ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని అభ్యర్థిస్తూ ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కే.బి. రామన్న దొర తెలంగాణ హైకోర్టుకు లేఖ రాశారు. ఆ లేఖను ప్రజాహిత వ్యాజ్యంగా హైకోర్టు పరిగణించింది.

సైకిల్‌పై కోట్ల!



- రంగం సిద్ధం... కాంగ్రెస్‌కు అనుచరుల రాజీనామాలు
- కర్నూలు ఎంపీ స్థానం.. మరో 3 అసెంబ్లీ స్థానాలు కేటాయింపు?
- బుట్టాకు పాణ్యం? అసంతృప్తులను బుజ్జగించడంలో బాబు చాణక్యం

అమరావతి, ఆంధ్రప్రభ: మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరేందుకు మార్గం సుగమమయింది. సోమవారం రాత్రి ఉండవల్లిలోని తన నివాసంలో ముఖ్యమంత్రి స్వయంగా ఆహ్వానించి కోట్ల కుటుంబానికి విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో కోట్ల తో పాటు ఆయన సతీమణి సుజాతమ్మ. కుమారుడు రాఘవేంద్రరావు పాల్గొన్నారు. కోట్లను పార్టీలోకి తీసుకోవడం ద్వారా కర్నూలు జిల్లా రాజకీయాల్లో తనదైన మార్కు వేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆచితూచి అడుగులేస్తున్నారు. కోట్లను పార్టీలోకి చేర్చుకోకముందే ఆ జిల్లాలోని సీనియర్లతో ముఖ్యమంత్రి మాట్లాడారు. ముఖ్యంగా అక్కడ కోట్లకు ప్రత్యర్థివర్గంగా ఉన్న డిప్యూటీ సీఎం, రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి కేఈ కృష్ణమూర్తిని బుజ్జగించడంలో ముఖ్యమంత్రి సఫలీకృతులయ్యారు. ఇదే సమయంలో కోట్ల కర్నూలు ఎంపీ స్థానం ఆశిస్తుండటంతో ప్రస్తుతం అక్కడ ఎంపీ రేసులో ఉన్న బుట్టా రేణుకను స్వయంగా పిలిచి మాట్లాడారు. గత రెండు రోజులుగా ఆమెతో చంద్రబాబు మంతనాలుచేసి ఆమెను ఒప్పించగలిగారు. ఈ సందర్భంగా ఆమెను పాణ్యం నియోజకవర్గానికి పంపేందుకు 2వ పేజీలో...

పోలీసులపై సీబీఐ కన్ను!

- ఆయేషా మీరా కేసులో కీలక నిర్ణయం
- 15 మందితో జాబితా తయారు
- జాబితాలో అప్పటి సీపీ ఆనంద్, నల్గొండ ఎస్పీ రంగనాథ్
- కోర్టు తీర్పుల్లోని అంశాలతో ప్రశ్నావళి రెడీ



3లో

ఆంధ్రప్రభ



కమ్యూనిటికో కార్పొరేషన్
ప్రత్యర్థుల్లో పరేషాన్...
వైఫల్యాలకు పూత?
విమర్శలకు చేయూత!

వస్తోంది బడ్జెట్
ఇస్తుందా గిఫ్ట్...
ఐటీ ఇస్తుందా రిలీఫ్?
కాదంటే తప్పదు కటీఫ్!

-దినా

హెగ్డే వ్యాఖ్యలు అమానుషం: రాహుల్

న్యూఢిల్లీ: కేంద్రమంత్రి అనంత కుమార్ చేసిన అనుచిత వ్యాఖ్యలు ప్రతిఒక్క భారతీయుడు చీదరించు కునేలా ఉన్నాయని రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యక్తి కేంద్రమంత్రిగా అనర్హుడని విమర్శించారు. ఎవరైనా హిందూ యువతిని తాకితే అతని చేతిని నరికేయాలని కేంద్రమంత్రి అనంత కుమార్ హెగ్డే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతటితో ఆగకుండా పరోక్షంగా కాంగ్రెస్ నాయకుడిని (గుండూరావు) అవమానించేలా..నోరు పారేసుకున్నారు. కర్నాటక కాంగ్రెస్ చీఫ్ గుండు రావు ముస్లిం మహిళను వివాహం చేసుకున్న విషయాన్ని ఎత్తిచూపారు.

బడుగుల బతుకుల్లో ఆదరణ వెలుగులు

8 లక్షల ఆదరణ యూనిట్ల పంపిణీ

- రూ. 4వేల కోట్ల వ్యయం
- అనంత వేదికగా నాలుగోసారి పనిముట్ల పంపిణీ
- నేడు సీఎం చంద్రబాబు పర్యటన



అమరావతి, ఆంధ్రప్రభ : పేదరికంపై గెలుపు కోసం బడుగు, బలహీన వర్గాలపై వరాల వాన కురిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరోసారి పేదల పక్షపాతిగా నిలుస్తున్నారు. అనంత వేదికగా నాలుగోసారి ఆదరణ పథకం ద్వారా చేతివృత్తి దారులకు పనిముట్లను పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. అనంతపురం జిల్లా కదిరి మండల పరధిలోని చెర్లోపల్లి గ్రామంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ రకాల పనిముట్లను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. ఆదరణ 2019 ద్వారా మరోసారి వెనుకబడిన వర్గాలను అన్ని విధాలా ఆదుకోవ డానికి ఆయన సిద్ధమవుతున్నారు. సుమారు 345 రకాల చేతి పనిముట్లను లబ్ధిదారులకు సరఫరా చేయడానికి సంబంధిత జిల్లా యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. అప విధంగా సబ్సిడీ గతంలో ఉన్న 70 శాతం నుంచి 90 శాతానికి పెంచుతూ ప్రభుత్వం సరళమైన ఆదేశాలు జారీ చేయడంతో లక్షలాది దరఖాస్తుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేవలం 10 శాతం మార్జిన్ మనీతో ప్రభుత్వం నుంచి వచ్చే పనిముట్లను అందుకునే వెసులుబాటు లబ్ధిదారులందరికీ లభించినట్లైంది ఆదరణకు అర్హులైన వారిలో పథకం పట్ల ఉన్న అపోహలను కూడా సంబంధిత అధికారులు తొలగించడంతో గతానికంటే ఎక్కువగా ఈసారి పనిముట్లు తీసు కోవడానికి లబ్ధిదారులు ముందుకొస్తున్నారు. గతంలో సరఫరా చేసిన పనిముట్లకు సంబంధించి వస్తున్న విమర్శలను పరిగణనలోకి తీసుకున్న అధికార యంత్రాం గం పనిముట్ల నాణ్యత విషయంలో ఈ సారి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం విశేషం.

ఇప్పటి వరకు ఆదరణ కింద పంపిణీ చేసిన యూనిట్లు, వ్యయం చేసిన నగదు వివరాలు

కార్పొరేషన్ పేరు	యూనిట్ల సంఖ్య	నగదు వ్యయం కోట్లలో
షెడ్యూల్ కులాలు	93,845	893
షెడ్యూల్ తెగలు	9,410	95
వెనుకబడిన తరగతులు	93,550	764
ముస్లిం మైనారిటీస్	18,139	150
క్రిస్టియన్ మైనారిటీస్	680	7
బీసీ ఫెడరేషన్లు	47,661	321
కాపు	1,24,184	1,048
యంబీసీ	1,908	18
ఈబీసీ	10,367	96
బ్రాహ్మణ	256	9
మొత్తం	4,00,000	3,400
ఆదరణ	4,00,000	600
సమగ్ర మొత్తం	8,00,000	4,000

నాలుగోసారి..

ఇప్పటి వరకు విజయవాడ, తిరుపతి, అనకాపల్లిలో మూడు దఫాలుగా ఆదరణ పథకం ద్వారా బడుగు, బలహీన వర్గాలకు చేతి పనిముట్లను పంపిణీ చేశారు. అనంతపురం జిల్లాలో మంగళవారం సీఎం చంద్రబాబు చేతుల మీదు గా నాలుగోసారి ఆదరణ పథకం ద్వారా పనిముట్ల పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లూ ఇప్పటికే పూర్తి చేశారు. గత నాలుగు నెలల్లో ఆదరణ పథకం ద్వారా వివిధ రకాల పనిముట్లను అందజేశారు. రూ.4 వేల కోట్ల విలువైన 8 లక్షల యూనిట్లు ఈ సందర్భంగా లబ్ధిదారులు అందుకోవడం విశేషం. నాలుగో దఫా జరుగుతున్న ఆదరణ పథకంలో భాగంగా సుమారు 30 వేల మంది డప్పు కార్మికులకు రూ.2,700 విలువైన గజ్జలు, డప్పు, డ్రస్‌లను అందజేస్తున్నారు. 20 వేల మంది చర్మకారులకు కూడా రూ.10 వేల విలువైన టూల్ కిట్లను సీఎం చేతుల మీదుగా పంపిణీ చేయడానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.



సీఆర్డీఏ పరిధిలో పేదలకు 2,400 ఫ్లాట్ల కేటాయింపు

- లాటరీ ద్వారా అందజేసిన మంత్రి పుల్లారావు

అమరావతి, ఆంధ్రప్రభ : అమరావతి రాజధాని గ్రామాన పరిధిలోని ఇళ్లు లేనిపేదలకు ప్రధానమంత్రి 'అవాస్ యోజన' పథకం కింద ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చిన మేరకు 2వ విడత ఫ్లాట్లను కేటాయించారు. సోమవారం తుళ్లూరులో సీఆర్డీఏ అధికారులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖమంత్రి పత్తిపాటి పుల్లారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. లాటరీ ఫైనల్ రౌండ్ తీసి లబ్దిదారులకు ఎలక్ట్రానిక్ విధానంలో ఈ ఫ్లాట్లను కేటాయించగా లబ్దిదారులకు వాటిని మంత్రి పుల్లారావు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలు ఆశించిన మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక కార్యాచరణను రూపొందించి ఫ్లాట్ల కేటాయింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. నిధుల కొరత ఉన్నా ,ఎవరు ఎన్ని ఆటంకాలు సృష్టించినా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధి విషయంలో రాజీ లేకుండా కృషిచేస్తున్నారన్నారు. రాజధాని ప్రజలకు ప్రస్తుతం అందిస్తున్న రూ. 2500 ల నెలసరి పింఛన్ ను పెంచడానికి స్థానిక ఎమ్మెల్యే టి. శ్రావణకుమార్ తో కలిసి ముఖ్యమంత్రి ద్వారా కృషి చేస్తానని పుల్లారావు హామీ ఇచ్చారు. రాజధాని పరిధిలో ఇళ్లు లేని పేదలందరికీ ఫ్లాట్లను నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. కాగా 5 క్లస్టర్ ల పరి ధిలో 3200 ఫ్లాట్లు నిర్మించగా లబ్దిదారుల కంట్రిబ్యూషన్ చెల్లించిన 2,400 మందికి ఈ 2వ విడత లాటరీలో ఫ్లాట్లుకేటాయించామని సీఆర్డీయే గ్రూప్ డైరెక్టర్ ఎ. శ్రీనివాస బాబా తెలిపారు. గ్రామాల వారీగా ఇండ్ల కేటాయింపుల వివరాలను వెల్లడిస్తూ తుళ్లూరు గ్రామానికి 410, అనంతరం , నెక్కల్లు గ్రామాల వారికి 215, ఐనవోలు క్లస్టర్ పరిధిలో (5 గ్రామాలు) మొత్తం 383 మందికి , మందడం క్లస్టర్‌పరిధిలో 777 మందికి, రాయపూడి, ఉద్దండరాయుని పాలెం గ్రామాల వారికి 615 ఫ్లాట్లను ఈ లాటరీ ద్వారా కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీయే అధికారులు, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అధికార లాలస... పదవుల ప్రయాస!

- వారు మారని పార్టీ లేదు
- దగ్గుబాటి కుటుంబంపై చంద్రబాబు సెటైర్లు
- కుట్రలు కుతంత్రాలే వైకాపా అజెండా
- జయహో బీసీ సభ చారిత్రాత్మకం
- తెదేపా నేతలతో టెలికాన్ఫరెన్స్

అమరావతి, ఆంధ్రప్రభ: కుట్రలు, కుతంత్రాలే వైకాపా అజండా అని, జగన్‌కు అభివృద్ధిపై స్పష్టత అనేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. టీఆర్ఎస్‌తో జగన్ అంటకాగటం బీసీల పట్ల ఆయనకున్న వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. తెలంగాణలో 29 కులాలను బీసీ జాబితా నుంచి టీఆర్ఎస్ తొలగించిందని, ఈ కులాలన్ని వైకాపా పై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నాయన్నారు. ప్రజలను మభ్యపెట్టాలని జగన్ అజండాగా పెట్టుకున్నారని, దీనిపై బీసీల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని తన నివాసం నుంచి టీడీపీ నేతలు, ప్రజాప్రతి నిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఏకపక్షంగా గెలుస్తామని, రాజమండ్రి జయహో బీసీ సభతో ఇది స్పష్టమైందన్నారు. బీసీల ఐక్యతను దెబ్బతీయాలనే కుట్రలకు వైకాపా, టీఆర్ఎస్‌లు ప్రయత్నిస్తున్నాయని, వీటిని బలంగా తిప్పికొట్టాలని సూచించారు. కేవలం అధికారం కోసమే దగ్గుబాటి కుటుంబం వైకాపాలో చేరిందని, ఇప్పటివరకు వారు మారని పార్టీ లేదని ఎద్దేవా చేశారు. ఆర్ఎస్ఎస్ మొదలు అన్ని పార్టీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్, ఇప్పుడు వైకాపాలో చేరారన్నారు. కాంగ్రెస్ పార్టీలో పురంధేశ్వరీ కేంద్ర మంత్రిగా దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఎమ్మెల్యేగా కొనసాగారని, ఆ తరువాత కాంగ్రెస్ పార్టీని వదిలి బీజేపీ చెంతన చేరారని విమర్శించారు. తాజాగా ఇప్పుడు మళ్ళీ వైకాపా తీర్థం పుచ్చుకున్నారని, కేవలం అధికారం కోసమే ఈ ఫిరాయింపులన్నారు. మరోవైపు అధికారం కోసం లక్ష్మీపార్వతి వైకాపాతో కలిసి నడుస్తున్నారని, ఆనాడు అవకాశ వాదంతో ఎన్టీఆర్‌ను వాడుకున్నారని మండిపడ్డారు. వీళ్లందరి వల్ల ఎన్టీఆర్‌కు ఎంతో అప్రదిష్ట కలిగిందన్నారు. ఈ అవకాశ వాదులంతా వైకాపా గూటికి చేరారని, వీళ్ళ డొల్లతనాన్ని ప్రజలకు వివరించి ఎండగట్టాలని నేతలకు కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు.

స్ఫూర్తిని నింపిన జయహో బీసీ సభ

రాజమండ్రిలో ఆదివారం నిర్వహించిన జయహో బీసీ సభ చారిత్రాత్మకమని, ఇది అన్ని వర్గాల్లో స్ఫూర్తిని నింపిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ సభ ద్వారా బీసీలకు ఇచ్చిన హామీ లను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని నేతలకు చంద్రబాబు సూచించారు. చేనేత, నాయీబ్రాహ్మణులకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్, స్వర్ణకారులకు, ఎంబీసీల ఇళ్లకు 100 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వనున్న అంశాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని చెప్పారు. బీసీ ఫెడరేషన్లను కార్పొరేషన్లుగా మార్చేందుకు నిర్ణయం తీసుకున్నామని, మరో వైపు కొత్తగా యాదవ, శెట్టి బలిజ, చేనేత కార్పొరేషన్లను ఏర్పాటు చేయనున్న విషయాన్ని కూడా వివరించాలని దిశా నిర్దేశం చేశారు. బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టభద్రత కల్పిస్తామని హామీనిచ్చారు. బీసీలకిచ్చిన హామీలన్నింటిని ఫ్లెక్సీల రూపంలో ప్రచారం నిర్వంహించాలని సూచించారు. వారం రోజులపాటు ఈ అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో ప్రచారం నిర్వహించాలని కోరారు. రాజమండ్రి సభ మూడ్‌ఆఫ్ ది స్టేట్‌కు నిదర్శనమని 50 శాతం ఈ వర్గాల ఓటింగ్‌తో టీడీపీ ఓటింగ్ ప్రారంభమవుతుందన్న ధీమాను చంద్రబాబు వ్యక్తం చేశారు. కాపు రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయమని, ఈ రిజర్వేషన్లను వైయస్ వ్యతిరేకించా రన్నారు. టీడీపీకి అనుకూలంగా బీసీలు ఉండటంతో ఆనాడు వైయస్ కక్షసాధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు.

గడిచిన నాలుగేళ్ళల్లో ఎస్సీ, ఎస్టీ ముస్లిం మైనార్టీలకు పెద్ద ఎత్తున సంక్షేమాన్ని అందించామని చెప్పారు. ఫిబ్రవరి 2,3, 4 తేదీల్లో పింఛన్లు, ఇళ్ళ పంపిణీ కార్యక్రమాన్ని ఒక వేడుకగా నిర్వహించాలని, పెంపు అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్ధేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధి పట్ల చిన్నారులు ఎంతో స్ఫూర్తిని కనబరుస్తున్నారని, 14 ఏళ్ళ బాలిక వైష్ణవి స్ఫూర్తి అందరిలో రావాల్సి ఉందన్నారు. ఒక ఎకరం పొలాన్ని పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి విరాళం ఇచ్చి తన పెద్ద మనసును చాటుకుందని ముఖ్యమంత్రి ప్రశంసించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో టీడీపీ రాష్ట్ర, జిల్లా బాధ్యులతో పాటు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.



మధురైలో మోడీకి నిరసన సెగలు

ప్రధాని మోడీ ఆదివారం మదురైలో ప్రజలనుంచి నిరసన ఎదుర్కొన్నారని, ఇది బీజేపీపై మూడ్ ఆఫ్ ది నేషన్‌కు నిదర్శనమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. నల్లజెండాలు, నల్లబెలూన్‌లతో తమిళులు నిరసన తెలిపారని వెల్లడించారు. గజ తుపానుపై ప్రధాని మోడీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంవల్లే ప్రజల నుంచి నిరసన ఎదుర్కోవాల్సి వచ్చిందని తెలిపారు. తమిళనాడుతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగిందని, మోడీ, అమిత్ షాలు రాష్ట్ర పర్యటనకు వస్తే ఇంతకన్నా తీవ్రమైన నిరసనలు, వ్యతిరేకత ప్రజల నుంచి ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందన్నారు. రాష్ట్రానికి బీజేపీ చేసిన అన్యాయంపై ఇప్పటికే 11 జిల్లాల్లో ధర్మపోరాట సభలు నిర్వహించామని, మరో వైపు ఢిల్లీలో ఎంపీలు రాజీ లేని పోరాటం చేస్తున్నారన్నారు. దేశంలో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పనిచేయాలని, వారికి తొత్తుగా మారిన వైకాపా కుట్రలను ఎండగట్టాలని నేతలకు చంద్రబాబు సూచించారు. అమరావతిలో త్వరలోనే ధర్మపోరాటం చివరి సభను నిర్వహించనున్నామని, ఈ సభకు జాతీయ పార్టీల నేతలంతా హాజరవుతారని తెలిపారు. కొల్‌కత్త ర్యాలీకి ధీటుగా అమరావతి సభను నిర్వహిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. దేశాన్ని కాపాడుకోవడంతో పాటు రాష్ట్ర హక్కుల కోసం నేతలు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని కోరారు.



4 నుంచి బీజేపీ బస్సు యాత్ర

- కన్నా లక్ష్మీనారాయణ

అమరావతి, ఆంధ్రప్రభ: శ్రీకాకుళం జిల్లా పలాస నుంచి ఫిబ్రవరి 4వ తేదీన బీజేపీ ప్రజా చైతన్య బస్సు యాత్రను చేపడుతున్నట్లు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీ నారాయణ తెలియజేశారు. సోమవారం గుంటూరులోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు బస్సు యాత్రకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఉత్తరాంధ్ర, మధ్యాంధ్ర, రాయలసీమ జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లో ఈ బస్సు యాత్ర కొనసాగుతుందని, దీని పర్యవేక్షణకు ప్రత్యేక నిర్వహణ కమిటీని ఎంపిక చేయడం జరిగిందన్నారు.

యాత్ర ప్రముఖ్‌గా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తురగా నాగభూషణం, కంట్రోల్ రూం ఇన్‌ఛార్జులుగా రాష్ట్ర కార్యదర్శులు వెంకటేష్ యాదవ్, అడపా శివ నాగేంద్ర రావు, శశిభూషన్‌రెడ్డి, కోలా ఆనంద్‌లు, రూట్ ఇన్‌ఛార్జ్‌గా అడపా శివ నాగేంద్ర రావు, రూట్ కో ఇన్‌ఛార్జులుగా ఎంజీబీ నాయుడు, పాలపాటి రవి, మాకం అశోక్, హెడ్ క్వార్టర్స్ ఇన్‌ఛార్జ్‌గా సత్యమూర్తి, పబ్లిక్ మీటింగ్స్ ఇన్‌ఛార్జులుగా అడపా శివ నాగేంద్ర రావు, షేక్ బాజీ, మీడియా వ్యవహారాలు శ్రీనివాసరాజు, సోషల్ మీడియా నాగరాజు, పబ్లిసిటీ సెల్ సునీల్ ఇస్కా, యాత్రా సభ్యుల బస దొరబాబు, భోజన సదుపాయాలు రామచంద్రరాజు, ఆర్థిక వ్యవహారాలకు పకలపాటి సన్యాసిరాజులను ఎంపిక చేసినట్లు తెలిపారు.

సైకిల్‌పై కోట్ల!

(మొదటిపేజీ తరువాయి)



అంగీకరింపజేశారు. అలాగే కోట్ల మరో మూడు నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులకు సీట్లు కేటాయించాలని కోరిన నేపథ్యంలో పాణ్యం తోపాటు ఈ మూడు నియోజకవర్గాల్లోని ఇన్‌ఛార్జిలను కూడా ముఖ్యమంత్రి ఒప్పించే ప్రయత్నంలో ఉన్నట్లు సమాచారం. ఆ జిల్లాలోని డోన్ నియోజకవర్గం నుండి ఆయన సోదరుడు గత ఎన్నికల్లో పోటీచేసి ఓటమిపాలయ్యారు. ప్రస్తుతం అక్కడ ఆయనే ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. దీనితోపాటు కోడుమూరు ఆయన స్వంత నియోజకవర్గం కావడంతో ఆ స్థానాన్ని కూడా కోట్ల తన అనుచరులకు కేటాయించాల్సిందిగా ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిసింది. దీనికితోడు అలూరు, ఎమ్మిగనూరు స్థానాల్లో ఏదో ఒకటి ఇవ్వాలని కూడా అడిగినట్లు తెలిసింది. దీంతో పాణ్యం, కోడుమూరు, ఆలూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జిలతో కూడా ముఖ్యమంత్రి మాట్లాడినట్లు తెలిసింది. వీరిలో కొంత మందికి ఎమ్మెల్సీ ఇస్తానని హామీ ఇచ్చి వారిని బుజ్జగించినట్లు తెలిసింది. ఒక వేళ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే మంచి ప్రాధాన్యత కలిగిన పదవులను కట్టబెడతానని కూడా వారికి చెప్పి అసంతృప్తి లేకుండా ముఖ్యమంత్రి ముందు జాగ్రత్తలు తీసుకున్నారని సమాచారం. అలాగే అక్కడ కర్నూలు టౌన్ ఎమ్మెల్యేగా ఉన్న ఎస్వీ మోహన్ రెడ్డిని సైతం ముఖ్యమంత్రి ఒప్పించారు. కేవలం కర్నూలు జిల్లాలో పూర్తిస్థాయిలో పట్టు సాధించాలన్న ఉద్దేశ్యంతోనే ముఖ్యమంత్రి స్వయంగా అక్కడి నేతలతో మాట్లాడుతూ, అందరినీ సమన్వయపరుస్తూ వచ్చారు. ఆయన తీసుకున్న చొరవ ఫలించబోతుండటంతో కర్నూలు జిల్లా రాజకీయాలపై ఆసక్తికరమైన చర్చ జరగుతోంది. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ కోట్ల విజయ భాస్కర రెడ్డి వారసుడిగా కర్నూలు జిల్లా రాజకీయాల్లో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీచేయాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఈనేపథ్యంలోనే ఆయన జిల్లాలోని కీలక నేతలు, అనుచరులతో ఒకసమావేశాన్ని నిర్వహించి టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఆయన రాకతో కర్నూలు జిల్లాలో టీడీపీ మరింత బలోపేతం అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాయలసీమలో ఇప్పటి వరకు కొంత బలహీనంగా ఉన్న తెలుగుదేశం పార్టీ కోట్ల చేరికతో పుంజుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తుండటంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ దిశగా పావులు కదుపుతూ వ్యూహాత్మక ఎత్తుగడలు వేస్తున్నారు.

ఇస్తారా? ఇవ్వరా?!

(మొదటిపేజీ తరువాయి)

వేతన బకాయిలు రూ. 500 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ నిధుల క్రింద రూ. 1500 కోట్లు చెల్లించాల్సి వుందని, గడచిన 3 నెలలుగా ఎలాంటి చెల్లింపులు చేయలేదని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. దీనిపై తీవ్రంగా స్పందించిన ఆయన కేంద్రం మొండి వైఖరితో నిధుల కేటాయింపులో ఆంధ్రప్రదేశ్ కు అన్యాయం చేస్తోందని, అవసరమైతే ఈ అంశంపై న్యాయపోరాటానికి సిద్ధం కావాలని స్పష్టం చేశారు. అవసరమైతే సంబంధిత అధికారుల కార్యాలయాలు, ఇళ్ళ వద్ద ధర్నాకు దిగా లని సీఎం చెప్పారు. కొత్త రేషన్ కార్డులు, స్ప్లిట్ కార్డుల కోసం రాష్ట్రం మొత్తం నుండి 55,540 దరఖాస్తులు అం దగా వాటిలో 40,040 దరఖా స్తులను ఆమోదించారు. 7024 దరఖాస్తులు తిరస్కరించారు. పరిశీలనలో మరో 8476 దరఖాస్తులు ఉన్నాయి. 10,033 కొత్త రేషన్ కార్డులను అందజేయగా 5196 స్ప్లిట్ కార్డులను అందజేశారు. మరో 24,811 దరఖాస్తులకు సంబంధించి కొత్తరేషన్ కార్డులు అందజేయనున్నారు.

ప్రకృతి సేద్యంతోనే ఆరోగ్యాంధ్ర

ప్రకృతి సేద్యానికి సాంకేతికతను జోడించి వ్యవసాయ రంగంలో వేగవంతమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ప్రకృతి సేద్యంతోనే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణమవుతుందని, ఇది భావితరాలకే కాకుండా ప్రపంచానికి భారతదేశం ఇచ్చే అద్భుత కానుకని ఆయన పేర్కొన్నారు. ప్రకృతి సేద్యం వల్ల రైతుల ఆర్థిక పరిస్థితి పరిపుష్టంగా మారడమే కాకుండా తెగుళ్ళకు స్వస్తి చెప్పవచ్చని చంద్రబాబు అన్నారు. ఇటీవల దావోస్‌లో జరిగిన సదస్సులో,మన రాష్ట్రం అమలు చేస్తున్న జీరో బడ్జెట్ వ్యవసాయ విధానానికి మంచి స్పందన లభించిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు సాంకేతికతను ప్రధాన పాత్రగా ఎంచుకొని వివిధ రం గాలకు అన్వయిస్తున్న సమయంలో అదే సాంకేతిక పరిజ్ఞా నంతో మన రాష్ట్రంలో ప్రకృతికి అనుసంధానం చేస్తున్నామని సీఎం అన్నారు. ఈ అంశాన్ని ప్రపంచమంతా ఎంతో ఆసక్తితో గమనిస్తూ ఎదురుచూస్తుందన్నారు. అధికారులు మరింత బాధ్యతతో ప్రకృతి సేద్యం వైపు దృష్టిపెట్టాలని సూచించారు.

రేపటి సభలో కాపు రిజర్వేషన్ బిల్లు

రాష్ట్రంలో వెనుక బడిన వర్గాలకు చెందిన వారు గత ఎంతో కాలంగా బీసీ కార్పొరేషన్ ను కొత్తగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారని అయితే సాధ్య అసాధ్యాలను పరిశీలించిన అనంతరం బీసీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అందజేస్తామని వెల్లడించారు. జనాభా దామాషా ప్రకారం పేదరిక నిర్మూలన కార్యక్రమాన్ని ముమ్మరం చేస్తామన్నారు. నాలుగు రోజుల క్రితం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో కాపులకు రిజర్వేషన్‌ను ప్రకటించిన విషయంపై ముఖ్యమంత్రి స్పష్టతనిచ్చారు. ఈ నెల 30వ తేదిన ప్రారంభమయ్యే రాష్ట్ర శాసనసభ సమావేశాల సందర్భంగా కాపు రిజర్వేషన్ లకు చట్టబద్ధత కల్పించే బిల్లును సభలో ప్రవేశపెడతామన్నారు. సమాజంలో ఏ ఒక్కరూ కూడా మేము పేదవాళ్ళం మాకు గుర్తింపు లేదనే బాధ పడకూడదని అగ్రవర్ణాలలో ఉన్న పేదలకు కూడా సంక్షేమ ఫలాలు అందించాలన్న ధ్యేయంతో తాను కంకణబద్ధుడనై ఉన్నానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ , సబ్‌ప్లాన్ అమలు చేస్తున్నట్లే బీసీ సబ్ ప్లాన్ ను ప్రారంభించబోతున్నామని ప్రకటించారు. ఎంబిసీలకు నెలకు 100 యూనిట్ల ఉచిత విద్యుత్, బీసీ విదేశీ విద్యకు రూ. 15 లక్షల ఆర్థిక సాయం, అమరావతిలో రూ. 100కోట్లతో పూలే స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కొత్తగా రాష్ట్రంలో 6 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే 106 గురుకులాలు బీసీలకు అందుబాటులో ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజలకిచ్చిన హామీల ప్రకారం అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. విజయనగరంలో ఆ నాడు సంగీత కళాశాలను ఏర్పాటు చేసినందున శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు, పి. సుశీల వంటి సుప్రసిద్ధ గాయకులు అక్కడి నుండి వచ్చి రాష్ట్రానికి కీర్తి ప్రతిష్టలు సాధించారని మన సాంప్రదాయ సంగీత, లలిత కళలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. డోలు , సన్నాయి వంటి సంగీత కళలకు ఇప్పటికి ఎంతో డిమాండ్ ఉందన్న విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

మంత్రి లోకేష్ దావోస్ పర్యటనపై వీడియో ప్రదర్శన

ఆంధ్రప్రదేశ్ లో అనుసరించిన ప్రకృతి సేద్యం విధానాన్ని ఇండోనేషియా దేశమంతా అమలు చేస్తామని ఆదేశ ప్రతినిధులు ప్రకటించడం ఎంతో గర్వకారణమని రాష్ట్ర సమాచార శాఖ కార్యదర్శి రామాంజనేయులు వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ను నేను ప్రమోట్ చేస్తే మంత్రులు దానిని మరింత ముందుకు తీసుకువెళ్ళడం సంతోషదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి లోకేష్‌కు కితాబునిచ్చారు. టెక్నికల్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ రెండు సమ పాళ్ళలో ఉపయోగిస్తేనే ఎంతో అభివృద్ధిని సాధిస్తామని దృఢ సంకల్పాన్ని వ్యక్తం చేశారు.

రానున్న వేసవి కాలానికి త్రాగునీటి సరఫరాపై పంచాయతీరాజ్ శాఖ ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని ఆదేశించారు. వ్యక్తి గత మరుగుదొడ్ల నిర్మా ణంలో చిత్తూరు జిల్లాకు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ చోటు దక్కడం అభినందనీయమని ముఖ్యమంత్రి ప్రశంసించారు.

ఒకే రోజు 4లక్షల గృహ ప్రవేశాలు

రాష్ట్రంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో నిరుపేదలకు శాశ్వత గృహాలను అందించే లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన సుమారు 1.50 గృహాలకు ఫిబ్రవరి 2,3,4 తేదిల్లో అందించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఒకేసారి 4లక్షల ఇళ్లల్లో గృహ ప్రవేశాలు జరుగుతాయని సీఎం స్వయంగా ప్రకటించారు. ఆర్టీజీలో డేటా ఇంకా సరిగా లేదని తక్షణమే దానిని సవరించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పింఛన్ల సమస్యలపై ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకూడదని, తక్షణమే ఫిబ్రవరి 2వ తేది లోగా సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.భూదార్ కార్డుకు సంబంధించి ఆధునికతను జోడించి క్యూర్ కోడ్ ను కొత్తగా తీసుకువస్తున్న భూధార్ నమూన కార్డును ముఖ్యమంత్రికి ఐటీ సలహాదారుడు జె. సత్యనారాయణ అందజేశారు.



జన్మభూమికి బ్రహ్మారథం

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 2వ తేది నుండి 11వ తేది వరకు నిర్వహించిన 6వ విడత జన్మభూమి కార్యక్రమానికి రాష్ట్రప్రజలు బ్రహ్మారథం పట్టారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం వల్ల అధికారులు , నేతలు ప్రజల ప్రశంసలు అందుకుంటారని ఆయన స్పష్టం చేశారు. జన్మభూమిలో వచ్చిన సమస్యల పరిష్కారం తక్షణమే చేపట్టడం వల్ల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి ఫిబ్రవరి 1వ తేదిన రాష్ట్ర బంద్ కు పిలుపునిచ్చిన నేపథ్యంలో 2 లేదా 3 తేదిల్లో జన్మభూమి సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆదరణ ఇతర సంక్షేమ కార్యక్రమాలపై ఆయా జిల్లా కలెక్టర్లలు క్షుణ్ణంగా సమీక్షించుకుని చివరి లబ్దిదారునికి ప్రయోజనం కలిగేలా చూడాలన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ కు రైతులకు ఎటువంటి సహాయ కార్యక్రమాలు చేపట్టగలమో, వాతావరణ పరిస్థితులను అంచనా వేస్తూ జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకుని సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క జిల్లాలోను, మండలంలోను, గ్రామంలోను నీటికి ఇబ్బంది ఉండే పరిస్థితి రాకుండా చూసుకోవాలన్నారు. పశు పోషణకు అవసరమైన నీటి నిల్వలు భద్రపరచుకోవాలని సూచించారు.

ఫిబ్రవరి 9, 10 తేదీల్లో కొండవీడు ఉత్సవాలు

మంత్రులు పత్తిపాటి పుల్లారావు, శిద్దా రాఘవరావు

అమరావతి, ఆంధ్రప్రభ: కొండవీడు కోట ఉత్సవాలను వచ్చే నెల 9,10తేదీల్లో రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రులు పత్తిపాటి పుల్లారావు, శిద్దారాఘవరావు లు తెలిపారు. సోమవారం గుంటూరు జడ్పీ కార్యాలయంలో కొండవీడు ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో మంత్రులు సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ కొండవీడు కోటకు 700సంవత్సరాల చరిత్ర ఉందని, ఈ విశిష్టతను రానున్న తరాలకు తెలియజేసేలా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

రూ. 87కోట్ల నిధులతో ఈ కోట ను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రూ. 45 కోట్లు గాట్‌రోడ్డు అభివృద్ధికి వినియోగించినట్లు చెప్పారు. రానున్న రెండుమూడేళ్ళలో ప్రపంచ పర్యాటక కేంద్రంగా కొండవీడు కొండను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు మంత్రి పుల్లారావు తెలిపారు. ఈ ఉత్సవాల్లో అడ్వెంచర్ స్పోర్ట్స్, ట్రెక్కింగ్, వాలీబాల్, గ్రామీణ క్రీడలు,పారా గ్లైడింగ్ , ఫోటో ఎగ్జిబిషన్, ఫుడ్ కోర్ట్స్, హెలి, హర్స్ రైడ్స్ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడిచారు. అదే విధంగా సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు సినీ సంగీత విభావరి ,ఫోక్ డ్యాన్స్, మిమిక్రీ, ఫైర్ వర్క్స్ వంటి కార్యక్రమాలను కోట దిగువన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని వివరించారు.

అనంతరం అటవీ శాఖామంత్రి శిద్ధా రాఘవరావు మాట్లాడుతూ కొండవీడు కోటను రానున్న రోజుల్లో ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. కోట పైభాగానా 77 హెక్టార్లలో, అటవీ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పురావస్తు శాఖ కమిషనర్ వాణి మోహన్, గుంటూరు జిల్లా కలెక్టర్ కోనా శశిధర్, జడ్పి చైర్ పర్సన్ జానిమూన్, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శాస్త్రి సాంస్కృతిక వ్యవహారాల శాఖ డైరెక్టర్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లారావు మార్గదర్శకత్వం

జనసేనకు అవసరం
ట్విట్టర్‌లో పవన్‌కల్యాణ్



అమరావతి, ఆంధ్రప్రభ : జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ సోమవారం ట్విట్టర్ వేదికగా ప్రముఖ ఆర్థిక వేత్త, పర్యావరణ ఉద్యమకారుడు, రాజకీయ విశ్లేషకులు పెంటపాటి పుల్లారావుపై ప్రశంసల వర్షం కురిపించారు జనసేన పార్టీలో చేరాల్సిందిగా ఆయన్ని ఆహ్వానించారు. దేశంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఆయన రాస్తున్న కథనాలు విశ్లేషణాత్మకంగా, ఆలోచింపజేసేలా ఉన్నాయన్నారు. ఓసారి తాను పుల్లారావును కలుసుకున్నానని, తామిద్దరం కొన్ని గంటల పాటు ఒకరి ఆలోచనలు మరొకరం పంచుకున్నామన్నారు. జనసేన లాంటి కొత్త పార్టీకి పుల్లారావు లాంటి అనుభవం ఉన్న వ్యక్తుల మార్గదర్శకత్వం అవసరమన్నది అన్నారు. జనసేనలో చేరాల్సిందిగా తాను పుల్లారావును ఒప్పించానని, ఆయనకు స్వాగతం పలికేందుకు ప్రస్తుతం ఎదురు చూస్తున్నానని జనసేనాని వ్యాఖ్యానించారు. పుల్లారావు ప్రముఖ రాజకీయ , సామాజిక విశ్లేషకులు అని, సామాజిక సమస్యలపై స్పందించే మంచి రచయిత అన్నారు. ఆయన పార్టీలోకి వస్తే ఆయన విలువైన సేవలను వినియోగించుకునేందుకు జనసేన సిద్ధంగా ఉందన్నారు. జనసేన విధానాలపై పుల్లారావు రాసిన ఓ కథనం క్లిప్‌ను ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ ట్వీట్‌కు జత చేశారు.





• అత్యాధునిక హంగులతో ఆకర్షణీయం • 17 రథాలను జెండా ఊపి ప్రారంభించిన పవన్ కల్యాణ్ • గాజు గ్లాసులతో కార్మికులకు తేనీటి విందు

జనసేన ప్రచార రథాలు రెడీ!

అమరావతి, ఆంధ్రప్రభ: జనసేన పార్టీ గుర్తు, సిద్ధాంతాలు, మేనిఫెస్టోలోని అంశాల గురించి ప్రజల్లో మరింత విస్తృత ప్రచారం కల్పించేందుకు ప్రచార రథాలను జనసేన పార్టీ సిద్ధం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు ఏర్పాటు చేసిన 17 ప్రచార రథాలను జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పూజా కార్యక్రమాలు నిర్వహించి, జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం సోమవారం సాయంత్రం గుంటూరు జిల్లా మంగళగిరిలోని పార్టీ కార్యాలయ ప్రాంగణంలో జరిగింది. ప్రతి ప్రచార రథం రోజుకు 10 గ్రామాల్లో అంటే మొత్తం 17 ప్రచార రథాలు రోజుకు 170 గ్రామాల్లో పార్టీ సిద్ధాంతాలు,మేనిఫెస్టో,పార్టీ ఎన్నికల గుర్తును ప్రచారం చేసేలా ప్రణాళిక రూపొందించారు. మరో 17 రథాలు సిద్ధం అవుతున్నాయి. ప్రచారంలో భాగంగా పార్టీ గుర్తు గాజు గ్లాసుతో ప్రజలకు టీ ఇవ్వడంతో పాటు మెంబర్ షిప్ డ్రైవ్ కూడా చేయనున్నారు.

అలాగే ప్రచార రథాల్లో అమర్చిన ఎల్ఈడీల ద్వారా ఓటర్లను ఆకట్టుకునే విధంగా రోజుకు రెండు మెయిన్ సెంటర్లలో పవన్‌కల్యాణ్ ప్రసంగాలను ప్రచారం చేయనున్నారు. పార్టీ గుర్తు,పార్టీ సిద్ధాంతాలు,పవన్ కల్యాణ్ ప్రసంగాలను ఊరూరా ప్రచారం చేస్తూ ప్రజలకు పార్టీ గుర్తు గాజు గ్లాసు గుర్తుండిపోయేలా ప్రచారం చేయనున్నారు.

అలాగే ప్రచార రథాలపై వీటికి సంబంధించిన వాటిని ఫ్లెక్సీల రూపంలో ఏర్పాటు చేశారు. మేనిఫెస్టోలోని కొన్ని హామీలను కూడా ప్రచార రథాలపై ఫ్లెక్సీల రూపంలో ఏర్పాటు చేశారు. వినూత్నరీతిలో ఏర్పాటు చేసిన ప్రచార రథాలు జనసేన శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ప్రచార రథం ప్రారంభించిన అనంతరం పవన్‌కల్యాణ్ పార్టీ గుర్తు గాజు గ్లాసులో టీ పోసి భవన నిర్మాణ కార్మికులకు అందజేశారు.

పోలీసులపై సీబీఐ కన్ను!

• ఆయేషామీరా కేసులో కీలక నిర్ణయం • 15 మందితో జాబితా తయారు • జాబితాలో అప్పటి సీపీ ఆనంద్, నల్గొండ ఎస్పీ రంగనాథ్ • కోర్టు తీర్పుల్లోని అంశాలతో ప్రశ్నావళి





అమరావతి, ఆంధ్రప్రభ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసు దర్యాప్తులో సిబీఐ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయేషా మీరా హత్య సమయంలో విచారణలో పాల్గొన్న అధికారులు, సిబ్బందితో పాటు పర్యవేక్షణ చేసిన అధికారులను విచారించనున్నారు. ఇప్పటికే 15మంది అధికారులు, సిబ్బందితో కూడిని జాబితాను వీరు తయారు చేసినట్లు తెలిసింది. హైకోర్టు ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన సీబీఐ అధికారులు ఆయేషా కేసుకు సంబంధించి రెండు వేర్వేరు కేసులు నమోదు చేశారు. కోర్టు కస్టడీలోని సాక్ష్యాల ధ్వంసంపై ఒక కేసు నమోదు చేయగా..హత్య, అత్యాచారంపై మరో కేసు నమోదు చేశారు. సాక్ష్యాల ధ్వంసానికి సంబంధించి ముగ్గురు కోర్టు ఉద్యోగులను బాధ్యులుగా చేసి కేసు నమోదు చేశారు. ఇదే సమయంలో ఆయేషా మీరా హత్య, అత్యాచారం కేసుకు సంబంధించి క్షేత్రస్థాయి ఆధారాల సేకరణకు అధికారులు దిగారు. ఈ క్రమంలోనే పలువురిని విచారించి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. వీరి విచారణ ముగియడంతో అప్పట్లో దర్యాప్తును పర్యవేక్షించిన అధికారులు, సిబ్బంది నుంచి వివరాలను రాబట్టాలని యోచిస్తున్నారు. కేంద్రసర్వీసుల్లో ఉన్న అప్పటి విజయవాడ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, తెలంగాణా రాష్ట్రంలోని నల్గొండ జిల్లా ఎస్పీగా ఉన్న రంగనాథ్‌ను కూడా ప్రశ్నించే అవకాశాలు ఉన్నట్లు సీబీఐ అధికార వర్గాల సమాచారం.

ఆయేషా మీరా హత్య, అత్యాచారం జరిగి పదకొండేళ్లు గడవడం..క్షేత్రస్థాయిలో సేకరించిన నమూనాలు, ఆధారాలు ధ్వంసం కావడంతో సిబీఐ అధికారులు ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన సీబీఐ అధికారులు కొద్ది రోజుల కిందట కేసులో నిందితునిగా ఆరోపణలు ఎదుర్కొని దిగువ కోర్టు జీవిత ఖైదీ విధించడంతో హైకోర్టు ద్వారా శిక్ష నుంచి బయటపడిన పిడతల సత్యంబాబు, తొలి నుంచీ ఆరోపణలు ఎదుర్కొంటున్న గూడవల్లి మాజీ సర్పంచి కోనేరు సతీష్, హాస్టల్ నిర్వాహకులు కోనేరు(పొట్లూరి) పద్మ, ఆమె భర్త శివరామకృష్ణ అబ్బూరి గణేష్, ఆయేషా మీరా తల్లి షంషాద్ బేగం సహా పలువురిని సిబీఐ అధికారులు విచారించారు. ఆయేషా మీరా హత్యకు గురైన పశ్చిమ ఇబ్రహీంపట్నంలోని శ్రీదుర్గా హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. ఒకే ఒక్క ఆధారంగా ఉన్న చార్జిషీటును పరిగణలోకి తీసుకొని ఆయేషా మీరా హత్యకు గురైన హాస్టల్‌ను పరిశీలించి కొన్ని వివరాలు సేకరించారు. ఇదే సమయంలో హత్యకు సంబంధించిన వివరాల కోసం ప్రజలు సమాచారం ఇవ్వాలంటూ కూడా అభ్యర్థించారు. ఓ వైపు చట్టపరమైన అంశాలు సేకరిస్తూనే మరో వైపు అప్పటి పోలీసు అధికారులను కూడా విచారించేందుకు నిర్ణయం తీసుకున్నారు. 2007 డిసెంబర్ 27 తెల్లవారుజామున జరిగిన ఆయేషా మీరా హత్య కేసులో పలువురు అధికారులు, సిబ్బంది దర్యాప్తు బాధ్యతలు చేపట్టారు. ఇటీవల మృతి చెందిన అప్పటి వెస్ట్‌జోన్ ఏసీపీ ఎల్ విజయకుమార్ పర్యవేక్షణలో ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ పర్యవేక్షణలో ఎస్ఐ శ్రీనివాస్ దర్యాప్తు నిర్వహించారు. పలు ఆధారాలు సేకరించి, అనుమానితులను అదుపులోకి తీసుకున్నప్పటికీ తగిన ప్రయోజనం కనిపించలేదు. ఇదే సమయంలో ఆయేషా మీరా హత్యపై రాజకీయ ఆరోపణలు రావడంతో నల్గొండ ఎస్పీగా ఉన్న రంగనాథ్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటైంది. సిట్ అధికారులు మూడు నెలల పాటు ఇబ్రహీంపట్నం, కంచికచర్ల, నందిగామ మండలాలకు చెందిన పలువురు యువకులను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. కేసు దర్యాప్తులో భాగంగా పేరుమోసిన పాత నేరస్తుడు గుర్విందర్ సింగ్ అలియాస్ లడ్డూని అదుపులోకి తీసుకొని నిందితునిగా నిర్ధారించారు. పలు ఆరోపణలు రావడం, పాదముద్ర సరిపోలక పోవడంతో వదిలేశారు. ఈ క్రమంలోనే నందిగామ పరిసర ప్రాంతాల్లో చిల్లర చోరీలకు పాల్పడే సత్యంబాబును సిట్ అధికారులు అదుపులోకి తీసుకొని నిందితునిగా నిర్ధారించి అరెస్టు చేశారు. విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు న్యాయస్థానం 2012లో జీవిత ఖైదు విధించగా హైకోర్టులో అప్పీలు చేశారు. తొలి నుంచి కూడా సత్యంబాబు నిందితుడు కాదంటూ వాదించిన ఆయేషా మీరా తల్లిదండ్రులు, ఇతరులు దాఖలు చేసిన వేర్వేరు పిటీషన్లను విచారించిన హైకోర్టు 2017 మార్చిలో సత్యంబాబును నిర్దోషిగా విడుదల చేసి పునర్విచారణకు ఆదేశించింది.

ప్రియాంకకు తెలంగాణ బాధ్యతలు?!



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్‌లో నూతనోత్సాహాన్ని కలిగించిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీకి త్వరలో తెలంగాణ కాంగ్రెస్ ప్రచారం లేదా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తున్నారా? దక్షిణాది రాష్ట్రాలపై కాంగ్రెస్ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించిందా? అంటే ఆ పార్టీ వర్గాల నుంచి అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇప్పటి వరకు తెరచాటు రాజకీయాల్లో ఉన్న ప్రియాంకగాంధీ.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా త్వరలో బాధ్యతలు తీసుకోనున్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చీరాగానే ఉత్తరప్రదేశ్‌లో తూర్పు ప్రాంతానికి ఇన్‌చార్జ్ బాధ్యతలను చేపట్టనున్నారు. దీనికి అదనంగా తెలంగాణ బాధ్యతలుకూడా అప్పగించాలని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా ఓడిపోవడం, మరో రెండు, మూడు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు రానుండటంతో పార్టీలో కీలక మార్పులు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్నప్పటికి.. పార్టీ నాయకత్వం లోపం వల్ల ఘోరమైన ఓటమిని చవి చూడాల్సి వచ్చిందని పార్టీ పెద్దలు ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా ఇప్పటివరకు వ్యవహరిస్తున్న రామచంద్ర కుంతియా విషయంలోనూ కాంగ్రెస్ అధిష్టానం తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లుగా సమాచారం. దక్షిణాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రమే బలంగా ఉన్న విషయం తెలిసిందే. గతేడాది జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తిస్థాయి మెజార్టీ రాకపోవడంతో తక్కువ స్థానాల్లో విజయం సాధించిన జేడీఎస్‌కు మద్దతిచ్చి.. బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకున్న విషయం తెలిసిందే. ఇక తెలంగాణలో బలంగా ఉన్నప్పటికి అధికారంలోకి రాలేకపోయింది. ఇక ఏపీ, తమిళనాడు, కేరళ పార్టీ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్న విషయం తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణను కేంద్రంగా చేసుకుని దక్షిణాధి రాష్ట్రాల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలనే ఆలోచనతో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్లుగా ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మెదక్ లోక్‌సభనుంచి పోటీచేసి విజయం సాధించిన విషయం తెలిసిందే. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రియాంక మెదక్ నుంచి పోటీ చేయాలని కాంగ్రెస్‌కు చెందిన పలువురు సీనియర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. అదే జరిగితే రాష్ట్రంలో పార్టీ మరింత బలోపేతం కావడంతో పాటు ఏపీలో కాంగ్రెస్ పుంజుకోవడానికి అవకాశం ఉంటుందన్నది వారి వాదన.

రాష్ట్ర నేతలకు అధిష్టానం పిలుపు

ఇకపోతే రాష్ట్రంలో పార్టీ ముఖ్యనేతలను ఢిల్లీకి రావాలని పార్టీ అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. ఫిబ్రవరి మొదటి వారంలో ముఖ్యనేతలు హస్తినకు వెళ్లనున్నారు. పార్టీ అధిష్టానం పెద్దలతో జరిగే సమావేశంలో ప్రధానంగా రాష్ట్రంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతానికి తీసుకునే చర్యలు, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితోపాటు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించే వ్యూహంపై చర్చించే అవకాశం ఉంది. తెలంగాణలో అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ నేతలు ధీమాతో ఉన్నప్పటికి.. తీరా ఎన్నికల ఫలితాలను చూస్తే చేదు అనుభవాన్ని చవి చూశారు. ఇవే ఫలితాలు పార్లమెంట్ ఎన్నికల్లో పునరావృతమైతే కేంద్రంలో ఇబ్బంది వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ అధిష్టానం గుర్తించింది. ఇప్పటికైనా లోపాలను గుర్తించి సరిచేసుకోకపోతే ఇబ్బందులు తప్పవనే అంచనాకు వచ్చారు. ఎన్నికల ఫలితాలు వచ్చి యాభై రోజులు కావస్తున్నప్పటికి ఓటమిపై లోతైన చర్చ జరగలేదని కొంతమంది కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అయితే పార్టీ రాష్ట్ర నాయకత్వం మాత్రం తూతు మంత్రంగా సమీక్షలు నిర్వహించి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా ఫిబ్రవరి మొదటి వారంలో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సమక్షంలో జరిగే సమీక్షలో ఎన్నికల్లో జరిగిన లోపాలన్ని బయటకు వస్తాయని పార్టీకి చెందిన ఒక సీనియర్ నేత అభిప్రాయపడ్డారు.

పచ్చకోట.. మండపేట!

(మొదటిపేజీ తరువాయి)

కాపు సామాజికవర్గ ఓట్లు అధికంగా ఉన్నప్పటికీ, ఆ సామాజికవర్గం నుంచి నాయకత్వ లోపం కనిపిస్తోంది. గత ఎన్నికల్లో కాపులను వైకాపా బరిలోకి దింపగా పరాజయం పాలుకావడంతో ఈసారి వ్యూహం మార్చి బీసీల్లో అత్యధికులున్న శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన వేరే నియోజకవర్గ నాయకుడు డాక్టర్ పితాని అన్నవరంను మండపేట బరిలో నిలపనుంది. దీంతో ఇక్కడ పోరు రసవత్తరంగా మారనుంది. వాస్తవానికి డబ్బు పంపిణీయే కీలకపాత్ర పోషించే ఈ నియోజకవర్గంలో ఆర్థిక వెన్నుదన్ను ఉన్న టీడీపీ అభ్యర్థి వేగుళ్ళ జోగేశ్వరరావు ఏ ఎన్నికల్లోనైనా తన సత్తాను చాటుతూ వస్తున్నారు. 2009 ఎన్నికల్లో తొలిసారిగా ఆయన ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రత్యర్థి ప్రజారాజ్యంకు చెందిన వివిఎస్ఎస్.చౌదరిపై విజయకేతనం ఎగురవేసారు. 2014లో తిరిగి ఆయన పోటీ చేయగా వైకాపా నుంచి వేరే నియోజకవర్గానికి చెందిన గిరజాల వెంకటస్వామినాయుడు పోటీపడ్డారు. అప్పట్లో దాదాపు 36వేల ఓట్ల మెజార్టీతో వేగుళ్ళ విజయం కైవసం చేసుకున్నారు. ఆయన తండ్రి దివంగత వేగుళ్ళ వీర్రాజు 38ఏళ్ళపాటు సర్పంచ్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా పట్టణాన్ని పరిపాలించారు. దీంతో ఆయన రాజకీయ వారసుడిగా వేగుళ్ళ తనదైన ముద్ర కొనసాగిస్తున్నారు.


2001లో ఆయన రాజకీయాల్లోకి అడుగిడారు. టీడీపీ తరుపున మున్సిపల్ చైర్మన్‌గా పోటీచేసి అప్పటి ప్రత్యక్ష ఎన్నికల్లో విజయం నమోదుచేసారు. ఈ క్రమంలో 2004లో పట్టణాన్ని అభివృద్ధి చేసిన క్రమంలో చంద్రబాబు అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే వివిఎస్ఎస్.చౌదరిని కాదని వేగుళ్ళకు సీటిచ్చారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌నుంచి డాక్టర్ బిక్కిన కృష్ణార్జునచౌదరి పోటీచేయగా వేగుళ్ళ ఓటమి చెందారు. 2005లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వేగుళ్ళ బలపర్చిన టీడీపీ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేసారు. అప్పట్నుండి పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు ఏ ఎన్నికలొచ్చినా ఈ నియోజకవర్గంలో టీడీపీ ఆధిక్యం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో 2009, 2014 శాసనసభ ఎన్నికల్లో వేగుళ్ళ విజయభేరీ మోగించారు. నియోజకవర్గంలోని 43గ్రామాలు మండపేట మున్సిపాలిటీలో పట్టున్న నేతగా ఎదిగారు. మండపేటలో వేగుళ్ళను ఢీకొట్టాలంటే ప్రత్యర్థులు సైతం ముందు వెనుక ఆలోచించే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రధాన ప్రతిపక్షపార్టీ అయిన వైకాపా ఇక్కడ అభ్యర్థిని ఎంపికచేయడంలో మహాకసరత్తే చేసింది. అన్ని అంశాలను బేరీజు వేసుకుని బీసీలైతే గట్టి పోటీ ఇవ్వచ్చున్న అంచనాకు వచ్చారు. తూర్పుగోదావరిలో 19 నియోజకవర్గాలుంటే అందులో మండపేటను వైకాపా తమ ఖాతాలో రాని సీటుగా లెక్కించుకోవడం గమనార్హం.

ఇందుకోసం ప్రయోగాలు చేయడానికి ఈ నియోజకవర్గాన్ని ఎంచుకున్నారన్న విశ్లేషణలు చేస్తున్నారు. దీనికి కారణం గత ఎన్నికల్లో కడియం మండలానికి చెందిన గిరజాలను ఇక్కడపోటీకి దింపి కాపు ఓట్లను కొల్లగొడదామన్న వ్యూహాన్ని వైకాపా రచించింది. కాగా అప్పట్లో భారీ మెజార్టీతో వేగుళ్ళ గెలుపొందడంతో ఆ పార్టీ ఆలోచనలో పడింది. వేగుళ్ళ జోగేశ్వరరావుకు సమీప బంధువైన వేగుళ్ళ పట్టాభిరామయ్యచౌదరిని ఇన్‌చార్జ్‌గా నియమించింది. తదనంతర పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌లో ఓ వెలుగు వెలిగిన యువనాయకుడు వేగుళ్ళ లీలాకృష్ణను అదనపు కోఆర్డినేటర్‌గా నియమించింది. ఈ ఇద్దరిలో ఎవరికో ఒకరికి సీటు కేటాయిస్తారని ప్రచారం జరిగింది. ఇద్దరూ రెండుగ్రూపులుగా ఏర్పడి హోరాహోరీగా సీటుకోసం పోటీపడ్డారు. ఈనేపథ్యంలో ప్రయోగాత్మకంగా మండపేటనుంచి శెట్టిబలిజ సామాజికవర్గాన్ని తెరమీదకు తీసుకురావాలని పార్టీ ఆలోచన చేసింది. ఇందుకనుగుణంగా అంగ అర్థబలమైన కాకినాడకు చెందిన డాక్టర్ పితాని అన్నవరంను తెరపైకి తీసుకొచ్చింది. ఆయన నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తూ ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తూ చాపకింద నీరులా ప్రచారం చేసుకుపోతున్నారు. దీంతో వైకాపా శ్రేణులు ఈసారి టీడీపీ కోటను బద్దలగొడతామన్న ధీమాతో ఉన్నారు. మరోవైపు పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ అభిమానులు అత్యధికసంఖ్యలో ఉన్న నియోజకవర్గంగా మండపేట పేరొందింది. దీంతో జనసేన ఇక్కడ ప్రభావితం చేయనుంది. సీటు ఎవరికిస్తారనేది అధినేత పవన్ ప్రకటించాల్సి ఉంది.

తొలినుంచీ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళుతున్న పిల్లా సత్యనారాయణ, వైకాపాను వీడి జనసేనలో చేరిన మాస్‌లీడర్‌గా గుర్తింపు పొందిన వేగుళ్ళ లీలాకృష్ణ, మాజీఎమ్మెల్యే దొమ్మేటి వెంకటేశ్వర్లు, చిరంజీవి కుటుంబానికి సన్నిహితుడైన మర్రెడ్డి శ్రీనివాస్‌లు జనసేన సీటుకు పోటీపడుతున్నారు. వీరిలో మర్రెడ్డి, పిల్లాలు కాపు సామాజిక వర్గీయులు కాగా వేగుళ్ళ లీలాకృష్ణ కమ్మ సామాజికవర్గానికి చెందినవారు. ఇక మాజీఎమ్మెల్యే దొమ్మేటి శెట్టిబలిజ సామాజిక వర్గీయులు కాగా వీరిలో సీటు ఖరారయ్యే అవకాశం ఉండగా ఎన్నికలు సమీపిస్తున్న వేళ కొత్త ముఖం తెరపైకి తెస్తారన్న ప్రచారం కూడా లేకపోలేదు. ఈ నియోజకవర్గంలో మొత్తం 2,12,178మంది ఓటర్లు ఉండగా అత్యధికంగా బీసీలు ముందువరుసలో ఉన్నారు. రెండవ స్థానంలో కాపులుండగా మిగిలిన కులాలన్నీ సమస్థాయిలో ఉన్నాయి. కాగా బీసీల్లో శెట్టిబలిజ కంటే చేనేత సామాజిక వర్గీయులు అధికంగా ఉండడం గమనార్హం. వీరంతా సంప్రదాయంగా టీడీపీ వెంట నిలుస్తుండడంతో ఇప్పుడు మండపేట నియోజకవర్గ ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. ఇక్కడ ఎన్నికలంటే ఖర్చుతో కూడిన వ్యవహారంగా పేరొందింది. మిగిలినచోట్లకంటే నాలుగైదురెట్లు అధిక వ్యయమయ్యే నియోజకవర్గంగా గుర్తింపు పొందింది. దీంతో ఈ ఎన్నికల్లో గెలిచి రావడం కత్తిమీద సాములాంటిదే.

ఏలూరు.. ఏలికెవ్వరు?

(మొదటిపేజీ తరువాయి)



బరిలో ఉంటారు. ఇక మళ్లీ టీడీపీ అభ్యర్థి సిట్టింగే అంటున్నారు. బడేటి బుజ్జికీ, ఆళ్ల నానీకి మధ్య పోటీ సంకుల సమరమే అంటున్నారు. ఏలూరు కేంద్రం క్రమంగా కార్పొరేషన్ అయ్యింది. మరో అడుగు ముందుకేస్తూ.. స్మార్ట్ సిటీగా మారబోతోంది. రూ. వందల కోట్లు పురోగతి కోసం వెచ్చిస్తున్నారు. సమస్యలు ఇంకా, అక్కడక్కడ ఉన్నాయి. అయితే, గతానికి భిన్నంగా ప్రగతి వేగం పుంజుకుంది. ఏలూరుకు పురాతన చరిత్ర ఉంది. దీనికి మరో పేరు హేలా పురి. చారిత్రిక హేలాపురిని కైవసం చేసుకునేందుకు ప్రధాన పార్టీలు నోట్లను వర్షించ నున్నాయి. ఆ దిశగా రంగం సిద్ధమౌతోంది. పార్టీల బలా, బలాల్ని చూస్తే..వింతగా ఉంది. నిన్నా, మొన్నటి దాకా ఉన్న పరిస్థితులు తారుమారయ్యాయంటారు. వార్ వన్ సైడ్ అనుకున్న వైకాపా కి అనుకోని ప్రతికూలతలు ఎదురౌతున్నాయి. వాస్తవానికి, నాని, బుజ్జిలు వ్యక్తి గతంగా బలవంతులే. ఆళ్ల నాని ఇప్పటికే రెండు సార్లు ఎమ్మెల్యేగా ఇక్కడే నెగ్గారు. గత ఎన్నికల్లో సిట్టింగ్ బడేటి పై ఓడారు. గతంలో బుజ్జి కూడా పీఆర్పీ నుండి బరిలో దిగారు. ఇదే నాని పై ఓడారు. అప్పట్లో ఇక్కడ ముక్కోణపు పోటీ జరిగింది. టీడీపీ అప్పుడు మూడో స్థానం తో సరిపెట్టుకుంది. దీంతో, 2014లో బడేటి టీడీపీ అభ్యర్థిగా బరిలో దిగారు. దెబ్బకు..దెబ్బ తీశారు. విజేత అయ్యారు. ఇటీవల కాలంలో ఏంతో కొంత టీడీపీ పై ప్రజా వ్యతిరేకత కన్పించింది. ఇక వార్ తమ సైడ్ అనుకుని వైకాపా కేరింతలు కొట్టింది. ఇంతలో, రాజమండ్రి జయహో బీసీ గర్జన సభ సక్సెస్ అయ్యింది. ఇక్కడ బీసీ లు కూడా అత్యంత కీలకం. ఉన్న దాదాపు 2.5 లక్షల ఓటర్లలో వీరే మెజార్టీగా ఉన్నారు. సీఎం చంద్రబాబు అనూహ్య వరాల జల్లులో వీరంతా తడిచి ముద్దయ్యారు. పరిస్థితి ఉన్నట్లుండి మారుతోంది. సందిగ్ధంలోని అధికార పార్టీకి అనుకోని అనుకూల పవనాలు ఉండొచ్చంటారు. పైగా, సమన్వయ కర్తగా ఉన్న మధ్యాహ్నపు ఈశ్వరీ బలరాంను తప్పించడంపై ఆ వర్గం గుర్రు గా ఉంది. అదను కోసం ఎంఆర్డీ రగులుతోంది. ఎమ్మెల్యే టిక్కెట్ ఆశ చూపించి నష్ట పర్చారన్న ఆక్రోశం ఆ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ వర్గంలో కన్పిస్తోంది. పార్టీని ఇంకా వీడకున్నా, వీరిపై జనసేన కన్నేసిందంటారు. మాజీ ఎమ్మెల్యే నాని అప్పటికే, పార్టీ జిల్లా అధ్యక్షునిగా.. కీలక ఎమ్మెల్సీ గా కూడా ఉన్నారు. దీనికి అదనంగా ఏలూరుకు సమన్వయ కర్తగా కూడా ఉన్నారు. ఇదే ఇప్పుడు అందర్లోనూ చర్చగా ఉంది. కీలక పశ్చిమలో ఆ పార్టీ వ్యూహం ఎంటన్నది ఎవ్వరికీ అంతుపట్టకుంది. ఏలూరులో ఎంఆర్డీ కి కూడా కీలకమైన అనుచర గణమే ఉంది. వీరంతా, దివంగత నేత కోటగిరి విద్యాధరరావుకు నమ్మకమైన వర్గంగా ఉండేది. ఆయన కుమారుడు కోటగిరి శ్రీధర్ కీలకమైన ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ గా ఉన్నారు. గ్రూప్ రాజకీయం బూచిగా చూపి ఆయన్ని కూడా పక్కన పెడతారనే వదంతులు ఉన్నాయి. అనూహ్యంగా ఇదే జరిగితే..పరిస్థితి ఎంటన్నది అంతుపట్టకుంది. శ్రీధర్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉన్నారు. అసెంబ్లీ సెగ్మెంట్ల కన్వీనర్లుతో సఖ్యతగా కనిపిస్తున్నారు. కోటగిరి కూడా ఏలూరులో కీలకంగా ఉన్నారు. వైకాపా తో చూస్తే టీడీపీలో అంతగా వర్గపోరు లేదనే చెప్పాలేమో!. ఓ దశలో సిట్టింగ్ బడేటిని మార్చుతారన్న ప్రచారం జరిగింది. ఎస్ ఎం ఆర్ పెదబాబు పేరు చర్చయ్యింది. ఆర్థికంగా బాగున్నా, సార్వత్రికాన్ని ఆయన ఎంతవరకు ఫేస్ చేయగలరు అన్నది తెరపైకి వచ్చింది అంటారు. కీలక కాపు సెగ్మెంట్ పై ప్రయోగం అంత సరి కాదన్న భావన వ్యక్తమైంది. ఏలూరు కార్పొరేషన్, రూరల్ కొంతభాగం సెగ్మెంట్లో ఉంది. తాజా సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. ఇక సేనానీ పవన్ తన ఓటును ఇక్కడే నమోదు చేయించారు. ఇదో కీలక సంఘటనగా ఉంది. ఓ దశలో నేరుగా పవన్ కళ్యాణ్ పోటీ ఇక్కడ్నుండే అన్న ప్రచారం కూడా జరిగింది. ఇదే జరిగితే పరిస్థితి ఇంకోలా ఉంటాది అంటారు. అయితే, సేనానితో బడేటికి నేటికీ సత్సంబంధాలు ఉన్నాయి అంటారు. ఇదో రచ్చబండ చర్చగా ఉంది. ఇక జనసేనలో సాగర్, శేషులు కీలకంగా ఉన్నారు. వీరితో పాటు మరికొందరు టిక్కెట్ పై కన్నేశారు. సేనానీ అభ్యర్థి ఎవ్వరన్నది తేలకుంది. కార్పొరేషన్ కాస్తా ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(ఈడా)గా మార్పు చెంద బోతోంది. ఏలూరును టీడీపీకి కంచు కోటగా చెబుతారు. 1989 నుండి చూస్తే..టిడిపి, కాంగ్రెస్లు చెరో మూడేసి సార్లు నెగ్గాయి. పాత ముఖాలు పోరు తప్పుకుంటే, సేనానీ వ్యూహంపై సర్వత్రా ఆసక్తి ఉంది. ఇద్దరు కాపుల మధ్య బీసీ క్యాండేట్ ను పెడతారా? లేక సంప్రదాయం కొనసాగిస్తారా? తేలకుంది. ఇక్కడి గెలుపోటముల్లో తప్పక జనసేన కీలకమే కాబోతోంది. ఇంతకీ, జిల్లా కేంద్రం ఏలూరులో ఏలిక ఎవ్వరన్నది మిస్టరీగా ఉంది.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
మంగళవారం 29 జనవరి 2019

చరిత్రలో ఈరోజు

రాలిపోని గీతం!



రాలిపోయే పువ్వా నీకు రాగాలెందుకే గీతానికి 2006లో వచ్చిన నేషనల్ ఫిల్మ్ అవార్డును తిరస్కరించిన వేటూరి సుందరరామ్మూర్తి.. తెలుగుకి ప్రాచీన హోదా ఇస్తే తప్ప స్వీకరించనని షరతు విధించారు. దీంతో 2008లో భారత ప్రభుత్వం తెలుగు భాషకి ప్రాచీన హోదా కల్పించింది. తెలుగు సినిమా పాటకి శ్రీశ్రీ తరువాత నేషనల్ ఫిల్మ్ అవార్డు అందుకున్న ఘనత వేటూరి సుందర రామ్మూర్తిదే. 1952లో ఆంధ్రప్రభ దిన పత్రికలో జర్నలిస్టుగా కెరీర్ ప్రారంభించిన వేటూరి.. ఆనాటి ఎడిటర్ నార్ల వెంకటేశ్వరరావు వద్ద పత్రికా రచనలో ఓనమాలు దిద్దుకున్నారు. ఆ తరువాత ఆంధ్రపత్రికలో చేరారు. అక్కడ బాపు, ముళ్లపూడి వెంకట రమణ సహచరులుగా ఉండేవారు. 1962లో ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూని ఇంటర్వ్యూ చేసిన తొలి, ఏకైక తెలుగు జర్నలిస్టుగా వేటూరి ఒక అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. అసెంబ్లీ రిపోర్టర్‌గా కూడా పని చేసిన వేటూరి. తెలుగు చిత్ర పరిశ్రమలో ఎన్టీ రామారావు ఆహ్వానించగా తొలి సినీ గీతాన్ని కే విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన ఓ సీత కథ సినిమాకి రాశారు. ఒలమ్మి తిక్క రేగిందా వంటి మాస్ సాంగ్స్ నుంచి మానస వీణ మధుగీతం, వేణువై వచ్చాను, ఈ దుర్యోధన దుశ్శాసన వంటి విలక్షణ గీతాలు రచించారు. నాలుగు దశాబ్దాలకి పైగా తెలుగు చిత్రసీమను ఊగించి, శాసించిన వేటూరి గీత రచన తరువాత ఎందరో గేయ రచయితలకు విశ్వ విద్యాలయంగా మారిందంటారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 2007లో వేటూరికి డాక్టరేట్ ప్రదానం చేసింది. తెలుగు వారి మదిలో చిరస్మరణీయుడిగా ఉండిపోయిన వేటూరి సుందర రామ్మూర్తి 29, జనవరి, 1936న కృష్ణా జిల్లాలోని పెద్దకళ్లేపల్లిలో జన్మించారు.

కారుకి బర్త్ సర్టిఫికెట్!



ప్రపంచంలో తొలి ఆటోమొబైల్ పుట్టిన రోజు ఇది. ఇప్పుడు మనం చూస్తున్న బెంజ్ కారుకి తొలి రూపానికి సరిగ్గా ఇదే రోజున 1886లో పేటెంట్ ఇచ్చారు. ఒక సిలిండర్, టూ స్ట్రోక్ యూనిట్ ఉన్న ఈ వాహనాన్ని కార్ల్ బెంజ్ రూపొందించారు. గ్యాసోలిన్‌తో రూపొందించిన ఇంజన్‌తో ఈ మూడు చక్రాల ఆటోమొబైల్ రోడ్డెక్కింది. ఆ తరువాత దీన్నే అభివృద్ధి చేసి తక్కువ బరువున్న సింగిల్ ఛాసిస్‌తో కారు రూపొందించారు. తొలినాటి మూడు చక్రాల ఆటోమొబైల్ హార్స్ పవర్ 0.75. దీనికి హై వోల్టేజీ ఎలక్ట్రికల్ వైబ్రేటర్ ఇగ్నిషన్ కూడా ఉండడం విశేషం. ఇంజన్ వేడెక్కకుండా నీటి ఆవిరితో చల్లార్చే ప్రక్రియ కూడా ఈ ఆటోమొబైల్‌లో ఏర్పాటు చేశారు. జనవరి 29, 1886న ఈ మూడు చక్రాల ఆటోమొబైల్‌కి ఇచ్చిన పేటెంట్‌ను కారుకి బర్త్ సర్టిఫికెట్‌గా భావిస్తారు. దీన్నే బెంజ్ పేటెంట్ మోటార్‌వాగన్ అని పిలుస్తారు. గ్యాసోలిన్‌తో సొంతంగా శక్తిని తయారు చేసుకొని నడిచే తొలి యంత్రం కావడంతోనే దీనికి పేటెంట్ ఇవ్వడం, కార్ల్ బెంజ్‌ని కారుకి సృష్టికర్తగా గుర్తించడం జరిగింది. ఈ ఆటోమొబైల్‌ని 1886లో తయారు చేసినప్పుడు దాన్ని నియంత్రించడం చాలా కష్టంగా ఉండేది. ఒక ప్రదర్శనలో ఈ వాహనం నేరుగా వెళ్లి గోడను ఢీకొట్టింది. 1889లో పారిస్‌లో జరిగిన ఎక్స్‌పోలో మూడు చెక్క చక్రాలతో తయారు చేసిన పూర్తిస్థాయి వాహనాన్ని ప్రదర్శించారు. ఈ వాహనాన్ని బెంజ్ పేటెంట్ మోటార్ వాగన్ పేరు పెట్టి విక్రయాలను 1888 వేసవిలో మొదలు పెట్టారు. ఈ విధంగా చరిత్రలో తొలిసారి వాణిజ్యపరమైన మోటారు వాహనం మార్కెట్‌లోకి వచ్చింది.

ఓప్రాఫికేషన్!



అమెరికాలోని మిసిసిపీ నదీ తీరంలోని ఓ కుగ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన ఓప్రా విన్‌ఫ్రే జీవితమే టీవీ సీరియల్ అంత పొడుగ్గా ఉంటుంది. 14వ ఏటా అకతాయి కుర్రాడి కారణంగా గర్భవతి అయిన ఓప్రా.. ప్రసవంలో కుమారుడిని పోగొట్టుకుంది. 19వ ఏట చికాగోలో రేడియోలో అనౌన్సర్‌గా చేరిన ఓప్రా అక్కడి నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించింది. టెలివిజన్ చరిత్రలోనే అత్యధిక రేటింగ్ పొందిన ద ఓప్రా విన్‌ఫ్రే షోతో 20వ శతాబ్దిలో అత్యంత ధనికురాలైన ఆఫ్రికన్ అమెరికన్‌గా రికార్డు సృష్టించింది. ఉత్తర అమెరికాలో నల్ల జాతికి చెందిన వారిలో తొలి అపర కుబేరురాలిగా అవతరించిన విన్‌ఫ్రే.. అదే అమెరికా చరిత్రలోనే ఎవరూ చేయనన్ని దాన ధర్మాలు చేసి ఆ విధంగా కూడా రికార్డు సృష్టించారు. ప్రపంచ టీవీ షోల్లోకి తొలిసారిగా ఎల్జీబీటీ ప్రజలను కూడా పరిచయం చేసిన ఘనత విన్‌ఫ్రేకే దక్కుతుంది. మీడియాలో అప్పటి వరకు ఉన్న సంప్రదాయ నిషేధాలను బద్దలు కొట్టిన విన్‌ఫ్రే.. టీవీ ప్రసారాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. ఇదే కాకుండా 2008 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కూడా విన్‌ఫ్రే కీలక పాత్ర పోషించారు. నాటి డెమొక్రాటిక్ అభ్యర్థి బరాక్ ఒబామాకి పది లక్షల ఓట్లు విన్‌ఫ్రే ప్రభావంతోనే వచ్చాయంటారు. మైఖేల్ జాక్సన్‌తో ఓప్రా చేసిన ఇంటర్వ్యూని అమెరికాలో 36.5 మిలియన్ల మంది వీక్షించడం ఒక అరుదైన రికార్డుగా నమోదైంది. అమెరికాలో ప్రముఖ పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ విన్‌ఫ్రే కార్యక్రమాలకు ఓప్రాఫికేషన్ అని పేరు పెట్టడం విశేషం. విన్‌ఫ్రే 1954, జనవరి, 29న జన్మించారు.

స్టేజెక్కిన రోమియో, జూలియట్!



ప్రపంచ ప్రేమికుల కథలకు, సినిమాలకు, గేయాలకు, కవితలకు అన్ని సాహితీ రూపాలకు ప్రేరణగా నిలిచిన షేక్‌స్పియర్ నాటక రోమియో జూలియట్‌ను 29, జనవరి, 1595లో ప్రదర్శించారని భావిస్తారు. రోమియో జూలియట్ నాటకాన్ని అధికారికంగా 1597లో ముద్రించారు. రోమియో జూలియట్ ఆధారంగా ఎన్నో సాహితీ రూపాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. అద్భుతమైన ఇంగ్లీషు నాటకాల రచయితగా విలియం షేక్‌స్పియర్ తన తొలి నాళ్లలో రాసిన రోమియో జూలియట్ విషాదాంత నాటకం. రోమియో, జూలియట్ కుటుంబాల మధ్య వైరంలో వీరి ప్రేమ నానా అగచాట్లకు గురవుతుంది. షేక్ స్పియర్ జీవిత కాలంలోనే రోమియో, జూలియట్, హామ్లెట్ నాటకాలు సుప్రసిద్ధమయ్యాయి. రోమియో జూలియట్ పేర్లు ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ప్రేమికులకు మారు పేర్లుగా నిలిచాయి. షేక్‌స్పియర్ నాటకాలు కవితాత్మకంగా ఉంటూ ప్రేక్షకులను ఎంతో ఉత్తేజితం చేశాయి. 15వ శతాబ్ది నుంచి మొదలు కొని 21 శతాబ్ది వరకు రోమియో జూలియట్ నాటకాన్ని ప్రపంచంలో పలు ప్రాంతాల వారు, పలు భాషల వారు తమకు అనుగుణంగా మార్చుకుంటూ వచ్చారు. 1936లో రోమియో జూలియట్ నాటకం ఆధారంగా జార్జ్ కుకోర్ సినిమా తీశారు. దీన్నే ఫ్రాంకో జెఫిరెల్లీ 1968లో మరో సినిమాకి ఆధారం చేసుకున్నారు. 1996లో బాజ్ లెహ్రమాన్ సరికొత్తగా రోమియో జూలియట్ సినిమా నిర్మించారు. రోమియో జూలియట్ నాటకం ఆనాడే ఇంగ్లాండ్ సరిహద్దులు దాటి యూరోప్ వ్యాప్తంగా వివిధ భాషల్లోకి అనువాదమైంది.

మళ్లీ రచ్చకెక్కిన సీబీఐ!

ఐసీఐసీఐ బ్యాంకు మాజీ సీఈఓ చందా కొచ్చర్‌పై ఎఫ్ ఐఆర్ దాఖలు చేసిన సీబీఐ అధికారి సుధాంశుధర్ మిశ్రాను రాంచీకి బదిలీ చేయడంతో సీబీఐ వ్యవహారాలు మరోసారి రచ్చకెక్కాయి. వీడియోకాన్ సంస్థకు క్విడ్ ప్రోకో కింద రుణాలు మంజూరు చేసినందుకు చందా కొచ్చర్ పై ఆరోపణలకు సరైన సాక్ష్యాధారాలు ఉండటం వల్లనే ఆమెపై ఎఫ్ఐఆర్‌ని సీబీఐ నమోదు చేసింది.ఈ కేసుకు సంబంధించి ప్రాథమిక దర్యాప్తు జరపకుండా మిశ్రా జాప్యం చేశారన్న ఆరోపణలు వచ్చాయి. అయితే, కొచ్చర్‌పై ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన మరునాడే ఆయనను రాంచీలో సీబీఐ ఎస్పీ పదవికి బదిలీ చేయడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. కొచ్చర్‌పై కేసు సమాచారాన్ని ఆయన లీకులందించారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. సీబీఐలో కానీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఈడీ)లో కానీ అధికారుల బదిలీలు రొటీన్‌గా జరిగితే ఎటువంటి అనుమానాలు తలెత్తవు. ఒక ప్రముఖ వ్యక్తిపై ఎఫ్ ఐఆర్‌పై సంతకం చేసిన అధికారినే మరుసటి రోజు బదిలీ చేశారంటే అనుమానాలు తలెత్తడం సహజమే. ఇందుకు బయట ఎక్కడో కాదు, సీబీఐలోనే ఉదాహరణలు ఉన్నాయి. మాంసం వ్యాపారి ఖురేషి నుంచి సిబీఐ ప్రత్యేక డైరక్టర్ హోదాలో రాకేష్ ఆస్తానా రూ.3.5 కోట్లు లంచం తీసుకున్నారన్న ఆరోపణలపై దర్యాప్తు ప్రారంభించిన మనీష్ కుమార్ సిన్హాను నాగపూర్ కి బదిలీ చేయడం, దానిపై ఆయన ఆస్తానాపై ఆరోపణలు చేయడం ఇంకా మన స్మృతిపథంలో ఉన్నాయి.ఆస్తానా, అప్పటి సీబీఐ డైరక్టర్ అలోక్ వర్మ పరస్పరం ఆరోపణలు చేసుకోవడమే కాకుండా, కోర్టు కెక్కడంతో సీబీఐ పరువు బజారున పడింది. యూపీఏ హయాంలో అప్పటి సీబీఐ డైరక్టర్ రంజిత్ సిన్హా కూడ దర్యాప్తు సమాచారాన్ని లీక్ చేశారన్న ఆరోపణపై ఆయనను బదిలీ చేయడం జరిగింది. సీబీఐ పట్ల ప్రజల విశ్వాసం సన్నగిల్ల డానికి ఇలాంటి సంఘటనలే ఉదాహరణలు.ఒక కేసు విషయంలో సమాచారం లీక్ అయిందంటే ఏదో పొర పాటున బయటికి పొక్కిందేమోనని సరిపెట్టుకోవచ్చు, కానీ, కీలకమైన వ్యక్తులపై దర్యాప్తునకు సంబంధించిన సమాచారం లీక్ కావడం ఉద్దేశ్య పూర్వకంగానే జరిగిందని భావించడానికి ఆస్కారం ఉంది. సర్వోన్నత న్యాయస్థానమే సీబీఐని పంజరంలో పక్షిగా అభివర్ణించినప్పుడు ఇక దాని స్వతంత్ర ప్రతిపత్తిపై ఎవరికి నమ్మకం ఉంటుంది? ప్రభుత్వాలు మారినా సీబీఐ వంటి సంస్థల పనితీరు మారక పోవడానికి కారణం,రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన సంస్థలను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం అధికారంలో ఉన్నవారు వినియోగించుకోవడమే. రిటైరైన తర్వాత మళ్ళీ అంతే జీతభత్యాలు వచ్చే పదవులకు ఆశపడి ఈ సంస్థల్లో పని చేసే అధికారులు అధికారంలో ఎవరుంటే వారి అడుగులకు మడుగులొత్తుతున్నారు. ఈ విషయం ఎన్నో కేసుల్లో రుజువైంది.ప్రస్తుత కేసులో మిశ్రా ప్రాథమిక దర్యాప్తును చేపట్టడంలో జాప్యం చేయడాన్ని బట్టి అనుమానాలు రేకెత్తాయి.అయితే, మిశ్రా బదిలీకి అంతకుముందే నిర్ణయం జరిగిపోయిందనీ, కొచ్చర్ పై ఎఫ్ ఐఆర్ దాఖలు చేసిన మరునాడే బదిలీ కావడం అనేది కాకతాళీయమని సీబీఐ వర్గాలు సహజంగానే కొట్టి వేశాయి.

వీడియో కాన్ కేసులో సీబీఐ ఎఫ్ ఐఆర్‌లో ఐసీఐసీఐ బ్యాంకు ప్రస్తుత సీఈఓ సంజయ్ భక్షితో సహా పలువురు బ్యాంకు ఉన్నతాధికారుల పేర్లు ఉండటంపై ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తన బ్లాగ్ లో దర్యాప్తులో దుస్సాహసం అంటూ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం అమెరికాలో చికిత్స పొందుతున్న జైట్లీ బాధ్యతలను (ఆర్థికశాఖ) రైల్వే మంత్రి పీయూష్ గోయెల్‌కి ప్రధాని నరేంద్రమోడీ అప్పగించిన సంగతి తెలిసిందే. వేల మైళ్ళ దూరంలో అమెరికాలో చికిత్స పొందుతున్న జైట్లీ ఈ కేసు ఎఫ్ఐఆర్‌లో ఉన్నతాధికారుల పేర్లు ప్రస్తావించడాన్ని తప్పు పట్టిన తీరును కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ ఖండించారు. అరుణ్ జైట్లీకి ఎందుకీ ఉలికి పాటు అని ఆయన ప్రశ్నించారు. బొగ్గు కుంభకోణంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరిగిన సీబీఐ దర్యాప్తు మధ్యంతర నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించడానికి ముందే ఆనాటి న్యాయ శాఖమంత్రి అశ్వినీకుమార్ తెప్పించుకుని అప్పటి సీబీఐ డైరక్టర్‌కు మార్పులు సూచించారు. సీబీఐ దర్యాప్తుల మీద నీలినీడలు గతంలోనూ ఉండేవి. నగర్‌వాలా బ్యాంకు దోపిడీ కేసు, హర్షద్ మెహతా, బోఫోర్స్ కుంభకోణాలపై సీబీఐ దర్యాప్తు జరిపినప్పుడు కూడా రాజకీయ జోక్యం గురించిన ఆరోపణలు వచ్చాయి. బోఫోర్స్ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తుమీద నమ్మకం లేదని బీజేపీ పట్టుపట్టడంతో ఆనాటి ప్రధాని రాజీవ్ గాంధీ శంకరానంద నేతృత్వంలో సంయుక్త పార్లమెంటరీ కమిటీని నియమించారు. కాంగ్రెస్ చేసిన తప్పులనే ఇప్పుడు బీజేపీ చేస్తోంది. అధికారంలో ఉన్న రాజకీయ నాయకులు రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారనడానికి ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలు. ప్రభుత్వాలు మారినా పాలనా విధానం మారలేదు. అధికారుల ధోరణి మారలేదు. ఒకవేళ ఎవరైనా అధికారులు నిక్కచ్చిగా వ్యవహరిస్తే వారిని శంకరగిరి మన్యాలు పట్టిస్తారు.హర్యానాలో అశోక్ ఖేమ్కా అనే ఐఏఎస్ అధికారి నిక్కచ్చిగా వ్యవహరించినందుకు 25ఏళ్ళ సర్వీసులో 47 సార్లు బదిలీ అయ్యారు. అధికారంలో ఉన్న పార్టీలన్నీ దర్యాప్తు సంస్థల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నాయి. ఇందుకు ప్రాంతీయ పార్టీల మినహాయింపేమీ లేదు.

మోడీ హామీలు... నీటిమూటలు!



సంపూర్ణ ఆధిక్యతతో ప్రభుత్వాన్ని ఏర్పరచిన తొలి కాంగ్రెసేతర పార్టీగా నరేంద్ర మోడీ నాయకత్వంలో బీజేపీ భారతదేశ రాజకీయ చరిత్రలో నిలిచిపోతుంది అనేది కాదనలేని వాస్తవం. 1984 సంవత్సరం తరువాత ఒక సుస్థిర ప్రభుత్వ ఏర్పాటు 2014లో నరేంద్ర మోడీ ప్రాభవం వరకూ సాధ్యం కాలేదు. అంతటి జనాకర్షణ సాధించిన మోడీ గ్రాఫ్ క్రమంగా తగ్గుతోంది. అప్పటివరకూ గుజరాత్‌లో తప్ప మిగిలిన రాష్ట్రాలలో అంతగా ఇమేజ్ లేనటువంటి మోడీ ప్రభంజనం ఎలా సాధ్యం అయింది? మిస్టర్ క్లీన్‌గా పేరు తెచ్చు కున్న నితీష్ కుమార్‌ను అధిగమించి మోడీ ఎలా దూసుకెళ్లారు? మోడీని భారతదేశం మొత్తం ఎందుకు నమ్మింది? స్థూలంగా చూస్తే కొన్ని కారణాలను మనం విశ్లేషించుకోవచ్చు. మోడీ వాగ్ధాటి ఒకటి కాగా, మోడీ ఈ దేశానికి ఇచ్చిన హామీలు ప్రజలను సమ్మోహితులను చేశాయి. ముఖ్యంగా యూపీఏ ప్రభుత్వం లక్షల కోట్ల కుంభకోణా లకు పాల్పడిందని, తాను అధికారంలోకి రాగానే అందరి మీద విచారణ జరిపించి జైళ్లలో పడేయిస్తానని మోడీ నమ్మ బలికారు. అలాగే, విదేశాల్లో నల్లకుబేరులు దాచుకున్న లక్షల కోట్ల రూపాయలను వెనక్కు తెచ్చి ఒక్కొక్క పౌరుడి ఖాతాలో పదిహేను లక్షల రూపాయలు వేస్తామని ప్రకటించారు. అలాగే పార్లమెంట్‌కు ఎన్నిక అయిన సభ్యులలో అవినీతిపరులను ఏడాదిలోగా జైలుకు పంపిస్తానని వాగ్దానం చేశారు. ఇక ఆంధ్ర ప్రదేశ్ వ్యవహారానికి వస్తే, తిరుపతిలో జరిగిన ఎన్నికల సభలో ఆంధ్రప్రదేశ్ కు పదేళ్ళపాటు ప్రత్యేక హోదా ఇస్తామని, విభజన హామీలన్నింటిని నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ ను ప్రశంసించారు. ఇలాంటి వాగ్దానాలు అనేకం మోడీ పట్ల ప్రజలలో మోజును విపరీతంగా పెంచాయి. ఎవ్వరూ ఊహించని విధంగా బీజేపీ అధికారానికి కావాల్సిన స్థానాలకంటే పదిసీట్లు ఎక్కువ సాధించింది. ఆ విధంగా మోడీ బీజేపీలో ఒక హీరో వర్షిప్ తెచ్చుకున్నారు. మోడీకి పదిహేనేళ్లపాటు ఎదురే లేదని అనిపించింది. కానీ, ఆ తరువాత జరిగిన అనేక పరిణామాలు మోడీ మీద ప్రజలు పెట్టుకున్న భ్రమలు పటాపంచలు కావడానికి దోహదం చేశాయి. కాంగ్రెస్ హయాంలో జరిగాయని చెప్పబడుతున్న కుంభకోణాలపై విచారణ ఊసే లేదు. లక్షలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేశారని ఆరోపణలకు గురైన మాజీ మంత్రులు అందరూ స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ఒక్కరిపై కూడా విచారణ జరగలేదు. కొంతలో కొంత కాంగ్రెస్ ప్రభుత్వమే నయం అనిపించేలా వ్యవహరిస్తున్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ పాలనలో కాంగ్రెస్ మంత్రుల మీద కేసులు పెట్టారు. సురేష్ కల్మాడీ, యూపీఏ భాగస్వామ్య పక్షమైన డిఎంకె నాయకురాలు కనిమొళి వంటి వారిని జైళ్లలో పెట్టారు. సీబీఐ విచారణకు ఆదేశించారు.

ఇకలక్షలకోట్ల దోపిడీ జరిగిందని చెప్పబడుతున్న బొగ్గు కుంభకోణం, 2 జి స్పెక్ట్రమ్ కుంభకోణాలను విచారించిన న్యాయస్థానం అదంతా ఊహాజనితమని, ఆ కుంభకోణమే ఒక పెద్ద కల్పన అని కేసును కొట్టేసింది. దీన్ని బట్టి చూస్తే కుంభకోణాలు అనే ఒక నకిలీ ఆయుధాన్ని చేబూని, మీడియాతో విస్తృతంగా ప్రచారం చేయించి ఎన్నికల్లో బీజేపీ లాభపడ్డదేమో అన్న సందేహం కలుగుతున్నది. విచిత్రం ఏమిటంటే, పలు కుంభకోణాలను కాంగ్రెస్ కు అంటగట్టిన మోడీయే రఫెల్ యుద్ధవిమానాల కొనుగోలులో ముప్ఫయ్ఆరువేల కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడ్డారని మోడీ మీదనే ఆరోపణలు వెల్లువెత్తాయి! దీన్ని ధ్రువపరచలేము కానీ, మోడీ మీద ఈ మచ్చ జీవితకాలం నిలవడం గ్యారంటీ.

ఇప్పుడు అధికారంలో ఉన్నారు కాబట్టి మోడీ మీద విచారణలు జరగకపోవచ్చు కానీ, రేపో ఎల్లుండో బీజేపీ అధికారాన్ని కోల్పోయి కాంగ్రెస్ గద్దె ఎక్కితే, మోడీ మీద విచారణ జరిగే అవకాశం ఉన్నదని చెప్పవచ్చు.

ఇక మోడీ చేపట్టిన అనేక ఆర్థిక సంస్కరణలు వికటించాయి. వాటిలో ముఖ్యమైనది పెద్దనోట్ల రద్దు. ఒక వంక కేబినెట్ సమావేశం జరుగుతుండగానే, మధ్యలో దూరదర్శన్ కేంద్రానికి వెళ్లి, 500, 1000 రూపాయల నోట్లు మరో నాలుగు గంటల్లో చిత్తుకాగితాలతో సమానం అని ప్రకటించడం మోడీ నియంతృత్వ స్వభావానికి నిదర్శనంగానే భావించాల్సి వస్తుంది. నల్లధనాన్ని అరికట్టడం, ఉగ్రవాదాన్ని నియంత్రించడం కారణాలుగా చెప్పినప్పటికీ, మళ్ళీ తరువాత అయిదువందల రూపాయల నోట్లతో పాటు రెండువేల రూపాయల నోట్లను కూడా ముద్రించడంతో, మోడీ చెప్పిన కారణాలు సమంజసంగా అనిపించలేదు. హఠాత్తుగా పెద్దనోట్లను రద్దు చెయ్యడంతో తమవద్ద ఉన్న నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్స్ చెయ్యడానికి ప్రజలు అష్టకష్టాలు అనుభవించారు. ఏటీఎంలు ఖాళీ డబ్బాలుగా మారిపోయాయి. తమ డబ్బు తాము తీసుకోవడానికి రోజులతరబడి బ్యాంకు లముందు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఈ క్రమంలో సుమారు ఎనభై మంది మరణించారని వార్తలు వచ్చాయి. చిరు వ్యాపారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. భూవ్యాపారం కుదేలు అయింది. నోట్ల రద్దుతో అల్లల్లాడిపోయిన జనానికి జీ ఎస్టీ రూపంలో మరో బాంబును పేల్చారు మోడీ. ఈ దెబ్బకు కొన్ని పరిశ్రమలు దెబ్బతినిపోయాయి. బ్యాంకింగ్ రంగం అతలాకు తలమై పోయింది. ప్రస్తుత సమయానికి భారతదేశం అప్పులు ఎనభై లక్షల కోట్ల రూపాయలకు చేరాయి అంటున్నారు.

అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గినా, మన దేశంలో ఇంధనం ధరలు మాత్రం అదుపులోకి రాలేదు. బ్యాంకులకు వేలకోట్ల రూపాయలను ఎగవేసినవారు దర్జాగా దేశాన్ని విడిచి పారిపోయారు. నల్లధనం ఎక్కడున్నదో తెలియదు. ఉగ్రవాదం అంతం కాలేదు. ఏ విధంగా పరిశీలించి నప్పటికీ, మోడీ నాలుగున్నరేళ్ల పాలనలో విజయలకన్నా, వైఫల్యాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మూడు ప్రధాన రాష్ట్రాల్లో బీజేపీ అధికారాన్ని కోల్పోయింది. అధికారాన్ని పోగొట్టుకున్నప్పటికీ, ఓట్లసంఖ్య పెద్దగా పడిపోలేదు. ఈ అంశం ఒక్కటే రాబోయే ఎన్నికల్లో బీజేపీ పట్ల కొద్దిగా ఆశలను మిగుల్చుతున్నది. అయితే గత ఎన్నికల్లో మాదిరిగా పూర్తి మెజారిటీ తో బీజేపీ అధికారం చేపడుతుందన్న నమ్మకం మాత్రం సన్నగిల్లుతున్నది.



-ఇలపావులూరి మురళీ మోహన రావు
సీనియర్ రాజకీయ విశ్లేషకులు

ఓటరు మాటే ఫైనల్!

జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకున్న రోజునే చాలా దిన పత్రికల్లో ఈవీఎంలపై విమర్శలకు ప్రధాన ఎన్నికల కమిషనర్ సునీల్ ఆరోరా స్పందన ప్రముఖంగా రావటం కాకతాళీయమే ఐనా ఓటరుకు ఈవీఎంకు మధ్యన ఏర్పడిన సమస్యను ప్రస్ఫుటించేలా చేసింది. బుల్లెట్ ద్వారా కాదు,బ్యాలెట్ ద్వారా న సమాజ శ్రేయస్సు లభ్యం చేసుకోవాలనీ, అభివృద్ధిని సాధించు కోవాలని విప్లవాన్ని సమర్థించని ప్రజాస్వామ్య వాదులు ఎలుగెత్తి చాటుతున్నఈ జనరేషన్‌లో చిత్రంగా బ్యాలెట్ అనే పదం విలువ కోల్పోతుండటం గమనార్హం. బ్యాలెట్ స్థానే ఈవీఎంలు వార్తల్లో ప్రముఖంగా చోటు చేసుకోవడం కూడా గమనార్హమే. అసలు విషయానికి వస్తే, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు స్థానే మళ్ళీ బ్యాలెట్ పత్రాలను ప్రవేశ పెట్టే సమస్య లేనే లేదని ప్రధాన ఎన్నికల కమిషనర్ కుండబద్దలు కొట్టినట్టుగా చెప్పారు. ప్రధాన ప్రతిపక్షాలు, కొన్ని ఎన్నికల్లో గెలుస్తున్నా కూడా, మాకు బ్యాలెట్ పత్రాల తోనే ఎన్నికలను నిర్వహించాలని, ఈవీఎంల మీద నమ్మకం లేదని చెబుతున్నాయి. విపక్షాలు ఆ విధంగా చెప్పటానికి కొన్ని కారణాలు కనపడుతుండొచ్చు కూడా.

చాలా సంవత్సరాల క్రిందట ఈవీఎంలలనను ట్యాంపర్ చేయొచ్చని తెలుగు రాష్ట్రాలకు చెందిన కొందరు సాఫ్ట్‌వేర్ నిపుణులు ఛాలెంజ్ చేసి, ఎన్నికల కమిషన్ ముందు నిరూపించే ప్రయత్నం చేశారు కూడా. కానీ, ఈవీఎంలను తయారు చేసిన కంపెనీ పేటెంట్ హక్కు ప్రస్తావన తీసుకుని వచ్చి ఆ ప్రయత్నాన్ని మధ్యలోనే ఆపేయించింది. అంతేకాదు, నిరూపించడానికి తీసుకుని రాబడ్డ ఈవీఎం దొంగిలించబడ్డదనే అభియోగంతో ఆ కథా అంతా అరెస్టుల దాకా వెళ్ళింది. అంతేకానీ,విషయం తేలలేదు. తర్వాత లొసుగులు తొలగించే ప్రయత్నంలో ఎన్నికల కమిషన్ నిపుణుల సలహామేరకు ఓటు రసీదు యంత్రాలను (వీవీ ప్యాట్‌లను) ఈవీఎంలతో పాటు పోలింగ్ బూత్‌లలో అమర్చే ఏర్పాటు చేసింది. ఓటువేసిన మరుక్షణమే ఓటరు తన ఓటు వేసినట్టుగా నమోదు అయిందా లేదా అనేది చూసుకోవచ్చు. క్షణాల్లోనే ఆ రసీదులు ప్రత్యేకంగా అమర్చిన అరలో పొందుపర్చబడే విధంగా ఈ యంత్రం తయారు కాబడింది. దీని వల్ల అవసరమనుకున్నప్పుడు ఆ రసీదులను చూడటమే కాకుండా కౌంట్ కూడా చేసుకుని అభ్యర్థికి ఎన్ని ఓట్లు నమోదు అయ్యాయో కూడా తెలుసుకోవచ్చు. ప్రధాన ఎన్నికల కమిషనర్ బ్యాలెట్ ఓటింగ్‌ను కాదనడానికి చూపిన కారణాలు లాజికల్ గా ఉన్నా, ఓటరు తను వేసిన ఓటు సరిగ్గా నమోదు అయిందా అనేది తెలుసుకునే హక్కు కూడా ఉందన్న విషయాన్ని మరిచి పోకూడదు. ఎన్నికలలో ఓటరు కోసం, ఓటరు సౌలభ్యం కోసమే ఈవీఎంలు ప్రవేశపెట్టామని చెప్పి నప్పటికీ, వీవీ ప్యాట్ వినియోగంలో పెట్టేంతవరకూ, ఓటరు తను వేసిన ఓటు అనుకున్న అభ్యర్థికే పడిందా? లేదా అనే విషయం తెలుసుకునే అవకాశమే ఉండేది కాదు. బ్యాలెట్ పత్రంలో తను అనుకున్న గుర్తుపై ముద్రించడం ద్వారా ఓటరుకు తన హక్కును సద్వినియోగపర్చుకోవడమమే కాకుండా, సక్రమంగా ఓటు నమోదు అయిందనే తృప్తి ఉండేది. ఈవీఎంతో ఈ తృప్తి చాలా మంది గ్రామీణ ఓటర్లకు కలగేది కాదన్నది ఎవరూ కాదన లేరు.

ఈ ఆధునిక యుగంలో సౌకర్యం వాడుకోవడం తప్పులేదు. మరిన్ని మార్పులు అవసరమనుకుంటే తెచ్చుకుని ఓటర్ తృప్తిని పొందినప్పుడే ప్రజాస్వామ్య విలువలు ఖచ్చితంగా కాపాడిన వాళ్ళమవుతాం. ఈవీఎంల వాడకంలో నమోదైన ఓట్లలో హెచ్చుతగ్గులు చాలా పోలింగ్ బూత్‌లలో కనబడటం, ఇలాంటి పొరపాటుకు సరియైన కారణం ఎన్నికల అధికారులు చెప్పలేకపోవడం, గందరగోళ పరిస్థితిని ఈ మధ్య ఎన్నికల్లో చూడటం జరిగింది. సహేతుక ధోరణిలో సందేహాలను నివృత్తి చేయకపోవడంతో ఈవీఎంల పనితీరు మీద అనుమానాలు రావడంతో పాటు యంత్రాన్ని ట్యాంపర్ చేసి ఏ అభ్యర్థికో సహాయ పడుతున్నారనే అపప్రథను కూడా ఎన్నికల అధికారులు మూటగట్టుకునే పరిస్థితి ఏర్పడింది. దీనిని తొలగించాల్సిన బాధ్యత ఎన్నికల నిర్వహణాధికారులపై ఉంది. బ్యాలెట్ పత్రాలను వాడటం అనేది కాలం చెల్లిన పద్ధతిగా అనుకోవడం లో తప్పులేదు కానీ, ప్రత్యామ్నాయంగా ప్రవేశపెట్టిన పద్ధతిలోని లొసుగులను సరిచేయకపోవడంతోనే అన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇలాంటి ఇబ్బందులు ఉండటం వల్లనే బాగా అభివృద్ధి చెందిన దేశాల్లో ఈవీఎంల వాడకం లేదు అనే విషయాన్ని మన దేశంలోని ఓటరు నమ్మే పరిస్థితి ఉండకూడదు. ఓటరుకు నమ్మకం కలిగించే రీతిలో ఎన్నికల నిర్వహణ జరిపినప్పుడే ఎన్నికల తతంగం సక్రమంగా నిర్వహించినట్టు!

ఎన్నికల నిర్వహణకు ఎక్కువ సమయం వెచ్చించగూడదు అనే భావన నుంచి ప్రభుత్వాలూ, ఎన్నికల కమిషనర్లూ బయటపడాలి. చాలా సంవత్స రాల క్రితం ఒకటి,రెండు రోజుల్లోనే ఎన్నికల తతంగం ముగిసేది. అప్పుడు ఎన్నిక అంటే పండుగ! ఇప్పుడు ఎన్నికంటే పోరాటం! అందుకనే ఓటర్లనూ, అభ్యర్థు లందరినీ సంతృప్తి పర్చే విధంగా ఎప్పటికప్పుడు ఎన్ని కల నిర్వహణ తీరులో యంత్రాంగం ఉపయోగ పడే విధానంలో మార్పులు, చేర్పులు చేస్తూ ఉండాలి. మార్పు తలపెట్టడం వల్లనే బ్యాలెట్ పత్రాల బదులు ఈవీఎంలు వచ్చాయి.

మరొక మార్పు ప్రవేశపెట్టడం వల్లనే వివి ప్యాట్‌లు వచ్చాయి. ఈవీఎం ప్రవేశపెట్టిన ప్పుడు ఓటరుకు తన ఓటు ఎవరికి పడిందో రుజువు లేదు. ఓటు రసీదు యంత్రం రావడంతో దానిని చూసే అవకాశం కలిగింది. నిపుణులు తెచ్చే మరో మార్పుతో ప్రస్తుతం కలుగుతున్న సందేహాలకు తెరపడవచ్చు. అందుకు ప్రయత్నం చేయడంలో తప్పు లేదు. ఓటరు ఓటు వేయడంతో సంతృప్తి పడినట్టు కాదు, తన ఓటు తను అనుకున్న అభ్యర్థికే పడింది అన్నప్పుడే ఓటు విలువకు అర్థమూ, ప్రయోజనమూ ఏర్పడుతుంది. అదే ప్రజాస్వామ్య పద్ధతిలోని సొగసూ-సౌరభమూ!



-రావులపాటి సీతారాంరావు

కూటమిలోనే పోటీ!

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా జట్టు కడుతున్న విపక్ష పార్టీల ఐక్యత పైన పటారం లోన లొటారం అన్న చందంగా తయారైంది. ఐక్యతను చాటేందుకు తాజాగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కోల్‌కతాలో చేసిన ప్రయత్నం పైకి గొప్ప విజయంగానే కనిపిస్తున్నా, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఈ తరహా పరిస్థితికి కాంగ్రెస్ పార్టీయే కారణమవుతోంది. దేశ రాజకీయాలను శాసించే స్థాయిలో ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా మారిపోయింది. నిజానికి కాంగ్రెస్ పార్టీ తనకు తానుగా ఒంటరి పోరుకు సిద్ధపడకపోయినా, యూపీకి చెందిన రెండు ప్రధాన పార్టీలు మాత్రం ఉద్దేశపూర్వకంగానే దూరం పెట్టాయి. ఆ రాష్ట్రంలో సమాజ్‌వాదీ పార్టీకి, బహుజన్ సమాజ్ పార్టీకి చెక్కు చెదరని ఓటు బ్యాంకు ఉంది. రెండూ కలిస్తే మరొకరి సహాయం అవసరం లేకుండానే గెలుపొందవచ్చని ఆ రెండు పార్టీలు భావిస్తున్నాయి. పైపెచ్చు కేంద్రంలో ప్రభుత్వాన్ని నిర్ణయించేది ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రమే అంటున్న బీఎస్పీ అధినేత్రి మాయావతి, పరోక్షంగా తానే ప్రధాని అభ్యర్థినంటూ సంకేతాలిస్తున్నారు. అమేథీ, రాయ్ బరేలి నియోజకవర్గాల్లో మినహా మరెక్కడా పెద్దగా పట్టులేని పరిస్థితిలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో పొత్తులు పెట్టుకుంటే మరి కొన్ని సీట్లు త్యాగం చేసి ఆ పార్టీని బతికించినట్టవుతుందని కూడా బీఎస్పీ అధినేత్రి భావిస్తున్నారు. 80 పార్లమెంట్ సీట్లతో అతి పెద్ద రాష్ట్రంగా ఉన్న యూపీలో, చెరో 38 సీట్లలో పోటీ చేసేందుకు సర్దుబాటు ఒప్పందం చేసుకున్న బీఎస్పీ, సమాజ్‌వాదీలు రెండూ కలిసి 70 సీట్లు కచ్చితంగా సాధిస్తామన్న ధీమా వ్యక్తం చేస్తున్నాయి. కేంద్రంలో బీఎస్పీకి, రాష్ట్రంలో సమాజ్‌వాదీకి పరస్పర మద్దతు ఇచ్చిపుచ్చుకునేలా రెండు పార్టీల మధ్య అవగాహన ఉన్నందున, సార్వత్రిక ఎన్నికల తర్వాత కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో ఈ రెండు పార్టీల సంఖ్యాబలమే కీలకంగా మారుతుందని వారు ధీమాతో ఉన్నారు. అయితే జాతీయ స్థాయిలో మోడీని, బీజేపీని వ్యతిరేకిస్తూ జట్టుకట్టినందున రాహుల్ గాంధీ, సోనియా గాంధీ పోటీ చేస్తున్న అమేథీ, రాయ్ బరేలీ నియోజకవర్గాల్లో ఈ రెండు పార్టీలు అభ్యర్థులను నిలబెట్టడం లేదని ప్రకటించాయి. ఎస్పీ, బీఎస్పీ ఇచ్చిన షాక్ నుంచి తేరుకున్న కాంగ్రెస్ అధిష్టానం ఒంటరిపోరుకు సమాయత్తమైంది. వెనువెంటనే సొంత బలం పెంచుకోవడంపై దృష్టి పెట్టింది. అందులో భాగంగా పార్టీలో విశేష ఆదరణ కలిగిన నేత ప్రియాంకా గాంధీ వాద్రాను రంగంలోకి దించింది. ఏఐసీసీలోకి ప్రధాన కార్యదర్శిగా తీసుకోవడంతో పాటు తూర్పు యూపీకి ఇంచార్జిని చేస్తూ ఆమెకు రాహుల్ గాంధీ కీలక బాధ్యతలు అప్పగించారు. తద్వారా సొంతబలం పెంచుకుని, 2019లో సత్తా చాటేందుకు కసరత్తు చేస్తున్నారు. దీంతో దేశంలోని అతి పెద్ద రాష్ట్రంలోనే బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాలన్నీ ఏకతాటిపై నిలవలేని వాతావరణం ఏర్పడింది. ఒంటరిపోరుతో కాంగ్రెస్ పార్టీ ఏ వైపు నుంచి ఓట్లు చీలుస్తుందన్న విశ్లేషణలకు ఆస్కారమిచ్చింది.

యూపీలో పొత్తు కోరుకున్నా ఎస్పీ, బీఎస్పీలు కాదు పొమ్మనడంలో ఒంటరి పోరుకు సిద్ధపడగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ఒంటరి పోరు సంకేతాలే కనిపిస్తున్నాయి. నిజానికి పార్టీలో ఒక వర్గం నేతలు మాత్రం తెలుగుదేశం పార్టీతో పొత్తు ఉండాలని బలంగా వాదిస్తున్నారు. ఒంటరిగా పోటీ చేస్తే ప్రతి నియోజకవర్గంలో ఎన్నో కొన్ని ఓట్లు సాధిస్తాం తప్ప సీట్లు మాత్రం సాధించలేమని వారంటున్నారు. పొత్తుతో వెళ్తే కొన్ని సీట్లయినా సాధించవచ్చని, తద్వారా అసెంబ్లీలోనూ కాంగ్రెస్ ప్రాతినిధ్యం ఉంటుందని వారు వివరిస్తున్నారు. అయితే తెలంగాణలో టీడీపీతో పొత్తే కొంప ముంచిందని, ఆ ప్రయోగం వికటించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ ఆ సాహసం చేయడమెందుకని అధిష్టానం భావిస్తోంది. సీట్లు వచ్చినా రాకపోయినా, పార్టీ సొంత బలం ఏంటో తెలుస్తుందని, తద్వారా భవిష్యత్తులో బలం పెంచుకునే వ్యూహాలను అమలు చేయడానికి ఆస్కారం ఉంటుందని అధిష్టానంలో కొందరు పెద్దలు భావిస్తున్నారు. అయితే ఒంటరిపోరుతో ఒక్క సీటు కూడా గెలుచుకోలేమని భావిస్తున్న కొందరు సీనియర్ నేతలు పార్టీని వీడి అటు తెలుగుదేశం, వైఎస్ఆర్ కాంగ్రెస్, జనసేన పార్టీల్లో చేరేందుకు సమాయత్తమవుతున్నారు. రాష్ట్రమంతటా డిపాజిట్లు కోల్పోయిన హీన పరిస్థితిలోనూ సొంత బలంతో డిపాజిట్లు దక్కించుకున్న నేత కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి ఈ కారణంతోనే పార్టీ సోమవారం ఏపీ సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. అలాగే మరో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి కూడా ఉన్నట్టు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జాతీయ స్థాయిలో విపక్షాలను ఏకం చేసేందుకు శ్రమిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు సొంత రాష్ట్రంలోనే కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఉంటుందా లేదా చెప్పలేని పరిస్థితి నెలకొంది.

మోడీకి వ్యతిరేకంగా జట్టుకడుతున్న కూటమిలో కాంగ్రెస్ పార్టీ తర్వాత జాతీయ పార్టీలుగా ఉన్నవి ఉభయ కమ్యూనిస్టు పార్టీలే. అయితే కమ్యూనిస్టు పార్టీలకు కాస్తో కూస్తో పట్టున్న బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో విపక్షాల ఐక్యత చాటలేని పరిస్థితి నెలకొంది. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు పరస్పరం రాజకీయ ప్రత్యర్థులుగా ఉండగా, కేరళలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు ప్రత్యర్థులుగా కొనసాగుతున్నాయి. అందుకే కోల్‌కతాలో మమతా బెనర్జీ ఏర్పాటు చేసిన విపక్ష బలప్రదర్శన సభకు కమ్యూనిస్టులు డుమ్మా కొట్టారన్నది సుస్పష్టం. ఎన్నికల్లోనూ ఇదే తరహా వైరం కొనసాగుతుంది తప్ప పొత్తులు పెట్టుకునే పరిస్థితి ఉండదని అర్థమవుతోంది. ఒకవేళ పొత్తులకు సిద్ధపడినా సీట్ల విషయంలో త్యాగానికి ఎవరూ సిద్ధపడకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కేవలం బీజేపీ, కాంగ్రెస్ ముఖాముఖి తలపడే రాష్ట్రాల్లో మాత్రమే విపక్షాలు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచే పరిస్థితి కనిపిస్తోంది. ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న యూపీ, బీహార్, బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి ఇతర విపక్షాల నుంచి లభించే మద్దతు దాదాపు శూన్యం లేదా నామమాత్రమేనని రాజకీయ పండితులు భావిస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు తమ ఆధిపత్యాన్ని చాటుకునే క్రమంలో కాంగ్రెస్ పార్టీకి ప్రాధాన్యతనివ్వవు. ఈ తరహా ఏకత్వంలో భిన్నత్వం మహా కూటమి మౌలిక ఉద్దేశాన్ని దెబ్బతీసే అవకాశాలున్నాయి.

-స్వరూప పొట్లపల్లి



సిద్ధూ.. ఇదేం పని?!

◆ మహిళతో కర్నాటక మాజీ సీఎం దురుసు ప్రవర్తన ◆ కుమారుడి మాటెత్తగానే కోపంతో ఊగిపోయిన సిద్ధూ ◆ మహిళ భుజంపై ఉన్న మైక్రోఫోన్ లాగివేత

మైసూరు: కర్నాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రవర్తన మరోసారి వివాదాస్పదమైంది. మైసూరులో కాంగ్రెస్ కార్యకర్తలతో నిర్వహించిన ఓ సమావేశంలో మహిళతో సిద్ధరామయ్య దురుసుగా ప్రవర్తించారు. స్థానిక సమస్యలను వివరించే క్రమంలో ఓ మహిళ.. ఎదురుగా ఉన్న బల్లపై గట్టిగా కొట్టడం సిద్ధరామయ్యతో కోపంతో ఊగిపోయారు. మహిళ చెప్పే ఫిర్యాదును పట్టించుకోకుండా.. గర్జిస్తూ.. ఆమె భుజంపై చేయివేసి బలవంతంగా కూర్చోబెట్టారు. సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర ఎమ్మెల్యే అయిన తర్వాత తమకు అందుబాటులో ఉండటం లేదని జమిలా అనే కాంగ్రెస్ కార్యకర్త ఆరోపించింది. దీంతో కోపంతో రగిలిపోయిన సిద్ధరామయ్య ఆమె వద్ద ఉన్న మైక్రోఫోన్ లాగేసుకున్నారు. మైక్రోఫోన్‌తో పాటు మహిళ చున్నీ కూడా సిద్ధరామయ్య చేతికి వచ్చేసింది. స్థానిక సమస్యలపై మహిళ వాదిస్తున్న క్రమంలో సిద్ధరామయ్య ఆమెను గద్దిస్తూ కూర్చోబెట్టారు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో బీజేపీ నేతలు కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. కర్నాటకలోని కాంగ్రెస్-జేడీఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలతో వ్యవహరించే తీరు ఇదేనా అంటూ మండిపడుతున్నారు. మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన మాజీ సీఎంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై కర్నాటక కాంగ్రెస్ చీఫ్ దినేష్ గుండూ రావు స్పందిస్తూ.. కొన్ని కొన్ని సందర్భాల్లో ప్రజలు నేతలను ప్రశ్నించే విధానం కఠినంగా ఉంటుందని.. వారి వాదన విన్నప్పటికీ కోపంతో రగిలిపోతుంటారని అన్నారు. మైసూర్‌లో సిద్ధరామయ్యపై వచ్చిన ఆరోపణలు కూడా అలాంటివేనని కొట్టిపారేశారు. ప్రజలను సమదాయించేందుకు కొన్ని కొన్ని సార్లు కోపగించుకోవాల్సి రావచ్చని చెప్పుకొచ్చారు.

నా సోదరి లాంటిది

మహిళతో దురుసుగా ప్రవర్తించినట్లు ఆరోపణలు రావడంపై సిద్ధరామయ్య స్పందించారు. పార్టీ కార్యకర్త సుదీర్ఘంగా మాట్లాడటాన్ని ఆపేందుకు తాను ప్రయత్నించానని... ఆ ఘటన అనూహ్యంగా జరిగిందేనన్నారు. సదరు మహిళ తనకు 15 ఏళ్ల నుంచి తెలుసని.. ఆమె తన కు సోదరిలాంటిదని సిద్ధరామయ్య చెప్పు కొచ్చారు.

ఆయన చాలా మంచివారు

సిద్ధరామయ్య తనతో అసభ్యంగా ప్రవర్తించారన్న వార్తలను సదరు మహిళ కొట్టిపారేసింది. మాజీ సీఎం చాలా మంచివారని కితాబిచ్చింది. గతంలో ఎప్పుడూ ఆయన కోపంగా మాట్లాడలేదని... ఎదురుగా ఉన్న బల్లపై తాను కొట్టడం వల్లే సిద్ధరామయ్యకు కోపం వచ్చిందని పేర్కొంది. తమ సమస్యలను పరిష్కరించేందుకే సిద్ధరామయ్య బృందం మైసూరుకు వచ్చిందని తెలిపింది.

కేసు పెట్టండి: ఎన్‌డబ్ల్యూసీ

సిద్ధరామయ్య మహిళతో అసభ్యంగా ప్రవర్తించాలన్న ఆరోపణలపై జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. సిద్ధరామయ్యపై వెంటనే కేసు నమోదు చేసి.. విచారణ చేపట్టాలని స్థానిక పోలీసులను ఆదేశించింది. జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రేఖా శర్మ ట్విట్టర్‌లో స్పందిస్తూ.. సిద్ధరామయ్య వ్యవహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి..చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కర్నాటక పోలీసులను ఆదేశించారు.

ఎన్నికలపై అప్రమత్తంకండి

◆ సరిహద్దు రాష్ట్రాలతో సమన్వయం ◆ శాంతి భద్రతలకు ప్రాధాన్యం ◆ మీడియాలో పెయిడ్ ఆర్టికల్స్‌పై కన్నేయండి ◆ వీడియో కాన్ఫరెన్స్‌లో సీఈఓ సునీల్ అరోరా



అమరావతి, ఆంధ్రప్రభ : ఎన్నికల్లో డబ్బు పంపిణీ తీవ్రమైన నేరంగా పరిగణించి అలాంటి ఘటనలు జరగకుండా నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి సునీల్ అరోర ఆదేశించారు. సోమవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సహచర ఎన్నికల కమిషనర్ అశోక్ లావసతో కలిసి అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డిజిపిలు, సిఇఒలు, ఉన్నతాధికారులతో ఆయన వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరోర మాట్లాడుతూ సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ మాట్లాడుతూ 2019 సాధారణ ఎన్నికలను సక్రమంగా శాంతి యుతంగా నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకోనుందని వివరించారు. రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ ఆర్‌పి ఠాకూర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవటం జరుగుతుందని వివరించారు.

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణపై ప్రజల నుంచి కొన్ని ఫిర్యాదులు అందాయని వాటిని పరిశీలించి సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. రానున్న ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించేందుకు, తగిన నిధులు కేటాయించేందుకు రాష్ట్రప్రభుత్వం సకాలంలో చర్యలు తీసుకోనుందని తెలిపారు. ఓటర్ల నుంచి ఫిర్యాదులు, ఇతర సమాచారం తెలుసుకునేందుకు వీలుగా ఏర్పాటుచేసిన 1950 కాల్ సెంటర్ విజయవంతంగా పనిచేస్తోందని చెప్పారు. ఈ వీడియో సమావేశంలో రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి. సాంబశివరావు, అదనపు డిజి శాంతిభద్రతలు రవిశంకర్, ఎక్సైజ్‌శాఖ కమిషనర లక్ష్మీ నర్సింహ, శాంతి భద్రతల ఐజి జి. శ్రీనివాస్, ఇతరశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నా సోదరికి ఆ హక్కుంది

పద్మశ్రీ అవార్డు తిరస్కరణపై నవీన్ పట్నాయక్



న్యూఢిల్లీ: తన సోదరి, రచయిత గీతా మెహతా పద్మశ్రీ అవార్డును తిరస్కరించడంపై ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్పందించారు. పద్మ శ్రీ అవార్డును తిరస్కరించే హక్కు ఆమెకు ఉందన్నారు. ఏం చేయాలనుకున్నా చేసే హక్కు ఆమెకు ఉందని ఆయన వ్యాఖ్యానించారు. మోడీ చెప్పుచేతల్లో నడుస్తున్నానని రాహుల్ వ్యాఖ్యానించడాన్ని ఆయన కొట్టిపారేశారు. అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు అవాస్తవమన్నారు. కళలు, సాహిత్యం రంగంలో కృషికిగానూ విదేశీయుల కేటగిరిలో అమెరికాలో ఉంటున్న నవీన్ పట్నాయక్ సోదరి, రచయిత గీతా మెహతాకు కేంద్రప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించింది. అవార్డు ప్రకటించడం పట్ల మెహతా సంతోషం వ్యక్తం చేశారు. అవార్డుకు అర్హురాలిగా గుర్తించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కానీ ఎన్నికల ముందు ఈ అవార్డు తీసుకోవడం సరికాదన్నారు. తనకు, ప్రభుత్వానికి ఇబ్బందికరమని ఆమె వ్యాఖ్యానించారు. అవార్డును తిరస్కరిస్తున్నట్లు వెల్లడించిన విషయం తెలిసిందే.

పరీక్షా పే చర్చ 2.0

◆ నేడు విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లతో ప్రధాని చర్చ ◆ పరీక్షల సమస్యలు, ఒత్తిళ్లపై విద్యార్థులతో సంభాషణ ◆ దేశ, విదేశాల నుంచి హాజరుకానున్న విద్యార్థులు ◆ స్కూళ్లు, కాలేజీల్లో ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు



న్యూఢిల్లీ: పరీక్షా పే చర్చ 2.0 కార్యక్రమం ద్వారా రెండువేల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడనున్నారు. ఢిల్లీలోని తల్కతోర స్టేడియంలో మంగళవారం ఈ కార్యక్రమం జరగనుంది. పరీక్షలకు సంబంధించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఒత్తిళ్లపై విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లతో ప్రధాని చర్చించనున్నారు. మొదటిసారి భారత్‌లోని అన్నీ ప్రాంతాలతోపాటు విదేశాల్లోని భారతీయ విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనున్నారని కేంద్రమానవ వనరుల అభివృద్ధి శాఖ వెల్లడించింది. 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల విద్యార్థులు చర్చలో పాల్గొంటారు. వీరితోపాటు రష్యా, నైజీరియా, ఇరాన్, నేపాల్, దోహా, కువైట్, సౌదీఅరేబియా, సింగపూర్ దేశాల నుంచి కూడా విద్యార్థులు హాజరవుతున్నారు. గతేడాది నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి మాత్రమే విద్యార్థులు పాల్గొన్నారని అధికారులు తెలిపారు. కార్య క్రమ నిమిత్తం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 675 మంది విద్యార్థులు ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారని విద్యాశాఖ వెల్లడించింది. కళా ఉత్సవం పోటీలో విజేతలుగా నిలిచిన విద్యా ర్థులు పది నిమిషాలపాటు సాంస్కృతిక కార్యక్రమాన్ని ప్రదర్శిం చనున్నారని అధికారులు వివరించారు. గతేడాది నిర్వహించిన పరీక్షా పే చర్చ కార్యక్రమం ఆధారంగా పరీక్షల్లో విద్యార్థుల ఒత్తిళ్లను తగ్గించేందుకు కేంద్రప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను షార్ట్‌ఫిల్ముల రూపంలో ప్రదర్శించనున్నారు. దూరదర్శన్ టీవీలో కార్యక్రమాన్ని ప్రత్యక్షప్రసారం చేయనున్నారు. దేశ విదేశాల్లోని అన్నీ ప్రభుత్వ, సీబీఎస్‌ఈ పాఠశాలు, ఉన్నత విద్యా సంస్థలు, కాలేజీల్లో కార్యక్రమాన్ని ప్రత్యక్షప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

రెచ్చగొడితే వదిలిపెట్టం

శత్రుదేశాలకు ప్రధాని మోడీ హెచ్చరిక


న్యూఢిల్లీ: భారత్ శాంతిని బలంగా ప్రతిపాదిస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. కానీ జాతీయ భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యల విషయంలో ఏమాత్రం సందేహించబోమని స్పష్టం చేశారు. దేశ శత్రువులను రెచ్చగొట్టొద్దని సాయుధ దళాలకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చామన్నారు. రెచ్చగొడితే శత్రువులను వదలబోమని ఆయన హెచ్చరించారు. నేల, నీరు, గగనం నుంచి అణ్వాయుధాలను గురిపెట్టగల దేశాలలో భారత్ ఒకటని ఆయన గుర్తుచేశారు. నేషనల్ కాడెట్ కార్ప్సను ఉద్దేశించి ఢిల్లీలో ప్రధాని మోడీ మాట్లాడారు. జాతీయ భద్రత దృష్ట్యా గత నాలుగేళ్లుగా ప్రభుత్వం పలుకీలమైన నిర్ణయాలు తీసుకుందని ఆయన వెల్లడించారు.

కాంగ్రెస్‌కు కర్నాటక సీఎం కుమారస్వామి వార్నింగ్



బెంగళూరు: కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హద్దుమీరి ప్రవర్తిస్తున్నారని కర్నాటక ముఖ్యమంత్రి కుమార స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు గీత దాటుతున్నారని ఆయన మండిపడ్డారు. తను పదవిని పట్టుకుని వేలాడునుకోవటం లేదన్నారు. కాంగ్రెస్ నేతలు ఇదే తీరుగా వ్యవహరిస్తే తను సీఎం పదవికి రాజీనామా చేస్తానని కుమారస్వామి హెచ్చరించారు. ఆదివారం కాంగ్రెస్ ఎమ్మెల్యే సోమశేఖర ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ సిద్ధరామయ్యే తమ నాయకుడని ఆయనే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నామని చేసిన వ్యాఖ్యలపై కుమారస్వామి తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ ఇదేరీతిలో హద్దు మీరి మాట్లాడితే నా పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నాను అన్నారు. కాంగ్రెస్‌నేతలే తమ ఎమ్మెల్యేలను అదుపుచేయాలని కుమారస్వామి వ్యాఖ్యానించారు. ఈ వివాదంపై కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, కర్ణాటక కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ హైకమాండ్‌కు కుమారస్వామిపైన, రాష్ట్రప్రభుత్వంపైన పూర్తి విశ్వాసం ఉందన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు దినేష్ గుండురావు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి జరగటంలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే చేసిన ప్రకటనను ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే సహించమన్నారు. హద్దుమీరిన కాంగ్రెస్ ఎమ్మెల్యేకు షోకాజ్ నోటీసు జారీ చేశామన్నారు. ఈ వివాదంపై కాంగ్రెస్ నేత, కర్ణాటక డిప్యూటీ సీఎం పరమేశ్వర స్పందిస్తూ సిద్ధరామయ్య గొప్ప సీఎం, సీఎల్పీ నేత అన్నారు. సిద్ధ రామయ్య సీఎం అయితే బాగుండునని ఓ ఎమ్మెల్యే తన అభిప్రాయం చెపితే అందులో తప్పేముందన్నారు.

పోలవరం ముంపు మండలాల బదిలీ పిటిషన్ కొట్టివేసిన సుప్రీం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: డీలిమిటేషన్ ప్రక్రియ జరగకుండా పోలవరం ముంపు మండలాల ఓటర్లను ఏపీలో కలపడాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేత మర్రిశశిధర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ పిటీషన్‌లో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్‌గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. నియోజకవర్గాల పునర్విభజన జరగకుండా ఎన్నికల ప్రక్రియ జరపడాన్ని హైకోర్టు కొట్టి వేయడంతో తిరిగి సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. రాజ్యాంగ విరుద్ధంగా ఏడు మండలాల ఓటర్లను ఏపీలో కలిపారని పిటిషనర్ తరుపు న్యాయవాది జంధ్యాల రవిశంకర్ వాదించారు. అయితే తెలంగాణ ఎన్నికల ప్రకియ పూర్తయిన నేపథ్యంలోఈ కేసులో జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏడు మండలాల ఓటర్లను ఏపీ లో కలుపుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటిఫికేషన్ పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్ ను గతేడాది నవంబర్ లో హైకోర్టు కొట్టివేసింది. మండలాలను కలపడం వల్ల నియోజకవర్గాల సంఖ్యలో ఎటువంటి మార్పు రాలేదని కోర్టు వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

కుప్పకూలిన ఐఏఎఫ్ యుద్ధవిమానం

ప్రాణాలతో బయటపడ్డ పైలెట్


గోరఖ్‌పూర్: ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్ పూర్‌లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన యుద్ధవిమానం జాగ్వార్ కుప్పకూలింది. రోజువారి మిషన్‌లో భాగంగా గోరఖ్‌పూర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి టేకాఫ్ తీసుకున్న కొద్దిసేపటికే ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో విమాన పైలెట్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ వివరాలను డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ అధికారి అనిల్ కుమార్ వెల్లడించారు. మధ్యాహ్న సమయంలో ఈ ప్రమాదం జరిగిందన్నారు. విమానంలో లోపాన్ని పైలెట్ గుర్తించారు. దిశను మార్చి విమానం నుంచి కిందికి దూకి ప్రాణాలతో బయటపడ్డారని వెల్లడించారు. జిల్లాలోని హత, కస్య ప్రాంతాల మధ్య విమానం కూలిందని జిల్లా ఎస్పీ రాజీవ్ నరైన్ మిశ్రా వివరించారు. గాయపడిన పైలెట్‌ను యిర్‌ఫోర్స్ అంబులెన్స్‌లో హాస్పి టల్‌కు తరలించామన్నారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు ఆదేశాలు జారీ చేశామని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. ఎయిర్‌ఫోర్స్ బృందం విచారణ జరపనుందని వివరించారు.

వరాల యుద్ధం పార్టీలు సిద్ధం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాన రాజకీయ పార్టీలు హామీల వర్షం కురిపించేందుకు సిద్ధమయ్యాయి. పోటాపోటీగా వరాల జల్లు కురిపించేందుకు కుస్తీ పడుతున్నాయి. తాజాగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చేసిన ప్రకటన రాజకీయ ప్రకంపనాలు సృష్టిస్తోంది. తాము అధికారంలోకి వస్తే ప్రతి పేదవాడి ఖాతాలో కనీస మొత్తం సొమ్ము జమ చేస్తానంటూ ఆయన ఛత్తీస్‌గఢ్‌లో చేసిన ప్రకటన కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ ఒక్క హామీతో పార్టీ ఒక్కసారిగా పైకి లేస్తుందని వారు అంచనా వేస్తున్నారు. పైపెచ్చు వ్యూహాత్మకంగా అధికార పార్టీ బీజేపీ బడ్జెట్ ప్రసంగం ద్వారా కురిపించే వరాల కంటే ముందే రాహుల్ గాంధీ ఈ ప్రకటన చేయడంతో ఎన్నికల యుద్ధం లో రాహుల్ గాంధీ ఒక అడుగు ముందుకేశారని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. పైగా 15 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర రైతులకు కృతజ్ఞత చెప్పాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సభలో రాహుల్ చేసిన కీలక ప్రకటన దేశవ్యాప్తంగా ప్రాధాన్యతను తెచ్చిపెట్టింది. ఈ సందర్భంగా తాము ఇచ్చే హామీ ఉత్తుత్తి హామీ కాదని, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 10 రోజుల్లో రైతుల రుణాలు మాఫీ చేస్తామన్న హామీని కేవలం ఒక్క రోజులోనే నిలబెట్టుకుని రికార్డు సృష్టించామని అన్నారు. మరోవైపు ఈ సందర్భంగా రాజకీయ ప్రత్యర్థిపై విమర్శలతో విరుచుకుపడ్డారు. 15 మంది బడా పారిశ్రామికవేత్తలకు వేల కోట్ల రూపాయల రుణాలు రైటాఫ్ చేసిన ప్రధాని మోడీ పేద రైతుల రుణాలు ఎందుకు మాఫీ చేయలేకపోయారని ప్రశ్నించారు. ఈ ఆరోపణల సంగతెలా ఉన్నా, ఎన్నికల కదనరంగంలో బీజేపీ అగ్ర వర్ణ పేదల మెప్పు పొందేందుకు రిజర్వేషన్ల అస్త్రాన్ని ప్రయో గించగా, రాహుల్ గాంధీ మొత్తం పేదవర్గాల ఓట్లకే గాలం వేసే అస్త్రాన్ని సంధించారు. నిజానికి ప్రతి పేద కుటుంబానికి నగదు బదిలీ చేసే పథకం ఆలోచన కేంద్ర ఆర్థికశాఖ మాజీ సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యన్ చేసిన ప్రతిపాదన నుంచి వచ్చిందని తెలుస్తోంది. 2016-17 ఆర్థిక సర్వే ఆధారంగా దేశంలోని ప్రతి పేద కుటుంబానికి ప్రతి నెలా రూ. 1,500 ఇవ్వాలని ఆయన గతంలో ప్రతిపాదించారు. ఈ ఆలోచన నుంచే కాంగ్రెస్ పార్టీ ప్రేరణ పొంది, తమ మేనిఫెస్టోలో చేర్చిందని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. రానున్న బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తే ఆ మైలేజి బీజేపీకి వెళ్తుంది కాబట్టి కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా ముందే ప్రకటించిందని విశ్లేషణలు వస్తున్నాయి. దీంతో కేంద్రం ప్రవేశపెట్టనున్న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఎన్ని ప్రజాకర్షక పథకాలు ప్రవేశపెడతారోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. మొత్తంగా ప్రధాన రాజకీయ పార్టీలు ఓటర్లను ఆకట్టుకునే క్రమంలో వరాల మూటలు కడుతూ కత్తులు దూసుకుంటున్నాయి.

శివసేన బీజేపీకి బిగ్ బ్రదర్: సంజయ్‌రౌత్



ముంబై: మహారాష్ట్రలో శివసేన బీజేపీతో సహా ఇతర పార్టీల పొత్తు విషయంలో బిగ్‌బ్రదర్‌లా ఉంటుందని ఆ పార్టీ సీనియర్‌నేత సంజయ్ రౌత్ సోమవారం అన్నారు. శివసేన చీఫ్ ఉద్ధవ్ థాకరే అధ్యక్షతన జరిగిన సమావేశం అనంతరం శివసేన రాజ్యసభ సభ్యుడు, పార్ల మెంటు చీఫ్ విప్ సంజయ్‌రౌత్ విలేఖరులతో మాట్లాడుతూ శివసేన మహారాష్ట్రలో బీజేపీ, ఇతర పార్టీలతో పొత్తు విషయంలో పెద్దసోదరుడిలా ఉందని ఆ విధంగానే కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న ఆదాయపన్ను పరిధిని రూ.2.5లక్షల నుంచి రూ.8లక్షలు వరకు పెంచాలని శివసేన కోరుతున్నట్టు తెలిపారు. కేంద్రం ఇప్పటికే జనరల్ కేటగిరిలో ఈబీసీలకు రూ.8లక్షల వార్షిక ఆదాయం ఉన్నవారికి రిజర్వేషన్లు కలిపించిందని అదేవిధంగా ఆదాయపు పన్ను విషయంలోనూ రూ.8లక్షల వరకు రాయితీ కలిపించాలని పార్టీ డిమాండ్ చేసినట్టు తెలిపారు. శివసేనతో పొత్తు విషయంపై బీజేపీ నుంచి ఎటువంటి ప్రతిపాదన రాలేదన్నారు. మాతో పొత్తు విషయంలో ఆసక్తి ఉన్నవారు చర్చిస్తున్నారని తెలిపారు. అయితే ఏ పార్టీ ప్రతిపాదన కోసం తాము ఎదురుచూడటంలేదని రౌత్ అన్నారు.

ఎయిర్‌సెల్ - మాక్సిస్ కేసులో చిదంబరానికి ఊరట

న్యూఢిల్లీ: ఎయిర్‌సెల్-మాక్సిస్ కుంభకోణం కేసులో నిందితులైన మాజీ మంత్రి పీ.చిదంబరం, ఆయన కొడుకు కార్తీ చిదంబరానికి ఢిల్లీ కోర్టులో ఊరట లభించింది. తాత్కాలిక అరెస్టు మినహాయింపు ఆదేశాలను ఫిబ్రవరి 18 వరకు పొడగించింది. ప్రత్యేక సీబీఐ జడ్జి ఓపీ సైనీ ఈ ఆదేశాలు జారీ చేశారు. ఫిబ్రవరి 1 వరకూ చిదంబరం అందుబాటులో ఉండరంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను పొడగిస్తున్నామని జడ్జి వెల్లడించారు. చిదంబరం, ఆయన కొడుకు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఈ ఆదేశాలను జారీ చేసింది. ఎయిర్‌సెల్- మాక్సిస్‌కు నిబంధనలకు విరుద్ధంగా ఫారెన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎఫ్‌ఐపీబీ) అనుమతులు జారీ చేసేందనే ఆరోపణలు వచ్చాయి. ఈ కుంభకోణంలో చిదంబరం, ఆయన కొడుకు కార్తీ చిదంబర్ పాత్ర ఉందనే ఆరోపణలతో కేసులు నమోదైన విషయం తెలిసిందే.

నీతి ఆయోగ్ నిరుపయోగం

◆ ప్రధాని జేబు సంస్థగా మారిన వైనం ◆ ధ్వజమెత్తిన ఏపీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: నీతి ఆయోగ్ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జేబు సంస్థగా మారిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావు తీవ్రస్థాయి విమర్శలు చేశారు. ఆ సంస్థ వల్ల ఏ రాష్ట్రానికీ ఏమాత్రం ఉపయోగం లేదని దుయ్యబట్టారు. ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి హాజరైన కుటుంబరావు, అనంతరం ఆంధ్రప్రదేశ్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నీతి ఆయోగ్ నివేదికలకు విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం 29 రాష్ట్రాలకు చెందిన ప్రణాళిక సంఘాల ఉపాధ్యక్షులతో నీతి ఆయోగ్ ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో తొలుత ఆంధ్రప్రదేశ్ తరపున కుటుంబరావు మాట్లాడారు. ఈ క్రమంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై వాడీవేడిగా చర్చ జరిగిందని తెలిపారు. నీతి ఆయోగ్ ఏర్పాటు చేసిన తర్వాత తొలిసారిగా ఈ సమావేశం ఏర్పాటు చేశారని, ఎన్నికలు సమీపించాయి కాబట్టి ప్రజల్ని, రాష్ట్రాలను మభ్యపెట్టేందుకు మాత్రమే ఈ హడావుడి చేస్తున్నారని కుటుంబరావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రానికి సంబంధించి జరిగిన అన్యాయంపై మాట్లాడుతూ, రాష్ట్ర రాజధాని ప్రాంత అభివృద్ధి కోసం కేవలం రూ. 2,500 కోట్లు మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. రాష్ట్రానికి న్యాయం చేయాలంటూ 2015 డిసెంబర్‌లోనే నీతి ఆయోగ్ నివేదిక ఇచ్చిందని, కానీ ఆ నివేదికను బుట్టదాఖలు చేశారు తప్ప రాష్ట్రానికి ఏమాత్రం సహాయం అందించలేదని ఆరోపించారు. అలాగే వెనుకబడిన ప్రాంతాలకు రావాల్సిన నిధులను కూడా వెనక్కు తీసుకున్నారని కేంద్రం తీరును తప్పుబట్టారు. నీతి ఆయోగ్ నిధులివ్వాలని చెబుతున్నా కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. దీనిపై నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్ స్పందిస్తూ కేంద్ర, రాష్ట్ర సంబంధాలు సరిగాలేని సమయంలో నీతి ఆయోగ్ జోక్యం చేసుకుని న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తుందని హామీ ఇచ్చారని కుటుంబరావు తెలిపారు.

నీతి ఆయోగ్ నివేదికలు, సిఫార్సులకే విలువ లేకపోతే భవిష్యత్తులో నమ్మకం ఎలా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. నీతి ఆయోగ్ సంస్థ చైర్మన్ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీయే కాబట్టి తాను ఆయన్నే నేరుగా ప్రశ్నించాలని కుటుంబరావు వ్యాఖ్యానించారు. నీతి ఆయోగ్ ఇచ్చిన నివేదికను ముందు మోడీ చూడాలని డిమాండ్ చేశారు. సంస్థను జేబు సంస్థగా మార్చేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏమిచ్చారో ప్రజలకు తెలుసని, కేంద్రం వివక్ష చూపుతూ రాష్ట్రానికి నమ్మక ద్రోహం చేసిందన్న భావన ప్రజల్లో ఉందని వ్యాఖ్యానించారు.

'70 ఏళ్లుగా కోర్టులో అయోధ్య సమస్య'

న్యూఢిల్లీ: అయోధ్య కేసు విషయంలో సుప్రీంకోర్టు జాప్యంపై కేంద్ర న్యాయశాఖ మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ అయోధ్యలో రామాలయం కేసుకు సంబంధించి శబరి మల దేవాలయం తరహాలోనే వేగంగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టుకు అప్పీల్ చేస్తున్నామన్నారు. తను కేంద్ర మంత్రి హోదాలో కాకుండా ఒక పౌరుడిగా రామాలయ అంశంపై మాట్లాడుతున్నాను అన్నారు. ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్‌లో ఒకరు అందుబాటులో లేకపోవటంతో జనవరి 29న అయోధ్య కేసు విచారణను రద్దు చేస్తూ ఆదివారం సుప్రీంకోర్టు ప్రకటించింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.

Andhraprabha business 2019
బిజినెస్
BUSINESS

చందా కొచ్చర్ కేసు మళ్లీ మొదటికి?

• ప్రాథమిక విచారణ తర్వాత కేసు మూసివేతకు సిఫారసు • దర్యాప్తులో ఎన్నో లొసుగులు • మసకబారుతున్న సీబీఐ ప్రతిష్ట



ముంబై : ఐసీఐసీఐ మాజీ ఎండీ, సీఈవో చందాకొచ్చర్ కేసు దర్యాప్తు కొత్త మలుపులు తిరుగుతోంది. తాజాగా ఈ కేసు విచారణ జరుపుతున్న సీబీఐ విచారణ అధికారి (సుధాంశు ధార్ మిశ్రా.. సూపరింటెండెంట్ ర్యాంకు అధికారిని) సమాచారాన్ని లీక్ చేస్తున్నారన్న ఆరోపణపై సీబీఐ రాంచీకి బదిలీ చేసింది. దీంతో మళ్లీ ఐసీఐసీఐ బ్యాంకు కేసు మళ్లీ మొదటికి వచ్చింది. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న అధికారులు ఎఫ్ఐఆర్ రిజిస్ట్రేషన్ చేయకుండా నిందుతులపై జరిపిన సోదాల వివరాలన కావాలనే లీక్ చేస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. సీబీఐ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసుతో పాటు ఇతర అధికారులు ఈ కేసును ప్రాథమిక విచారణ నుంచి సాధారణ కేసుగా నమోదు చేయడంలో ఆలసత్వం వహించారని సీబీఐ ఆరోపించి అధికారులను బదిలీ చేసింది.

ఐసీఐసీఐ బ్యాంకుపై సీబీఐ జరుపుతున్న విచారణ గురించి విశ్వసనీయవర్గాల ద్వారా కొంత సమాచారం బహిర్గతమైంది. వివరాల్లోకి వెళితే .. చందాకొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్‌పై సీబీఐ ప్రాథమికంగా చేపట్టిన దర్యాప్తు లో ఎలాంటి సాక్ష్యాలు లభించలేదు. దీంతో సీబీ ఐఈ ఈ కేసును మూసివేయాలని నిర్ణయానికి వచ్చింది. కాగా ఐసీఐసీఐ బ్యాంక్ సీఈవో, ఎం డీగా చందాకొచ్చర్ అధికార దుర్వినియోగా నికి పాల్పడి తన భర్త దీపక్ కొచ్చర్‌కు లబ్ధి చేకూర్చేం దుకు వీడియోకాన్ గ్రూపు మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్ దూత్‌కు నిబంధనలకు తిలోదకాలిచ్చి రూ.3,250 కోట్లు రుణాలు మంజూరు చేయ డం, దానికి ప్రత్యామ్నాయంగా దూత్ రూ. 64 కోట్లు విలువ చేసే విద్యుత్ ఉత్పత్తి కంపెనీ దీపక్ కొచ్చర్‌కు బహుమానంగా ఇచ్చారని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై గత వారం సీబీఐ చందాకొచ్చర్, దీపక్ కొచ్చర్, వేణుగోపాల్ దూత్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. దీనిపై సీబీఐ ప్రాథమిక విచారణలోనే సాక్ష్యాలు బలంగా లేవని కేసు మూసివేయాలని నిర్ణయించింది. విశ్వసనీయవర్గాల సమాచా రం ప్రకారం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ జస్బీర్‌సింగ్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీ సు సుధాంశు మిశ్రాలు దర్యాప్తు బృందంలో సభ్యులు.. అయితే విచారణ అధికారి డీజే బాజ్‌పాయి ప్రాథమికంగా విచారణ జరిపి డిసెంబర్ 2018న కొచ్చర్‌లకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాలు లభించలేదని కేసు మూసివే యాలని సిఫారసు చేయడం దాన్ని పైన తెలిపిన ఇద్దరు అధికారులు ఆమోదిం చారు.

అయితే తాత్కాలిక సీబీఐ డైరెక్టర్ ఎం నాగేశ్వరరావు.. ప్రాథమికంగా సీబీఐ విచారణ అధికారి ఇచ్చిన నివేదికను పక్కన పెట్టి... ఎఫ్ఐఆర్‌లో రిజిష్టర్ చేసిన విధంగా .. చందకొచ్చర్ అక్రమంగా తన అధికారాన్ని దుర్వినియోగం చేసి వీడియోకాన్ గ్రూపునకు 2012లో జారీ చేసిన రుణంపై మళ్లీ తాజాగా విచారణ మొదలుపెట్టాలని ఆదేశించారు. తర్వాత మళ్లీ కొత్తగా చందాకొచ్చర్ జారీ చేసిన రుణంపై విచా రణ మొదలుపెట్టినట్లు ఈ అంశాలను దగ్గరి నుంచి గమనిస్తున్న వారు చెప్పారు.

జైట్లీ జోక్యంతో మారిన సీన్

ఈ పరిణామాల కంటే రెండు రోజుల ముందు కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ గత శుక్రవారం నాడు సీబీఐపై విరుచుపడ్డారు. సీబీఐ ఎఫ్ఐ ఆర్‌లో టాప్ బ్యాంకర్ల పేర్లు నమో దు చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తంచేశారు. అధికారులు విచారణ నిమిత్తం సాహసా లు చేయకండని చురక లంటిచారు.

దీంతో సీబీఐ తక్షణమే జస్బీర్‌సింగ్ ను .. ఆయన బ్యాంకు సెక్యూరిటీ అండ్ ఫ్రాడ్ సెల్ (బీఎస్‌అండ్‌ఎఫ్ఎస్) యూనిట్ అదనపు బాధ్య తలు చూసేవారు. అటు తర్వా త ఆయనను ఆ బాధ్యతల నుంచి తప్పించారు. సూపరింటెండెంట్ మిశ్రాను రాంచీ ఎకనమిక్ వింగ్ అధికారిక బదిలీ చేయడం జరిగింది.

నివేదికలోని వివరాలు..

డిసెంబర్‌లో సమర్పించిన ప్రాథమిక విచారణ నివేదికలో సీనియర్ అధికారులకు ఈ కేసు అధ్య యనం గురించి వివరాలు నివేదికలో రూపంలో అందించారు. పేరు వెల్లడిం చానికి నిరాకరించిన అధికారుల సమాచారం ప్రకారం .. ఆ రోపణలు ఎదు ర్కొంటున్న వారితో పాటు చందాకొచ్చర్ బావ రాజీవ్‌ను విచారణ నిమిత్తం పిలి పించి ప్రశ్నించగా... నేరం రుజువు చేసే విధంగా ఎలాంటి సా క్ష్యాలు లభించలేదని స్పష్టంచేశారు. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న ఆరోపణల ప్రకారం చూస్తే ఎలాంటి నిర్దిష్టమైన ఆరోపణలకు రుజువు లభించలేదు కాబట్టి ఈ కేసును మూసివేయాలని సిఫారుసు చేశా రు. ప్రాథమిక విచారణపై డీఐ జీతో పాటు ఎస్పీలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేశార ని, అట ు తర్వాత ఈ నివేదికను ఆమోదించడానికి డైరెక్టర్‌కు పంపారు. ఈ వారం ప్రారంభంలో డైరెక్టర్ ఈ కేసుకు సంబంధించి బీఎఫ్‌అండ్‌ఎస్‌సీ అధికారుల సిఫారసుల గురించి అభిప్రాయాలు తీసుకున్నారు. అటు తర్వాత సీబీఐ ఈ కేసుకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలనే ని ర్ణ య ా ని కి వచ్చింది.

చందాకొచ్చర్‌పై క్విడ్ ప్రోకేసు

సీబీఐ చందాకొచ్చర్‌పై క్విడ్‌ప్రోకో కేసును నమోదు చేసింది. వీడియోకాన్‌కు రూ.3,250 కోట్ల రుణం మంజూరు చేసి దానికి ప్రత్యామ్నాయంగా తన భర్త దీపక్ కొచ్చర్‌కు లబ్ది చేకూరేలా వ్యవహరించారని సీబీఐ ఎఫ్ఆర్ఐ ఆరోపించింది. ఇదే ఎఫ్ఐఆర్‌లో బ్యాంకుకు చెందిన సీనియర్ అధికారులు .. వారిలో మాజీ చైర్మన్ కెవీ కామత్ (ప్రస్తుతం న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు) ప్రెసిడెంట్‌గాపనిచేసున్నారు. వీరితో పాటు సందీప్ భక్షి, కె. రామకుమార్, సోంజోయ్ చటర్జీ (సీఈవో, గోల్డ్‌మన్ సాచెస్ ఇండియా), ఎన్ఎస్ కన్నన్, జరీన్ దారువాలా (సీఈవో స్టాండర్డ్‌చార్టర్ ఇండియా), రాజీవ్ సబర్వాల్ (సీఈవో టాటాక్యాపిటల్) హోమి కుష్రోఖాన్‌లు వీడియోకాన్‌కు రుణాలు మంజూరుచేసిన కమిటీలో సభ్యులు వీరిపై కూడా దర్యాప్తు చేయాలని సిఫారసు చేసింది.

దాడుల సమాచారం లీక్

ఈ కేసును విచారిస్తున్న దర్యాప్తు అధికారులు కావాలని ఎఫ్ఐఆర్ నమోదును జాప్యం చేశారని, అలాగే నిందితుల ఇళ్లపై జరిపిన సోదాల గురించి కావాలని సమాచారాన్ని లీక్ చేశారని చెబుతున్నారు. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు మిశ్రాపై సీబీఐ పూర్తిస్థాయిలో విచారణ జరిపి బలమైన సాక్షాధారాలు సేకరించిన తర్వాత మిశ్రా నిందితులపై జరిపిన సోదాల విషయం లీక్ చేశారనే నిర్ధారణ వచ్చిన తర్వాతనే ఆయనను బదిలీ చేసింది. జనవరి 22వ తేదీన మళ్లీ కేసు నమోదు చేసిన తర్వాత మళ్లీ సోదాలు చేయాలనే ప్రతిపాదన ఉందని చెబుతున్నారు. కీలకమైనసమాచారాన్ని సుధాంశుదార్, మిశ్రాల పాత్రలపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వీరిద్దరు సమాచారాన్ని లీక్ చేశారని సీబీఐ దర్యాప్తులో తేలింది. మిశ్రా పాత్రపై విచారణను కొత్త సూపరింటెండెంట్ మెహిత్‌గుప్తా నేతృత్వంలో జరిగిందని..ప్రస్తుతం మిశ్రాతో పాటు ఇతర అధికారులు ఈ కేసును కావాలని ఎందుకు పెండింగ్ పెట్టారనే అంశంపై దర్యాప్తు చేస్తున్నారు. మిశ్రా స్థానంలో బిశ్వజిత్ దాస్‌ను తీసుకువచ్చారు. బాజ్‌పేయి అనే అధికారి ప్రాథమిక విచారణ జరిపారు. ప్రస్తుతం ఆయన దర్యాప్తు బృందంలో లేదు. ప్రస్తుతం ఈ కేసును డీఎస్పీ ఆర్‌కె సంఘ్వాన్‌కు అప్పగించారు. ప్రస్తుతం కొత్తగా ఏర్పడినవిచారణ ప్రాథమిక విచారణతో పాటు ఇతర అంశాలను ఎలాంటి తారతమ్యాలు లేకుండా దర్యాప్తు చేస్తాయని అధికారులు చెబుతున్నారు. తాజా పరిణామాలను చూస్తే సీబీఐ ప్రతిష్ట మాత్రం మసకబారుతుంది.

పిరామల్ ఎంటర్‌ప్రైజెస్ లాభం రూ.603 కోట్లు

క్యూ3 లో 23 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : పిరామల్ ఎంటర్‌ప్రైజెస్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నికరలాభంలో 23 శాతం వృద్ధితో రూ.603.27 కోట్లు ఆర్జించింది. దీనికి ప్రధాన కారణం ఫైనాన్షియల్ సర్వీసెస్‌తో పాటు ఫార్మా వ్యాపారాలు పుంజుకోవడమేనని తెలిపింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.490.47 కోట్లు నికరలాభాన్ని ప్రకటించినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. రెవెన్యూ విషయానికి వస్తే రూ.3,489.08 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2,586.36 కోట్లని పేర్కొంది. వ్యాపారాలు ఒడిదుడుకులకు గురైనా.. మంచి ఫలితాలను సాధించామని కంపెనీ చైర్మన్ అజయ్ పిరామల్ చెప్పారు. బీఎస్ఈలో దీని షేరు 5.66 శాతం క్షీణించి రూ.2,166.80 వద్ద ట్రేడ్ అయ్యింది.

సుజుకి మోటార్ సైకిల్ కొత్త ఎడిషన్

• *వీ-స్ట్రోమ్650ఎక్స్‌టి* • *ధర రూ.7.46 లక్షలు*

న్యూఢిల్లీ : మారుతి సుజుకి ఇండియా సోమవారం నాడు ప్రీమియం మోటార్ సైకిల్ మోడల్ వీ- స్ట్రోమ్ 650 ఎక్స్‌టి ఏబీఎస్‌ను మార్కెట్లో విడుదల చేసింది. దీని ధర రూ.7.46 లక్షలు (ఎక్స్‌షోరూం, న్యూఢిల్లీ). కాగా కొత్త రీఫ్రెష్ సుజుకి వీ-స్ట్రోమ్ 650ఎక్స్‌టి ఏబీఎస్ సరికొత్త ఆకర్షణీయమైన గ్రాఫిక్స్‌తో పాటు అదనపు ఫీచర్లను అందిస్తోంది. అవి హెజార్డ్ లైట్స్, రెఫ్లెక్టర్స్ అని ప్రకటనలో వివరించింది. ఇక ఇంజిన్ సామర్థ్యం విషయానికి వస్తే 645 సీసీ బిగించారు. కాగా ఈ బైక్ సాహస యాత్రలను చేయాలనే వారికి బాగా నచ్చుతుందని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ సాటోషి ఉచిండా చెప్పారు. దీంతో పాటుదీని యాంటీలాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్) పాటు కంట్రోల్ రోడ్ గ్రిప్, ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా బ్రేకులు పని చేస్తాయని వివరించింది.

గోద్రెజ్ ప్రాపర్టీస్ లాభం రూ.42 కోట్లు

న్యూఢిల్లీ : గోద్రెజ్ ప్రాపర్టీస్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకీకృత నికరలాభం రూ.41.63 కోట్లు ఆర్జిం చింది. అమ్మకాలు పెరగడమే దీనికి ప్రధా న కారణమనం కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నికరనష్టం రూ.54.75 కోట్లని కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. మొత్తం ఆదాయం రూ.430.70 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.308.29 కోట్లన ప్రకటనలో పేర్కొంది. బీఎస్ఈలో దీని షేరు 0.24 శాతం పెరిగి రూ.747 వద్ద ముగిసింది.

కెనరా బ్యాంకు లాభం రెట్టింపు

క్యూ3లో రూ.317.52 కోట్లు

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన కెనెరా బ్యాంకు డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నికరలాభంలో రెట్టింపు రూ.317.52 కోట్లు ఆర్జించింది. మొండిబకాయిలకు కేటాయింపులు తగ్గడమే కారణమని ఒక ప్రకటనలో వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.125.75 కోట్లు నమోదు చేసింది. మొత్తం ఆదాయం రూ.13,513.35 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.12,341.09 కోట్లని బ్యాంకు బీఎస్ఈకి సమాచారం అందించింది. క్యూ3లో మొండిబకాయిలకు కేటాయింపులు రూ.1977.34 కోట్లు కేటాయించగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2673.64 కోట్లు కేటాయించింది. బీఎస్ఈలో దీని షేరు 5.23 శాతం క్షీణించి రూ.240.30 వద్ద ముగిసింది.

టాటా బ్రాండ్ విలువ 19,500 కోట్ల డాలర్లు

గ్లోబల్ టాప్ బ్రాండ్‌లలో 86వ స్థానం



ముంబై : దేశంలో అత్యంత విలువైన బ్రాండ్‌లలో టాటా బ్రాండ్ అగ్రస్థానంలో ఉంది. ఈ ఏడాది 2019లో ఈ బ్రాండ్ విలువ ఏకంగా 37 శాతం పెరిగి 19,500 కోట్ల డాలర్లకు ఎగబాకింది.

దీంతో పాటు గ్లోబల్ టాప్ -100 బ్రాండ్‌ల జాబితాలో స్థానం దక్కించుకుంది. సాల్ట్ నుంచి సాఫ్ట్‌వేర్ వరకు వివిధ రకాల వ్యాపారాలను టాటా గ్రూపు నిర్వహిస్తోంది. లండన్ ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న కన్సెల్టెన్సీ కంపెనీ బ్రాండ్ ఫైనాన్స్ టాటాగ్రూపునకు 86వ ర్యాంకు ఇచ్చింది. క్రితం ఏడాది అంటే 2018లో 104లో ర్యాంకులో ఉందని ప్రకటనలో పేర్కొంది. భారత్ నుంచి కేవలం ఒక్కటే కంపెనీ టాటాగ్రూపు మాత్రం గ్లోబల్ టాప్ -100 ర్యాంకులో స్థానం దక్కించుకుంది. మొత్తానికి టాటాగ్రూపు ఈ ఏడాది తమ బ్రాండ్ విలువను గణనీయంగా పెంచుకుంది. ప్రపంచంలోని అత్యంత విలువైన టాప్ -100 బ్రాండ్‌ల సరసన స్థానం దక్కించుకుందని బ్రాండ్ ఫైనాన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డేవిడ్ హెయిగ్ చెప్పారని టాటాగ్రూపు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

తాజాగా వచ్చిన గుర్తింపుపై టాటాసన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ స్పందిస్తూ.. బ్రాండ్ ఫైనాన్స్ గుర్తింపుతో తాము వ్యాపారంలో మరింత ఉత్సాహంగా దూసుకుపోతామని, గ్లోబల్ స్థాయిలో కూడా సామాజిక బాధ్యతను గుర్తెరిగి ముందుకుపోతామని.. వినూత్నమైన వ్యాపారపంథాను అనుసరిస్తూ రాబోయే రోజుల్లో గ్లోబల్ మార్కెట్లో కూడా నాణ్యమైన సేవలందిస్తామని ఆయన అన్నారు.

బ్రాండ్ విలువ పెరగడానికి ప్రధాన కారణం గ్రూపునకు చెందిన అత్యంత లాభదాయకమైన కంపెనీ టాటా కన్సెల్టన్సీ సర్వీసెస్ కారణమని హెయిగ్ తెలిపారు. బ్రాండ్ విలువ పెరగడంతో గ్రూపునకు చెందిన ఆటోమొటివ్, స్టీల్‌కంపెనీలతో పాటు టాటాగ్రూపునకుచెందిన ఇతర కంపెనీల విలువ పెరుగుతుందని ప్రకటనలో వివరించింది.

నేడు రోడెక్కనున్న కియా కారు!

మొదటి కారును స్వయంగా నడపనున్న సీఎం

అమరావతి, ఆంధ్రప్రభ: సూర్యోదయ ఆంధ్రప్రదేశ్‌లో తయారైన మొట్టమొదటి మోటారు కారు కియోను మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రాంరభించనున్నారు. మంగళవారం అనంతపురం జిల్లా కదిరిలో ఆదరణ పనిముట్ల పంపిణీకి హాజరుకానున్న ఆయన ఈ కారును ప్రారంభించనున్నారు. పెనుకొండ మండలం అమ్మవారిపల్లి దగ్గర ప్రతిష్టాత్మకంగా ఏర్పాటైన కియా పరిశ్రమలో తయారైన మొట్టమొదటి ఈ కారుకు సోమవారం ట్రయల్ రన్‌కు నిర్వహించారు. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు కియా కారును లాంచ్ చేయనండటంతో ఇప్పటికే అన్ని పరీక్షలు నిర్వహించుకుని రోడ్డుమీద పరుగులిడేందుకు సిద్ధంగా ఉన్న కారును మరోమారు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈమేరకు కారు తుది మెరుగులు దిద్దుకుంది. ప్రతి ఆరు మాసాలకు ఒక కొత్త మోడల్ కారును మార్కెట్‌లోకి విడుదల చేసేలా కియా కంపెనీ లక్ష్యాన్ని నిర్దేశింకుంది. ఇందుకు అనుగుణంగా అత్యాధునిక రోబొటిక్ టెక్నాలజీతో యంత్రాలను ఏర్పాటు చేశారు. అనంతపురం కార్మికులు బిగించిన కియా తొలి కారును రేపు చంద్రబాబు విడుదల చేసి స్వయంగా నడపనున్నారు.

KIA
KIA MOTORS

మారుతి కొత్త బెలెనో

ప్రారంభ ధర రూ.5.4 నుంచి 8.77 లక్షలు

న్యూఢిల్లీ : మారుతి సుజుకి ఇండియా సోమవారం అప్‌డేటెడ్ వెర్షన్ ప్రీమియం హెచ్‌బ్యాక్ బలెనోను దేశీయ మార్కెట్లో విడుదల చేసింది. దీని ప్రారంభం రూ.5.4 లక్షల నుంచి రూ.8.7 లక్షలుగా నిర్ణయించింది. అప్‌డేటెడ్ వెర్షన్ ఫీచర్ల విషయానికి వస్తే కొత్త స్పోర్ట్ ఫ్రంట్ గ్రిల్‌తో పాటు కట్ స్మోక్డ్ టూటోన్ 16 అంగుళాల అల్లాయ్ వీల్స్‌ను ప్రత్యేక ఆకర్షణగా తీసుకువచ్చినట్లు మారుతి సుజుకి ఒక ప్రకటనలో వెల్లడించింది. కొత్త ఇన్ఫోటెయిన్‌మెంట్ సిస్టమ్ విషయానికి వస్తే రెయిర్ పార్కింగ్ కెమెరా ఇంటిగ్రేషన్, నావిగేషన్‌తోపాటు లైవ్ ట్రాఫిక్, వెహికల్ ఇన్ఫర్మేషన్, స్క్రీన్ అలర్ట్‌తో పాటు డ్రైవింగ్ సౌకర్యవంతంగా ఉంటుందని ప్రకటనలో వివరించింది. సరికొ త్త ఫీచర్ల ద్వారా ప్రొడక్టును మరింత ఆకర్షణీ యంగా తయారు చేసి కస్టమర్ల ముందుంచామని మారుతి సుజుకి సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైరెక్టర్, మార్కెటింగ్ సేల్స్ ఆర్ కె కాల్సీ వివరించారు. ప్రీమియం హెచ్‌బ్యాక్ సెగ్మెంట్‌లో అత్యంత విజయం సాధించామని ఆయన అన్నారు. ఈ కారు మార్కెట్లో విడుదల చేసిన 38 నెలల్లోనే ఇప్పటి వరకు 5 లక్షల యూనిట్లను విక్రయించింది. ఇంజిన్ విషయానికి వస్తే 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్, 1.3 డీజిల్ ఇంజిన్ ఆప్షన్ ఇస్తోంది. పెట్రోల్ వెరియెంట్ రూ.5.4 లక్షల నుంచి రూ.7.45 లక్షల వరకు ఉంటుంది. మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో పాటు ఆటోమెటిక్ ట్రాన్స్‌మిషన్‌లో లభిస్తుంది.



వీటి ధర రూ.7.48 లక్షల నుంచి రూ.8.77 లక్షల వరకు ఉంటుంది. డిజెల్ వెరియెంట్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ ధర రూ.6.6 లక్షల నుంచి రూ.8.6 లక్షలు (అన్నీ ఎక్స్ షోరూం ధరలు ఢిల్లీ). భద్రతా ఫీచర్ల విషయానికి వస్తే డ్యూయెల్ ఎయిర్‌బ్యాగ్‌లు, ఏబీఎస్ (యాంటీ బ్రేకింగ్ సిస్టమ్) తో పాటు ఈబీడీ (ఎలక్ట్రానిక్ బ్రేక్ ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్), బ్రేక్ అసిస్ట్, ప్రీ టెన్షనర్, ఫోర్స్ లిమిటర్, సీట్ బెల్ట్‌తో పాటు రిమైండర్, ఐఎస్ఒ ఎఫ్ఐ ఎక్స్ చైల్డ్ రీస్ట్రెయింట్ సిస్టమ్, స్పీడ్ అలర్ట్ సిస్టమ్, రెయిర్‌పార్కింగ్ సెన్సార్, స్టాండర్డ్ ఎక్రాస్ వెరియెంట్స్‌ను అందిస్తోంది.

శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్‌లాభం రూ. 635 కోట్లు

క్యూ3లో 17 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ కంపెనీ (ఎస్‌టీఎఫ్‌సీ) డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 17.34 శాతం వృద్ధితో రూ.635.45 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.541.54 కోట్లని తెలిపింది. ఆదాయం విషయానికి వస్తే 18.22 శాతం పెరిగి రూ.3,993.40 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదేత్రైమాసికంలో రూ.3,378 కోట్లని బ్యాంకు ఒక ప్రకటనలో పేర్కొంది. నికరవడ్డీ ఆదాయం 16.12 శాతం పెరిగి రూ.2,026.91 కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసి కంలో రూ. 1,745.50 కోట్లని తెలిపింది. కంపెనీ చేతిలో మొత్తం అసెట్ అండర్ మేనేజ్‌మెంట్ (ఏయుఎం) డిసెంబర్ చివరి నాటికి రూ.1,03, 817.94 కోట్లు కాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ. 90,964.22కోట్లని వెల్ల డించింది. బీఎస్ఈలో దీని షేరు 5.70 శాతం క్షీణించి రూ.1055.30 వద్ద ముగిసింది.

ఎస్‌బీఐ అమరావతి సర్కిల్‌లో 70వ గణతంత్ర దినోత్సవ సంబరాలు

హైదరాబాద్ : స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అమరావతీ సర్కిల్‌లో శనివారం నాడు 26-1-2019న 70 గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. చీఫ్ జనరల్ మేనేజర్ మణి పల్వేసన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అటు తర్వాత జాతీయ గీతాన్ని ఆలపించారు. అటు తర్వాత పల్వేసన్ సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. డిజిటల్ టెక్నాలజీకి మారాలని, కస్టమర్లకు వీటిపై అవగాహన కల్పించాలని, దీంతో సమయం ఆదా కావటంతో పాటు బ్రాంచీల్లో రద్దీ తగ్గుతుందన్నారు.



మార్కెట్లకు బడ్జెట్ ఫీవర్!

• *368 పాయింట్లు పతనం* • *అమ్మకాల ఒత్తిడి* • *భారీగా నష్టపోయిన బ్యాంకు షేర్లు*

ముంబై : స్టాక్ మార్కెట్లకు బడ్జెట్ ఫీవర్ మొదలైంది. ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌లో మోడీ సర్కార్ సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేసి ప్రజాకర్షక బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందని అంచనాతో ఇన్వెస్టర్లు తమ వద్ద ఉన్న షేర్లను విక్రయించారు. దీంతో బీఎస్ఈ ఏకంగా 368 పాయింట్లు క్షీణించింది. నిఫ్టీ 119 పాయింట్లు నష్టపోయి 10,661.55 వద్ద స్థిరపడింది. దీనికి తోడు గ్లోబల్ మార్కెట్లకు కూడా బలహీనంగా ట్రేడ్ కావడంతో సెంటిమెంట్ మరింత దెబ్బతింది. వచ్చే బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రజాకర్షక బడ్జెట్ ప్రవేశపెడుతుందన్న భయాలు ఇన్వెస్టర్లలో నెలకొన్నాయి. దీంతో ఆర్థిక క్రమశిక్షణ కట్టుతప్పుతుందని ఆందోళన కూడా నెలకొంది. ఇన్వెస్టర్లు ముందు చూపుతో తమ వద్ద ఉన్న షేర్లను విక్రయించుకోవడానికి మొగ్గు చూపారు. బ్యాంకింగ్, ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్ రంగానికి చెందిన షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. ఈ రంగానికిచెందిన షేర్లు అత్యధికంగా 5.46 శాతం వరకు బీఎస్ఈలో నష్టపోయాయి. ఆటో, బ్యాంకింగ్ రంగానికి చెందిన కంపెనీ ఫలితాలు అంతంత మాత్రంగా నమోదు కావడంతో దాని ప్రభావం షేర్ల అమ్మకాలపై పనిచేసింది. ట్రేడింగ్ విషయానికి వస్తే ఇంట్రాడేలో అత్యధికంగా 36,124.26 పాయింట్లకు ఎగబాకి.. అటు తర్వాత 35,565.15 పాయింట్ల కనిష్టానికి దిగివచ్చింది. చివరకు 368.84 పాయింట్లు క్షీణించి 35,656.70 వద్ద స్థిరపడింది. నిఫ్టీ విషయానికి వస్తే ఇంట్రాడేలో అత్యధికంగా 10,804.45 మార్కుకు ఎగబాకి.. అటు తర్వాత 10,630.95 మార్కుకు అత్యంత కనిష్ఠానికి దిగివచ్చింది. చివరగా 119 పాయింట్ల నష్టపోయి 10,661.55 వద్ద ముగిసింది. బీఎస్ఈలో అత్యధికంగా నష్టపోయిన షేర్లలో ఎస్ బ్యాంకు 5.46 శాతం క్షీణించగా.. బజాజ్ ఫైనాన్స్ 5.40 శాతం, ఐసీఐసీఐ బ్యాంకు 3.82 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంకు 3.10 శాతం, హీరోమోటో కార్ప్ 2.25 శాతం వరకు నష్టపోయాయి. దీంతోపాటు అమెరికా - చైనాల వాణిజ్య యుద్ధం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఇన్వెస్టర్లు ఫెడ్ రిజర్వు సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూస్తున్నారు. బీఎస్ఈ సూచి శుక్రవారం 169 పాయింట్లు నష్టపోయింది. చివరి రెండు ట్రేడింగ్ సెషన్‌లలో సూచి 537 పాయింట్ల వరకు క్షీణించింది. నష్టపోయిన ఇతర షేర్లు ఇలా ఉన్నాయి. సన్‌ఫార్మా, బజాజ్‌ఆటో, వేదాంత, యాక్సిస్ బ్యాంకు, ఐటీసీ, టాటాస్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్, ఎస్‌బీఐ, టాటామోటార్స్, భారతి ఎయిర్‌టెల్, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, కొటక్ బ్యాంకు, ఇన్ఫోసిస్, ఓఎన్‌జీసీ, మారుతిలున్నాయి. వీటికి వ్యతిరేకంగా జీఎంటర్‌టెయిన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ తిరిగి 17 శాతం పుంజుకుంది. పెద్దనోట్ల రద్దు తర్వాత బ్యాంకులో అనుమానిత డిపాజిట్లపై వచ్చిన ఆరోపణలను జీ తోసిపుచ్చింది. దీంతో దీని షేరు 16.64 శాతం పెరిగి రూ. 372.50 మార్కు వద్ద ముగిసింది. గ్లోబల్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి.



టీటీకే ప్రెస్టీజ్ లాభం రూ.85 కోట్లు

క్యూ3లో 34 శాతం

న్యూఢిల్లీ : కిచెన్ అప్లియెన్సెన్స్ తయారీ కంపెనీ టీటీకె ప్రెస్టీజ్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికం నికరలాభంలో 33.66 శాతం వృద్ధితో రూ.84.85 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.63.48 కోట్లని బీఎస్ఈకి సమాచారం అందించింది. క్యూ3లో మొత్తం ఆదాయం రూ.558.63 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.461.62 కోట్లని పేర్కొంది. బీఎస్ఈలో దీని షేరు 0.92 శాతం క్షీణించి రూ.7,717.95 వద్ద ముగిసింది.

టాటాపవర్ లాభంలో 67 శాతం డౌన్

క్యూ3లో రూ.205 కోట్లు

న్యూఢిల్లీ : టాటాపవర్ డిసెం బర్‌తో ముగిసిన త్రైమాసికం నికరలాభంలో 67.42 శాతం క్షీణించి రూ.204.61 కోట్లకు దిగివచ్చింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.628.16 కోట్లని బీఎస్ఈకి సమాచారం అందించింది. ఇంధనం, వడ్డీ వ్యయం కారణంగా లాభా లు భారీగా తగ్గాయని కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. మొత్తం ఆదాయం మాత్రం కాస్తా పెరిగి రూ.7,721.52 కోట్లకు ఎగ బాకగా.. క్రితం ఏడాది ఇదేత్రైమాసికంలో రూ.6,451.31 కోట్లుగా నమోదు చేసింది. బీఎస్ఈలో దీని షేరు 4.26 శాతం క్షీణించి రూ.70.80 వద్ద ముగిసింది.

తెదేపా హయాంలోనే బీసీల అభివృద్ధి



అమరావతి, ఆంధ్రప్రభ: మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరెడ్డి, జగన్ బీసీలకు చేసింది ఏమీ లేదని, ఎవరి హయాంలో బీసీలకు న్యాయం జరిగిందో చర్చకు సిద్ధమని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పంచుమర్తి అనురాధ సవాల్ చేశారు. సోమవారం విజయవాడ టిడిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జయహో బీసీ కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలకు వరాలు జల్లు కురిపించినందుకు బీసీల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో వైయస్ రాజశేఖర్‌రెడ్డి బీసీలకు ఫెడరేషన్ల పేరుతో న్యాయం చేస్తామని చెప్పి వాటిని నీరుగార్చారని, నేడు సీఎం చంద్రబాబు అన్ని ఫెడరేషన్లకు చైర్మన్లను నియమించి వాటిని కార్పొరేషన్లుగా మార్చి రూ.3వేల కోట్లు కేటాయించారన్నారు. సీఎం చంద్రబాబు దేశంలో మొదటిసారిగా బీసీలకు సబ్‌ప్లాన్ ద్వారా రూ.40వేల కోట్లు నిధులను కేటాయించి రూ.32వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. తెలంగాణాలో 26బీసీ కులాలను ఓసీల్లో కలిసిన నీచమైన చరిత్ర కేసీఆర్‌దని, అలాంటి కేసీఆర్‌తో జగన్ ఎందుకు కలిశారో సమాధానం చెప్పాల్సినవసరం ఉందన్నారుదగ్గుబాటి కుటుంబం ఏపార్టీలో ఉన్నా ఆపార్టీలోని నేతలతో, కార్యకర్తలతో మమేకమైన దాఖలాలు లేవని విమర్శించారు. పదవుల కోసం పనిచేస్తారు తప్పా ఒక కమిట్‌మెంట్‌తో పనిచేసి దాఖలాలు లేవని, తన కుమారున్ని పర్చూరు నుంచి నిలబెడతారని, కనీసం డిపాజిట్లుకూడా రావని ఎద్దేవాచేశారు.

జనసేనలో చేరికలు



అమరావతి, ఆంధ్రప్రభ : మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ సమక్షంలో సోమవారం కృష్ణా,గుంటూరు జిల్లాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ,కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. కృష్ణా జిల్లా ఆగిరిపల్లికి చెందిన పీసీసీ కార్యదర్శి పాతూరి రవి, నాయకులు బండి పవన్‌కుమార్, దేవిశెట్టి సత్యనారాయణ,గుంటూరుకు చెందిన ప్రముఖ సాతంత్ర్య సమరయోధులు మనవడు మనవా సొడాకర్ , విజయవాడకు చెందిన ఫ్రాన్సిస్ తదితరులు తమ అనుచరులతో నాదెండ్ల మనోహర్ సమక్షంలో పార్టీలో చేరారు. నాదెండ్ల మనోహర్ వారికి పార్టీ కండువాలు కప్పి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ . కష్టించి, పని చేసే వారికి జనసేన పార్టీ మంచి వేదిక అన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన అనూహ్యమైన విజయాన్ని సొంతం చేసుకుని ,అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టంచేశారు.

ఈబీసీ రిజర్వేషన్లు అన్యాయం

- 11న ఢిల్లీలో బీసీ సంఘాల ధర్నా
- కేశన శంకరరావు వెల్లడి

గుంటూరు అర్బన్, ప్రభన్యూస్: ఫిబ్రవరి 11న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బీసీ సంఘాలు నిర్వహించే మహా ధర్నాకు రాష్ట్రంలోని బీసీలందరూ హాజరుకావాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. సోమవారం గుంటూరులోని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేక రుల తో మాట్లాడారు. కేంద్రం స్వార్థ రాజకీయాలకోసం అగ్రవర్ణపేదలకు 10 శాతం రిజర్వేషన్లు కేటాయించటం దుర్మార్గమన్నారు. భారత రాజ్యాంగం, ఏచట్టంలో పొందుపరచని అంశాలను తీసుకువచ్చి ప్రజాస్వామ్య వ్యవస్థకే మచ్చతెచ్చే విదంగా మోడీ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందన్నారు. గతంలో 13 మంది సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కేశవనందభారతి, ఇంద్రసేన వంటి కేసుల్లో రిజర్వేషన్ల విషయమై తీర్పునిచ్చిన అంశాన్ని గుర్తుచేశారు. బీసీలు రాజకీయశక్తిగా ఎదిగితేనే న్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఏపీబీసీ సంక్షేమసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్లు అన్నం శివరాఘవయ్య, తన్నీరు ఆంజనేయులు, యువజనసంఘం రాష్ట్ర అధ్యక్షులు కుమ్మరక్రాంతిక ుమార్ , తుపాకుల అప్పారావు, ప్రత్యూషసుబ్బారావు, నిరుద్యోగ ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ సుబ్రమణ్యం బీసీ నాయకులు దొంతా సురేష్, మారం కిషోర్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వారిపై చంద్రబాబు కపట ప్రేమ

- బీజేపీ నేతల ఆరోపణలు

అమరావతి, ఆంధ్రప్రభ: అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల తర్వాతబ బీసీలపై చంద్రబాబు నాయుడు కపట ప్రేమను ఒలకపోస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసం ఉమామహేశ్వర రాజు ఎద్దేవా చేశారు. రాజమండ్రిలో ఆదివారం నిర్వహించిన జయహో బీసీ సభకు ప్రజల నుంచి స్పందన కరువైందని ఆయన పేర్కొన్నారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉమామహేశ్వర రాజు మాట్లాడుతూ ప్రధానిగా బీసీ కులానికి చెందిన నరేంద్ర మోదీ ఉండటాన్ని జీర్ణించుకోలేని స్థితిలో రాష్ట్రంలోనే తిరగనీయబోమని, వస్తే నిరసన ప్రదర్శనలు చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తుంచుకోవాలలన్నారు. జయహో బీసీల కార్యక్రమంలో ప్రకటించిన బీసీ కార్పోరేషన్లు ఎవరి కోసమంటూ నిలదీ శారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోగంటి వీర బాబు, వెంట్రప్రగడ చంద్రబాబు, బిఎస్‌కె పట్నాయక్, యక్కల నారాయ ణ స్వామి, బీసీ సంఘం నేతలు వాసా పల్లపురాజు, మహిళా మోర్చా విజయవాడ నగర అధ్యక్షురాలు చిట్టా దుర్గా తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో జర్నలిస్టులకు 30 ఎకరాల కేటాయింపు జీవో జారీ

అమరావతి, ఆంధ్రప్రభ: అమరావతి పరిధిలో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులకు రాజధాని ప్రాంతంలో 30 ఎకరాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు సీఆర్డీయే ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్ సోమవారం జీవో జారీ చేశారు. ఇప్పటికే నమోదైన అమరావతి అక్రిడేటెడ్ జెర్నలిస్టుల మ్యూచ్‌వల్లీ ఎయిడెడ్ కోపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్‌కు ఈ 30 ఎకరాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాజధాని ప్రాంతంలో వర్కింగ్ జర్నలిస్టులకు స్థలం ఇవ్వా లని కేబినెట్ తీసుకున్న నిర్ణయం మేరకు ఈ జీవో జారీ చేశారు. అయితే, ఒక్కో ఎకరానికి రూ. 25 లక్షల వంతున ప్రభుత్వానికి సొసైటీ నుండి చెల్లించాల్సి ఉంటుంది. ఈ సొసైటీ ద్వారా లబ్ది పొందగోరే జర్నలిస్టులకు గానీ, వారి కుటుంబ సభ్యులకుగానీ రాజధాని ప్రాంతంలో ఇల్లుగానీ, స్థలంగా కానీ ఉండరాదనే నిబంధనను విధించారు. ఈ సొసైటీలో ఉన్న సభ్యులు మూడేళ్లలోగా కేటాయించిన స్థలంలో ఇళ్లు నిర్మించుకోవాల్సి ఉంటుంది. కాగా, రాజధాని ప్రాంత పరిధిలో అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని అజయ్ జైన్ సీఆర్డీయే కమిషనర్‌ను ఆదేశించారు. అదేవిధంగా మాస్టర్ ప్లాన్‌కూడా రూపొందించాలని మార్గదర్శకాల్లో పొందుపర్చారు.

జూన్‌లో గ్రావిటీతో నీళ్ళిస్తాం!

- మే 30 న ట్రయల్ రన్
- ప్రాజెక్టు పనులు పూర్తికి 50 రోజుల ప్రత్యేక ప్రణాళిక
- పోలవరంతో నవ్యాంధ్ర స్వర్ణాంధ్ర
- పోలవరం ప్రాజెక్టు 64.68 శాతం పూర్తి
- పోలవరంపై ముఖ్యమంత్రి చంద్రబాబు 86వ వర్చువల్ సమీక్ష



అమరావతి ఆంధ్రప్రభ: జూన్ మొదటి వారంలో పోలవరం ప్రాజెక్టు నుం చి గ్రావిటీ ద్వారా పంట పొలాలకు సాగు నీరు ఇవ్వడం ఖాయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టంచేశారు. ఇందుకు సంబంధించి మే 30వ తేదీన గ్రావిటీ ద్వారా నీరు విడుదలకు సంబంధించి ట్రయల్ రన్ నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవ్వాలని సీఎం అన్నారు. ప్రాజెక్టు పూర్తికి 50 రోజుల ప్రణాళిక సిద్ధం చేసినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. సోమవారం ముఖ్యమంత్రి పోలవరం ప్రాజెక్టు పనులపై 86వ వర్చువల్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జల వనరుల శాఖాధికారులు ప్రాజెక్టు పనుల వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.జూన్ మొదటి వారంలో గ్రావిటీ ద్వారా నీటిని విడుదల చేసేందుకు స్విచాన్ చేయాల్సిందేనని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను జూలై నెలాఖరు కల్లా పనులను పూర్తి చేసుకోవాలన్నారు. నవ్యాంధ్ర అభివృద్ధికి పోలవరం బంగారు బాటలు వేస్తుందన్నారు. అన్ని ప్రాజెక్టుల పూర్తికి 150 రోజుల ప్రణాళిక రచించి, నిర్దేశిత ల క్ష్యాలమేరకు ముందుకు సాగాలన్నారు. మంగళవారం చెర్లోపల్లి జలాశయం నుంచి పుంగనూరు బ్రాంచికెనాల్ ద్వారా నీటని విడుదల చేస్తామన్నారు. ప్రకాశం జిల్లా వెలిగొండ ప్రాజెక్టుపనుల పురోగతిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సమీక్షించారు. పనుల మందకొడిగా జరగడంపై ఆయన అధికారులపై మండిపడ్డారు. ఆరు నెలలు కష్టపడి పని చేస్తే ప్రాజెక్టు సకాలంలో పూర్తవుతుందని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. '' నేను ప్రతిరోజూ చెబుతున్నా.. ఉపేక్షవద్దు..చాలా ప్రతిష్టాత్మక ప్రాజెక్టు వెలిగొండ..జూన్,జూలై కల్లా వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తికావాలన్నారు. ప్రతి వారం 20 మీటర్ల పని పూర్తి చేయాలన్నారు. ఇలా రెండు వైపులా చేస్తే ఆరు నెలల్లో వెలిగొండ పూర్తి చేయవచ్చన్నారు. గత వారంలో పోలవరం ప్రాజెక్టు పనులు 64.31 శాతం పూర్తయ్యాయని, ఈ వారం 0.37 శాతం పనులు అదనంగా జరిగాయని,మొత్తం ఇప్పటివరకు 64.68 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. హెడ్ వర్క్స్‌కు సంబంధించి 54.87 శాతం పనులు జరగ్గా, ప్రధాన డ్యామ్‌పనులు ఇప్పటివరకు 54. 35 శాతం జరిగాయ న్నారు. స్పిల్‌వే, స్పిల్ చానల్, అప్రోచ్ చానల్,పైలట్ చానల్,లెఫ్ట్ ప్లాంక్‌కు సంబంధించిన తవ్వకం పనులు 85.10 శాతం జరిగాయని, కాంక్రీట్ పనులు 63.20 శాతం , రేడియల్ గేట్స్ ఫ్యాబ్రికేషన్ పనులు 62.68 శాతం, డయాఫ్రమ్‌వాల్ పనులు 100 శాతం పూర్తయ్యాయని చెప్పారు. జెట్ గ్రౌటింగ్ పనులు కూడా వంద శాతం జరిగాయన్నారు. ఎగువ కాఫర్ డ్యామ్ పనులు 17.64 శాతం, దిగువ కాఫర్ డ్యామ్ పనులు 0.11 శాతం జరిగాయన్నారు. కనెక్టివిటీ ప్యాకేజెస్‌కు సంబంధించి ఇప్పటివరకు 60.40 శాతం పనులు జరిగాయన్నారు. లెఫ్ట్ కనెక్టివిటీకి సంబంధించి 48.42 శాతం, రైట్ కనెక్టివిటీస్ పనులు 73.75 శాతం, కుడి ప్రధాన కాలువ పనులు ఇప్పటివరకు 90.04 శాతం పూర్తయ్యాయి. ఎడమ ప్రధాన కాల్వకు సంబంధించి ఇప్పటివరకు 67.61 శాతం, మెయిన్ డ్యామ్ తవ్వకం పనులు 115.59 లక్షల క్యూబిక్ మీటర్లకు 949.37 లక్షల క్యూబిక్ మీటర్ల తవ్వకం పనులు జరిగాయి. రేడియల్ గేల్ ఫ్యాబ్రికేషన్‌కు సంబంధించి 62.68 శాతం, డయాఫ్రమ్‌వాల్ కాంక్రీట్ పనులకు సంబం ధించి నూటికి నూరు శాతం, కాఫర్ డ్యామ్ కోసం జెట్ గ్రౌటింగ్ కట్ పనులకు సంబంధించి 100 శాతం , పనులు పూర్తయ్యాయని వివరించారు. సమావేశంలో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో పాటు జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషన్‌కుమార్, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు కాంట్రాక్ట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఉపరాష్ట్రపతి నివాసంలో గిరిజనుల నృత్యాలు

- భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకలని వెంకయ్యనాయుడు కితాబు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న గిరిజన కళాకారులు భారత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు నివాసంలో నృత్య ప్రదర్శన నిర్వహించారు. తమిళనాడు, మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్, అసోం, గుజరాత్, జమ్మూ-కాశ్మీర్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తమ తమ రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ, గిరిజన నత్యాలను ప్రదర్శించారు. ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తన కుటుంబ సభ్యులు, ఉపరాష్ట్రపతి నివాస సిబ్బంది, ఉద్యోగులతో కలిసి ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. నృత్య ప్రదర్శన అనంతరం ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఆయన సతీమణి ఉష, కుమార్తె దీపా వెంకట్ కళాకారులను అభినందించారు. వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు ఒకే వేదిక మీద ఇచ్చిన నృత్యప్రదర్శన భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబించిందని, భారతీయ సంస్కృతిని ఒకే చోట క్రోడీకరించి చూపించిందని ఉపరాష్ట్రపతి వ్యాఖ్యానించారు. అంతకంటే ముందు, ఈ కార్యక్రమానికి విచ్చేసిన పలు రాష్ట్రాలకు చెందిన గిరిజన పెద్దలను వెంకయ్య నాయుడు మర్యాదపూర్వకంగా పలకరించారు. 80కి పైగా కళా బ ందాలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి.





ఉండవల్లి అఖిలపక్ష భేటీకి బాబు ఓకే

- ప్రతినిధులుగా మంత్రి నక్కా , ఎంపీ సీఎం రమేష్

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రత్యేక హోదా సాధన, విభజన అంశాల్లో కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై ఉండ వల్లి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో విజయ వాడలో మంగళవారం నిర్వహించనున్న అఖిలపక్షం, మేధావుల సమా వేశానికి తెలుగుదేశం పార్టీ హాజరుకావాలని నిర్ణయించింది. ఈ సమావేశానికి హాజరుకావాలని ఉండవల్లి రాసిన లేఖపై ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందిం చారు. పార్టీ ప్రతినిధులుగా ఎంపి సీఎం రమేష్ తో పాటు మంత్రి నక్కా ఆనందబాబును ఈ సమా వేశానికి పంపేందుకు నిర్ణయం తీసుకు న్నారు. టీడీపీ తో పాటు వైకాపా, జనసేన, కాంగ్రెస్ , బీజేపి, సిపిఐ, సిపిఎం పార్టీలకు కూడా ఈ మేరకు ఉండవల్లి ఆ హ్వానాన్ని పంపారు. అయితే ఈ సమావేశానికి తా ము హాజరుకాలేమని వైకాపా స్పష్టం చేసింది. తెలుగుదేశం పార్టీతో కలిసి వేదిక ను పంచుకోలేమని ఉం డవల్లి అరుణ్ కుమార్‌కు వైకాపా తెలియజేసింది.

చంద్రబాబు ఆధ్వర్యంలో మరోసారి అఖిలపక్షం.

ముఖ్యమంత్రి చంద్రబాబు నా యుడు ఆధ్వర్యంలో మరోసారి అఖిల పక్ష సమావేశం జర గనుం ది ఇప్పటికే రెండు సార్లు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిం చిన ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఈ నెల 30వ తేది నమళ్ళీ ఒక సమావేశాన్ని నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అన్ని పార్టీల తో పాటు హా దా సాధన కోసం పోరాడు తున్న సంఘాలకు ఆహ్వానాలు పంపారు. విభజన హామీల అమలు , రాష్ట్రానికి రావాల్సిన నిధు లు, కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై ఈ అఖిల పక్ష సమా వేశంలో చర్చించనున్నారు. ఇదిలా ఉండగా ఫిబ్రవరి 1వ తేది న అఖిలపక్షం ఆధ్వర్యంలో జరగనున్న బంద్ కు ప్రభుత్వం పరోక్ష ంగా మద్దతిచ్చేందుకు నిర్ణ యం తీసుకుంది. ఆ రోజు జరిగే ప్రభుత్వ కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసేందుకు నిర్ణయించారు.

చంద్రబాబుతో ఏపీజేఏసీ భేటీ

- సీపీఎస్ రద్దు,పొరుగు సేవల ఉద్యోగ భద్రత పై చర్చ
- సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి



అమరావతి, ఆంధ్రప్రభ: ఏపీ జేఏసీ అమరావతి ప్రతినిధులు సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఉద్యోగుల ఇళ్లస్థలాల కేటాయింపు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లు, 180 రోజుల మెటర్నటీ లీవ్, హెల్త్ కార్డుల అమలు, డెత్ ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని, ఎన్నెమ్మార్, డెయిలీ వేజ్, పార్ట్ టైమ్, ఫుల్ టైమ్, కంటింజెంట్ ఉద్యోగుల సమస్యలను సీఎం చంద్రబాబుకు ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు బృందం వివరించింది. వీటితోపాటు హెల్త్ కార్డులు, కాజువల్ లీవ్స్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఎం చంద్రబాబుని కోరారు. అదేవిధంగా పొరుగు సేవల ఉద్యోగులకు భద్రతతోపాటు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, కనీస వేతనం రూ.25వేలు చెల్లించాలని, వారికి సాధారణ సెలవులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.విజయవాడ, విశాఖపట్టణం మున్సిపల్ కార్పొరేషన్‌లలో పనిచేసే ఉద్యోగులకు 010పద్దు ద్వారా జీతభత్యాలు చెల్లించాలని కోరారు. వీటిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు డిమాండ్లను పరిశీలించాలని ఆర్థికమంత్రి యనమలకు సూచించారు. అవకాశం ఉన్నంతవరకు, వీలైనంత వరకు త్వరలో సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని సీఎం చంద్రబాబు మంత్రి సూచించారు. ఈస మావేశంలో ఏపీజేఏసీ అమరావతి బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఫణిపేర్రాజు, మురళీకృష్ణ నాయుడు, ఆల్ఫ్రెడ్, కొండయ్య, గెజిటెడ్ అధికారుల సంఘం జనరల్ సెక్రటరీ కేశవ్ నాయుడు, తాత్కాలిక జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జాన్ హెన్రీ బాబు, పొరు గుసేవల ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు దయాకర్ తదితర నాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి..

ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల సమస్యలను ప రిష్కరించాలని డ్రైవర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షులు డీఎస్ కొండయ్య ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ముఖ్యంగా అద్దెవాహనాల వలన రాష్ట్రానికి ఆర్థిక భారం పడకుండా వాటి స్థానంలో కియో మోటార్ ఎలక్ట్రానిక్ వాహనాలను వినియోగిస్తే ఇంధన ఖర్చులు లేకుండా కాలుష్యాన్ని నివారించవచ్చునని సూచించారు. ప్రధానంగా వైద్య ఆరోగ్యశాఖలో జిల్లాకు ఒక వాహనం కేటాయించాలని తెలపగా వీటిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా అగ్నిమాపక శాఖలో డ్రైవర్ ఆపరేటర్‌లకు శాఖా నిబంధనలలో లేని సెంట్రీ డూటీలనుండి మినహాయింపులు ఇవ్వాలని కోరగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకొంటామని సీఎం చంద్రబాబు తెలియజేశారు.

కాంట్రాక్టు సిబ్బందికి తీపి కబురు

- వేతనాల్లో 50శాతం పెంపు
- ఏప్రిల్ 1 నుంచి అమలు
- ఆర్థిక శాఖ ఉత్తర్వులు

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రప్రభుత్వ పరిధిలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలను పెంచడంపై ప్రభుత్వం నియమించిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు నేతృత్వంలోని మంత్రుల బృందం చేసిన సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎమ్. రవిచంద్ర సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రుల బృందం చేసిన సిఫార్సులను ఆమోదిస్తూ విడుదల చేసిన జీవోఎంఎస్ నెం. 12/ 28-01-2019 ప్రకారం ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రస్తుతం పొందుతున్న జీతాలకు 50శాతం అదనంగా వేతనాలను అందుకోనున్నారు. ఈజీవో ప్రకారం సవరించిన జీతాలను సదరు కాంట్రాక్ట్ ఉద్యోగులు ఏప్రిల్ 1వ తేది నుండి పొందనున్నారు. అయితే కనీస వేతనం రూ. 12వేలు ఉండాలన్న నిబంధనను ఈ జీవోలో పొందుపరిచారు. గతంలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే విధుల్లోకి తీసుకోబడిన కాంట్రాక్ట్ ఉద్యోగులకు మాత్రమే ఈ పెంపుదల వర్తిస్తుంది. ఈ ఉత్తర్వులు వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న సలహాదారులు , కన్సల్టెంట్లు, ఓఎస్‌డిలతో పాటు కాంట్రాక్ట్ పద్ధతిపై ప్రత్యేకంగా నియమింపబడిన ఉద్యోగులకు వర్తించవని స్పష్టం చేశారు. ఈ ఉత్తర్వుల్లో మరికొన్ని షరతులను విధించారు. ముఖ్యంగా ఆర్థిక శాఖ ముందస్తు అనుమతి లేకుండా ఏ ప్రభుత్వ శాఖ కూడా ఉద్యోగ నియామకాలు చేపట్టడానికి వీలు లేదని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సవరించిన వేతనాల పెంపుదల వర్తించదని స్పష్టం చేశారు.

బీసీల పక్షపాతి చంద్రబాబు



అమరావతి, ఆంధ్రప్రభ: బీసీ సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వారి అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు వెనుకబడిన తరగతులవారి పాలిట భగవంతుడని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బోన బోయిన శ్రీనివాస యాదవ్ కొనియాడారు. సోమవారం గుంటూరులోని టీడీపీ రాష్ట్రకార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాజమండ్రిలో నిర్వహించిన జయహో బీసీ సభ వేదికగా 5 లక్షల మంది బీసీల సమక్షంలో అనేక వరా లను కురిపించిన సీఎం చంద్రబాబు బీసీల పక్షపాతిగా మరో సారి రుజు వు చేసుకున్నారని అభివర్ణించారు. తెలుగుదేశం పార్టీ గుండె చప్పుడు బీసీలని, టీడీపీతోనే వారికి న్యాయం జరుగుతుందనే విషయం ఎన్‌టీఆర్ నుంచి చంద్రబాబు వరకు నిరూపిస్తూ వస్తున్నారని చెప్పారు. విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఇతర వర్గాలకు ధీటుగా బీసీ జాతులు రాణించేందుకు అవసరమైన తోడ్పాటు, సహాయ, సహకారా లను అందించడంతోపాటు వారి సర్వతోముఖాభివృ ద్ధికి దేశానికే ఆదర్శ వంతమైన సంక్షేమ పథకాలను టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. జయహో సభ విజయ వంతంతో ముగ్గురు మోడీలకు, ప్రతిపక్షాలకు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని, అడిగినవే గాకుండా అడగని హామీలను కూడా అమలు చేస్తున్న చంద్రబాబుకు 2019లో అధికారాన్ని కానుకగా ఇచ్చేందుకు యావత్ బీసీలోకం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నేతలు తాతా జయప్రకాష్ నారాయణ, పుత్తూరి షణ్ముకం, మద్దిరాల మ్యానీ, ఈడే మురళీ కృష్ణ, గంజి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎఆర్ కానిస్టేబుళ్ల పదోన్నతులకు పచ్చజెండా

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖలో సాయుధ విభాగానికి చెందిన 546 మందికి హెడ్ కానిస్టేబుళ్లుగాను, 91మందికి ఎఎస్‌ఐలుగాను అదనంగా పదోన్నతులు ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఎఆర్ అనురాధ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో సివిల్ పోలీసులకు పదోన్నతులు ఇవ్వగా సాంకేతిక కారణాలతో ఎఆర్, ఎపీఎస్పీ, మహిళా కానిస్టేబుళ్లకు పదోన్నతులు ఇవ్వలేదు. దీంతో పలు సవరణలు చేసిన డీజీపీ ఆర్పీ ఠాకూర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా తదనుగుణంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కానిస్టేబుల్ స్టేజ్-2 దరఖాస్తులు పంపండి

రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల నిర్వహించిన పోలీసుశాఖలో కానిస్టేబుల్, జైళ్లశాఖ వార్డర్, అగ్నిమాపక శాఖ ఫైర్‌మెన్ ఉద్యోగాలకు నిర్వహించిన ప్రాథమిక అర్హతా పరీక్షలో ఉత్తీర్ణులైన వారు దేహదారుఢ్య పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని చైర్మన్ కుమార్ విశ్వజిత్ సూచించారు. రెండో దశలో భాగంగా శారీరక దేహదారుఢ్య, ఇతర పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం యూనిట్ల ఎంపిక, విద్యార్హతలు, నివాసం తదితర వివరాలతో కూడిన దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా పంపాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 4వ తేదీలోగా దరఖాస్తు చేసుకొని ఆయా పరీక్షలకు వచ్చేటప్పుడు నఖలు తీసుకు రావాలని ఆయన సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేయని పక్షంలో రెం డో దశ పరీక్షలకు కాల్ లెటర్ ఇవ్వడం జరగదని ఆయన పేర్కొన్నారు.

బీసీలను దగా చేస్తున్న బాబు

- వైకాపా సీనియర్ నేత ధర్మాన

అమరావతి, ఆంధ్రప్రభ: గడచిన ఐదు సంవత్సరాల్లో బీసీలకు చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎన్నికలొస్తున్నాయని జయహో బీసీ అని మరోసారి బీసీలను మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు అన్నారు. విజయవాడలోని రాష్ట్రపార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 2014 టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు ఇచ్చిన హామీలనే జయహో బీసీ సభలో చంద్రబాబు తిరిగి వల్లెవేశారన్నారు. అప్పటి హామీలనే ఇప్పుడు మళ్లీ చెబుతున్నారంటే అవి నెరవేరలేదని అర్థమౌతుందన్నారు. కేంద్రంలో ఇద్దరు మంత్రులకు అవకా శం వస్తే కనీసం ఒక్కరికి కూడా బీసీలకు ఇవ్వలేదన్నారు. అంతెందుకు రాజ్యసభ్యుల్లో బీసీలకు ఎవరికైనా అవకాశం ఇచ్చారో చెప్పాలన్నారు. నిజాయితీపరుడైన జస్టిస్ ఈశ్వరయ్య ఆధార సహితంగా చంద్రబాబు బీసీ న్యాయవాదులను న్యాయమూర్తులుగా ఎంపిక కాకుండా అడ్డుపడ్డారని స్వయంగా వెల్లడించిన సంగతి ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా నాయీబ్రాహ్మణులను తోక కత్తిరిస్తానంటూ అవమానించిన సంగతి ఎలా మర్చిపోతామన్నారు. అదే వైయస్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తనతోపాటు కొణతాల వంటి అనేక మంది బీసీలకు మంత్రిపదవులిచ్చి న్యాయం చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ బీసీలకు గుర్తింపు రావాలంటే ఆయన తనయుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ద్వారానే సాధ్యమవుతుందని చెప్పారు. బీసీలను అణదొక్కిన ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతారన్నారు.



ప్రజాకర్షక పథకాల ప్రకటన?

ఓటాన్ అకౌంట్ బడ్జెట్

గీత పరిమితి దాటుతుందా?

- బీజేపీ గెలుపుపై మదుపర్ల భరోసా ఎంత?
- గోయల్ ప్రసంగానికే పరిమితి అవుతారా?
- రైతుల కోసం పథకాలు ప్రకటించే ఛాన్సుందా?
- 2004 బడ్జెట్ మార్గదర్శకం అవుతుందా?



న్యూఢిల్లీ: ఎన్నికల ముందు ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ప్రజాకర్షక పథకాల ప్రకటనలో ఎలాంటి పరిమితులను పాటించాలని, ఏ హద్దులను దాటాలి అన్నదే కేంద్ర ఆర్థికమంత్రి ముందున్న పరీక్ష. ఒకవేళ ఆర్థికశాఖ బాధ్యతలు స్వీకరించిన గోయల్ కనుక వోటాన్ బడ్జెట్‌లో రాజకీయ ప్రకటన చేయాలనుకుంటే, వాజ్‌పేయి ప్రభుత్వ హయంలో ఆర్థికమంత్రిగా పని చేసిన జస్వంత్‌సింగ్ ఉపన్యాసం మార్గదర్శిగా ఉపయోగపడవచ్చని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నాటి జస్వంత్‌సింగ్ బడ్జెట్ ఉపన్యాసంలో తిరిగి ఎన్డీయే కూటమి ప్రభుత్వంలోకి వస్తే ఏమేం చేస్తామో చెప్పుకొచ్చారు. పన్ను మినహాయింపులు, పన్ను రాయితీల పరంగా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి విధానాలను అమలు చేయనుందో తన ఉపన్యాసంలో పేర్కొన్నారు.

సార్వత్రిక ఎన్నికల ముందు బడ్జెట్ ప్రవేశపెట్టే ఆర్థికమంత్రుల చేతులను కట్టి వేసినట్లుగానే ఉంటుంది. ఓటాన్ బడ్జెట్‌లో మూడు, నాలుగు నెలలకుగాను వ్యయానికి సంబంధించిన బడ్జెట్ తప్ప, మరే ఇతర పథకాలకు నిధులు కేటాయించడం, ప్రత్యక్షపన్నుల్లో మార్పులు, చేర్పులు చేయడం విత్తమంత్రులకు సాధ్యం కాదు. అయితే పరోక్ష పన్నుల విధానంలో మార్పులపైన నాటి ఆర్థికమంత్రి జస్వంత్ సింగ్ కొంత చొరవ తీసుకోగలిగారు. అయితే ఈ విషయంలో ఇప్పటికే జీఎస్టీ అమల్లో ఉండడంతో నేటి ఆర్థికమంత్రికి పరిమితులు ఎక్కువగా ఉంటాయి. పరోక్ష పన్నుల్లో మార్పులు జీఎస్టీలోనే ప్రతిఫలిస్తాయి. జీఎస్టీలో మార్పులు, చేర్పులను జీఎస్టీ కౌన్సిల్ ద్వారానే చేపట్టాలి కాబట్టి, ఈ విషయంలో గోయల్ బడ్జెట్‌లో పెద్దగా చేసేదేమీ ఉండదంటున్నారు.

కొత్త పథకాలపై ఓటింగు ఉంటుందా?

ఓటాన్ బడ్జెట్ ఉపన్యాసంలో ఆర్థికమంత్రి మెరుపులు మెరిపించడమో లేదంటే దిగిపోతున్న ప్రభుత్వానికి సంబంధించిన రాజకీయ సందేశాన్ని వినిపించడమో చేయాలా అనే ప్రశ్న ఎదురవుతుంది. ఇక ఓటాన్ బడ్జెట్ ప్రక్రియలో ఉన్న పరిమితులు ఏంటీ అన్నది కూడా ఇక్కడ కీలకం అవుతుంది. ఎన్నికల సంవత్సరంలో కూడా ఆర్థిక శాఖ రానున్న ఆర్థిక సంవత్సరం మొత్తానికి బడ్జెట్‌ని సిద్ధం చేస్తుందని, దీనికి వర్తమాన సంవత్సరం వ్యయాన్ని ఆధారంగా తీసుకుంటారని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖలోని పాత తరం చెబుతోంది. అయితే కొత్త ఆర్థిక సంవత్సరంలోని తొలి మూడు లేదా నాలుగు నెలల కాలానికి అయ్యే వ్యయానికే పార్లమెంటు ఆమోదముద్ర వేస్తుంది. ఈ సమయంలో ఏ కొత్త పథకాలు ప్రవేశపెట్టినా, లేదా ప్రత్యక్ష పన్నుల్లో మార్పులు చేసినా వీటిపై ఓటు నిర్వహించరు. ఓటాన్ బడ్జెట్‌లో వీటిని ప్రస్తావించినా, అవి ప్రభుత్వ ఉద్దేశ్యాలుగా మాత్రమే చూస్తారు తప్ప, ఆర్థికపరమైన కేటాయింపులు జరపలేరు. ఫిబ్రవరి ఓటాన్ బడ్జెట్‌లో వివిధ గణాంకాలను ఆర్థికమంత్రి ప్రస్తావిస్తారు. ఆర్థికలోటు, ఇతర లోట్లు, మిగుల నిధులు వంటివన్నీ ముందస్తు అంచనాలుగానే ఉంటాయి.

బీజేపీపై సడలని నమ్మకం!

అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం ఎదురు కావడంతో ఎన్డీయే కూటమిపై ఒత్తిడి పెరిగింది. రైతు సంక్షోభమే బీజేపీ కొంప ముంచిందనే అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో రైతులకు ఉపశమనం కలిగించే పథకాలను ఎన్నికల ముందు ఎలా అయినా బీజేపీ ప్రభుత్వం ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఎంత వరకు ఈ ప్రజాకర్షక పథకాలను ఎన్డీయే ప్రభుత్వం ప్రకటించగలదన్నది ఒక ప్రశ్న అయితే, అది ఎంత సాధ్యమవుతుందన్నది కూడా కీలక ప్రశ్నగా ఉంటుందని ఆర్థిక రంగ నిపుణులు అంటున్నారు.

ఇక్కడ మరో కీలక పరిణామాన్ని కూడా ఎన్డీయే ప్రభుత్వం గుర్తించాలని నిపుణులంటున్నారు. గత డిసెంబర్‌లో రెండు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఉర్జిత్ పటేల్ రిజర్వు బ్యాంక్ గవర్నర్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. రెండోది.. అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు. ఈ రెండు పరిణామాలు కూడా స్టాక్ ఎక్స్ఛేంజీపై ఎలాంటి ప్రతికూల ప్రభావాలను కలిగించలేకపోయాయి. బీజేపీ పనితీరుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న భారతీయ మదుపరుదార్లకు ఆ పార్టీ ఓటమి కానీ, పటేల్ రాజీనామా కానీ ఏమాత్రం కదిలించలేకపోయాయి. అంచనాలు తారుమారు అయ్యాయన్న బాధ కూడా ఆ వర్గాల్లో మచ్చుకు కూడా కనిపించలేదు. పటేల్ రాజీనామాతో వెంటనే శక్తికాంత్ దాస్‌ను నియమించడంతో ఆర్బీఐకి, ప్రభుత్వానికి మధ్య ఘర్షణ తగ్గిపోయిందని అంటున్నారు.

బీమా కంపెనీల విలీనం ఉంటుందా?

- రూ. 4వేల కోట్లు కేటాయిస్తారా?
- విలీనంతో ప్రభుత్వ బీమా బలపడుతుందా?
- 2018 బడ్జెట్ ప్రసంగంలో విలీన ప్రతిపాదన
- ఓటాన్ బడ్జెట్‌లో నిర్ణయం తీసుకుంటారా?

న్యూఢిల్లీ: 2018 కేంద్ర బడ్జెట్‌లో నేషనల్ ఇన్సెరెన్స్ కంపెనీని, ఓరియంటల్ ఇన్సురెన్స్ కంపెనీని, యునైటెడ్ ఇండియా ఇన్సురెన్స్ కంపెనీలను కలిపేసే ప్రతిపాదన ఉంచారు. అయితే ఆ ఏడాది ఆర్థిక సంవత్సరం ఈ మూడు బీమా కంపెనీలను మిళితం చేసే ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. ఈ ఏడాది అయినా మోక్షం ఉంటుందా అని ఆర్థిక నిపుణులు ఎదురు చూస్తున్నారు. ఈ మూడు బీమా కంపెనీలను మిళితం చేయానికి రూ.4 వేల కోట్లు అవసరమవుతాయని ఆర్థిక మంత్రిత్వశాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఫిబ్రవరి 1న పార్లమెంటులో ప్రవేశపెట్టే ఓటాన్ బడ్జెట్‌లో మూడు బీమా కంపెనీల విలీనం, దానికి అవసరమైన నిధుల కేటాయింపు ప్రస్తావన ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ దిశగా బడ్జెట్‌లో ప్రతిపాదించే నిధుల ఆధారంగా బీమా కంపెనీలకు విడివిడిగా కేటాయింపులు ఉండవచ్చని ఆశిస్తున్నారు. బీమా కంపెనీల ఆర్థిక బలోపేతానికి ఈ నిధులు దోహదపడతాయంటున్నారు.

నష్టాల కారణంగా, అధిక మొత్తాల్లో బీమా చెల్లింపుల వల్లనూ ప్రభుత్వ రంగంలోని బీమా కంపెనీలతో పాటు సాధారణ బీమా కంపెనీలు లాభాలు లేక తీవ్ర ఒత్తిళ్లకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో 2018-19 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్‌లో నేషనల్ ఇన్సురెన్స్ కంపెనీని, ఓరియెంటల్ ఇన్సురెన్స్ కంపెనీని, యునైటెడ్ ఇండియా ఇన్సురెన్స్ కంపెనీలను మిళితం చేయాలని ప్రతిపాదించారు. ఈ మూడు ప్రభుత్వ రంగ బీమా కంపెనీలను మిళితం చేయాలని కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రభుత్వ రంగంలో ఒకే బీమా కంపెనీ ఉండేలా చూడాలని ప్రతిపాదించారు. అదే ఆర్థిక సంవత్సరంలో మూడు బీమా కంపెనీలను మిళితం చేసే ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

మూడు కలిస్తేనే బీమా భీముడు!

మార్చి, 31, 2017 నాటికి ప్రభుత్వ రంగంలోని మూడు బీమా కంపెనీలకు కలిపి రెండు వందలకు పైగా బీమా ఉత్పత్తులున్నాయి. వీటి ప్రీమియం రూ.41,461 కోట్లుగా ఉంది. బీమా మార్కెట్‌లో వీటి వాటా అటుఇటుగా 35 శాతంగా నమోదైంది. ఇక ఈ మూడు బీమా కంపెనీల మొత్తం విలువ రూ.9,2 43 కోట్లుగా ఉండగా, ఉద్యోగులు 44 వేల మందితో దేశవ్యాప్తంగా ఆరు వేల కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. 2017లో ప్రభుత్వ రంగంలోని న్యూ ఇండియా అష్యురెన్స్ కంపెనీ, జనరల్ ఇన్సురెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కంపెనీలు ఇంగ్లాండ్ మినహా మిగిలిన యూరోప్ దేశాల స్టాక్ఎక్స్చేం జీల్లో నమోదు అయ్యాయి. మూడు బీ మా కంపెనీలను మిళితం చేయ డం ద్వారా జీవిత బీమా కంపీ ఇన్సు రెన్స్ కంపెనీగా రూ.1.2 కోట్ల నుంచి 1.5 కోట్లతో అతి పెద్ద కంపెనీగా అవతరిస్తుం దని బీమా రంగ నిపు ణులు అం చ నా వేస్తున్నారు.



ఆర్థిక లోటు తగ్గుతుందా?

- నిధుల మద్దతే మంచిదంటున్న బ్యాంక్ ఆఫ్ అమెరికా
- గ్రామీణ ప్రాంతాలపై దృష్టి పెడతారన్న విదేశీ బ్యాంకు
- జీడీపీలో 0.25 శాతం తేడా కూడా కీలకమేనా?
- రైతుల ఖాతాల్లో నిధుల జమ చేయనున్నారా?

ముంబై: 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఆర్థికలోటును 0.4 శాతం అధిగమించాలని లక్ష్యంగా పెట్టుకుంటే, దీన్ని రానున్న బడ్జెట్‌లో 3.5 శాతం లక్ష్యంగా నిర్దేశించుకొనే అవకాశముందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ కీలకంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపైనే దృష్టి పెట్టే అవకాశమున్నట్లు విదేశీ స్టాక్ ఎక్స్ఛేంజ్ అంచనా వేస్తోంది. గత శుక్రవారం నాడు బ్యాంక్ ఆఫ్ అమెరికా మెరిల్ లించ్ విడుదల చేసిన నోట్‌లో ఇదే విషయాన్ని పేర్కొంది. ఒక్క 2015లో తప్ప మిగిలిన ఆర్థిక సంవత్సరాల్లో మోడీ ప్రభుత్వం ఆర్థిక లోటు అధిగమించడానికి పెట్టుకున్న లక్ష్యాలను ఛేదించలేకపోయిందని స్పష్టం చేసింది. గత ఏడాది నవంబర్ నాటికి జీఎస్టీ వసూళ్లు తగ్గడంతో, పెట్టుబడుల ఉపసంహరణ అనుకున్నస్థాయిలో జరగకపోవడంతో 115 శాతం రుణాలను మార్కెట్ నుంచి స్వీకరించిందని వెల్లడించింది. రూ. 80 వేల కోట్ల వరకు లోటు బడ్జెట్‌ను అధిగమించాలని లక్ష్యంగా పెట్టుకుంటే, ఇంత వరకు కేవలం రూ.15 వేల కోట్లే మాత్రమే సాధించింది. అయితే ఉన్న లోటును మొత్తానికి మొత్తంగా పూడ్చుకోవడానికి మార్కెట్ల నుంచి కేంద్ర ప్రభుత్వం రుణాలను స్వీకరించలేదని, ఆర్బీఐ వద్ద ప్రభుత్వ నిల్వలు మార్చి, 2018 నాటికి రూ.1.657 ట్రిలియన్లు మాత్రమే ఉన్నాయని పేర్కొంది.

చిన్న తేడా కూడా గండమే!

రాబోయే ప్రభుత్వం 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.5.,07 ట్రిలియన్లను రిజర్వుబ్యాంకు నుంచి తీసుకొనే అవకాశముందని బ్యాంక్ అమెరికా అంచనా వేస్తోంది. బడ్జెట్‌లో ఏర్పాటు చేసుకున్న లక్ష్యాన్ని మించి మార్కెట్ నుంచి రుణాలు తీసుకున్నప్పటికీ 2019 ఆర్థిక సంవత్సరంలో 3.3 శాతం లోటును పూడ్చుకోవాలని ప్రభుత్వం పదే పదే ప్రకటించడాన్ని బ్యాంక్ ఆఫ్ అమెరికా గుర్తు చేసింది. అయితే పెట్టుకున్న లక్ష్యం కన్నా 3.5 శాతం ఎక్కువే అయినప్పటికీ మధ్యకాలిక సగటు 4.3 శాతం కన్నా తక్కువేనని అభిప్రాయపడింది. జీడీపీలో 0.25-0.50 మధ్య తేడా కూడా ఆర్థిక వ్యవస్థ సామర్థ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుందని పేర్కొంది. ఆర్థికలోటు పూడ్చుకొనే లక్ష్యాల కన్నా, ఈ పరిస్థితుల్లో సరిపడా నిధుల మద్దతు చాలా ముఖ్యమని బ్యాంక్ అమెరికా స్పష్టం చేసింది. 2020 ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ 26 బిలియన్ డాలర్ల ప్రభుత్వ బాండ్లను ఆర్బీఐ తిరిగి కొనడం అవసరమంది.

రైతే లక్ష్యంగా..!



సార్వత్రిక ఎన్నికల ముందు పార్లమెంటు ముందుకొస్తున్న బడ్జెట్‌లో గ్రామీణ సంక్షోభానికి పరిష్కారాలు ఇచ్చే దిశగా వడ్డీ తగ్గింపు లేదా మాఫీతో పాటు వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేయడం వంటి చర్యలు ఉంటాయని బ్యాంక్ ఆఫ్ అమెరికా జోస్యం చెప్పింది. ప్రత్యక్ష పన్నుల విధానంలో ఆర్థికమంత్రి ఎలాంటి మార్పులు, చేర్పులు చేయకపోవచ్చని, తీవ్రమైన ఆర్థిక సమస్యలతో బాధపడే రంగాలకు ఆసరా అందించాలని సూచించింది. సకాలంలో రుణాలు చెల్లించేరైతుల నాలుగు శాతం వడ్డీని మాఫీ చేయడానికి రూ.30 వేల కోట్లు అవసరమవుతుందని అంచనా వేసింది. రైతు ఆదాయానికి మద్దతుగా నేరుగా వారి ఖాతాల్లోనే డబ్బులు చేసే పథకానికి మరో రూ.70 వేల కోట్లు అవసరమవుతుందని బ్యాంక్ ఆఫ్ అమెరికా అంచనా వేస్తోంది.

విదేశీ వాహనాలపై డ్యూటీ పెంచాలి..

కేంద్ర ప్రభుత్వానికి సియామ్ విజ్ఞప్తి!

న్యూఢిల్లీ: విదేశాల్లోనే పూర్తిస్థాయిలో నిర్మితమైన వాణిజ్య వాహనాలపై కస్టమ్స్ డ్యూటీని నలభై శాతం పెంచాలని భారతీయ వాహనాల తయారీ సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. విదేశీ వాహనాలపై ప్రస్తుతం కేవలం 25 శాతమే కస్టమ్స్ డ్యూటీ ఉన్న విషయం తెలిసింది. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో దేశీయ ఆటోమొబైల్ రంగం తన తరుపున కొన్ని కోర్కెలను ఆర్థిక మంత్రిత్వశాఖ ముందుంచింది. అయితే విదేశాల్లో పూర్తిగా తయారైన కార్లు, బైకుల విషయంలో కస్టమ్స్ డ్యూటీలో ఎలాంటి మార్పులు చేయవద్దని కోరింది. విదేశాల్లో పూర్తిస్థాయిలో తయారైన కార్లు, బైకులపై ప్రస్తుతం యాభై శాతం నుంచి వంద శాతం వరకు కస్టమ్స్ డ్యూటీ విధిస్తున్నారు. డబ్ల్యూటీఓలో భారత్ అంగీకరించినట్లుగా విదేశాల్లో పూర్తిగా తయారైన వాణిజ్య వాహనాలపై ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 40 శాతానికి పెంచాలని, అదే కార్లు, మోటార్ సైకిళ్ల విషయంలో యథాతథ స్థితి కొనసాగించాలని సియామ్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సుగతో సేన్ ఒక ప్రకటనలో కోరారు.


అయితే పూర్తిగా నిర్మితం కాని వాహనాలపైనా, కొంత మేరకే నిర్మితమైన వాహనాలపైనా ఈ నలభై శాతం కస్టమ్స్ డ్యూటీ విధించరాదని సియామ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం పూర్తిగా నిర్మితం కానీ విదేశీ వాణిజ్య వాహనాలపై 15 శాతం నుంచి 30 శాతం కస్టమ్స్ డ్యూటీ వసూలు చేస్తున్నారు. ఆటో రంగంలో పరిశోధన, అభివృద్ధికి చేస్తున్న వ్యయంపై రెండు వందల శాతం తగ్గింపు ఉండాలని కోరింది. దేశంలో ఉద్గారాల విడుదల, సురక్షిత వ్యవస్థల అభివృద్ధిపై ఆటో రంగ పరిశ్రమ రానున్న సంవత్సరాల్లో గణనీయస్థాయిలో నిధులను వ్యయం చేయనున్న దృష్ట్యా పరిశోధన, అభివృద్ధికి కేటాయించే నిధుల విషయంలో ప్రభు త్వం ప్రోత్సా హకా లను ప్రకటిం చడం చాలా అవస రమని సేన్ అభిప్రాయపడ్డారు.



వైద్యానికి ప్రోత్సాహం...


ఓటాన్ బడ్జెట్ ముందు విజ్ఞప్తులు

న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ రంగంలో స్టార్టప్ కంపెనీ లెట్స్‌ఎమ్‌డి ప్రోత్సాహాలను ప్రకటించాలని కేంద్ర ఆర్థికమంత్రిత్వశాఖను కోరింది. చిన్న పట్టణాలు, నగరాల్లో హాస్పిటల్స్ నెలకొల్పడానికి ఇన్సెంటీవ్‌లను ఇవ్వాలని కోరింది. దీంతో పాటు వైద్య రంగంలో వైద్య బీమాను మరింతగా పెంచాలని విజ్ఞప్తి చేసింది. వైద్య సేవల వ్యయం పెరుగుతున్నా బీమా సదుపాయాలు వాటికి తగినస్థాయిలో లేవని పేర్కొంది. ఈ ఏడాది బడ్జెట్‌లో పట్టణాలు, నగరాల్లో హాస్పిటల్స్ నెలకొల్పడానికి ప్రోత్సాహకాలను ప్రకటించాలని లెట్స్‌ఎమ్‌డీ కంపెనీ కోరింది. ఈ రంగంలో వైద్యపరమైన మౌలిక సౌకర్యాల కల్పనకి తేలికపాటి రుణాలను అందించాలని కంపెనీ ఎండీ ఖండేవాల్ కోరారు. వైద్య సంరక్షణ పరిశ్రమకి ప్రాధాన్యత రంగ గుర్తింపు ఇవ్వాలన్నారు. ఆయుష్మాన్ భారత్, ఇతర ప్రభుత్వ వైద్య బీమా పథకాలను అమలు అయ్యే నాటికి వాటి ధరలను సహేతుంగా చేయకపోతే డిమాండ్, సప్లై మధ్య తేడా ఏర్పడుతుందని ఖండేవాల్ హెచ్చరించారు. దేశంలో మారుమూల ప్రాంతాలకు కూడా వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడానికి వీలుగా ఆర్థిక కేటాయింపులు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ వైద్య బీమా పథకాల నుంచి చెల్లింపులు అలస్యం అవుతున్నందున రుణ గ్యారెంటీ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.



చుక్కలపై వంకలు!

- సీనియర్ ఐఏఎస్ సాంబశివరావుపై చంద్రబాబు సీరియస్
- చేతగాకపోతే గుంటూరు కలెక్టర్‌ని సంప్రదించాలని ఆదేశం



అమరావతి, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి ఆదేశాలను ఉన్నతాధికారులు బేఖాతరు చేస్తున్నారని చంద్రబాబునాయుడు సోమవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న మంత్రులు, కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ ప్రత్యేక, ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి. సాంబశివరావుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చుక్కల భూముల సమస్యలపై అధికారులు తనకే చుక్కలు చూపిస్తున్నారంటూ ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేశారు. పాత నిబంధనలతో మీరు ప్రజలను ఇబ్బందులు పెట్టకండి.. కేబినెట్ ఆమోదించిన ఆదేశాలు అమలు చేయాల్సిందే.. వాటిని అమలు చేయకపోవడంలో మీ ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ సందర్భంగా సాంబశివరావు ముఖ్యమంత్రికి సమాధానమిస్తూ మీరు ఆదేశాలు ఇచ్చారు కానీ నిబంధనల (రూల్ బుక్) నుంచి వాటిని తొలగించలేదని, దీని వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పారు. గతంలో రెవెన్యూ శాఖ ద్వారా విడుదలైన జీవో నెం. 12 ద్వారా ప్రభుత్వమే సమస్యలు సృష్టించిందని ప్రభుత్వం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాంబశివరావు కరాఖండిగా చెప్పారు. ఇప్పటికైనా ఆదేశాలు అమలు చేసి 22 -ఎ జాబితాలో తొలగిస్తేనే రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ ముందుకు సాగుతుందని సాంబశివరావు ముఖ్యమంత్రికి సమాధానమిచ్చారు. సాంబశివరావు వాదనను ముఖ్యమంత్రి తప్పుపట్టారు. మీరు సీనియర్ అధికారి కానీ మీకు ఏ పనిచేయడం రావడంలేదు.. మీరు గుంటూరు కలెక్టర్‌దగ్గరకు వెళ్ళి నేర్చుకోవాలని అని చంద్రబాబు వ్యాఖ్యానించడంతో సాంబశివరావు ఖంగుతిన్నారు. అధికారులు బుక్ నాలెడ్జ్‌ని అనుసరించడం వల్లేన ఇన్నాళ్ళూ ఈ సమస్యకు పరిష్కారం లభించక ప్రజలను ముప్పుతిప్పలకు గురిచేసిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

మౌఖిక ఆదేశాలపై సీనియర్ల గుర్రు

ఇదిలావుండగా, సీఎం చంద్రబాబు, రెవెన్యూ ప్రధాన కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేయడాన్ని పలువురు ఐఏఎస్‌లు, ఉన్నతాధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు. వీరిద్దరి సంభాషణను వీడియో కాన్ఫరెన్స్ లో విన్న పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు ముఖ్యమంత్రి తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఒక వైపు ప్రభుత్వమే ఉత్తర్వులు ఇస్తూ మరో వైపు ఆ ఉత్తర్వులకే వ్యతిరేకంగా అధికారులు పనిచేయాలని మౌఖికంగా ఆదేశాలు ఇవ్వడం సరైన చర్య కాదని ముఖ్యమంత్రి చంద్రబాబు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డా. డి. సాంబశివరావుపై పరుషమైన వ్యాఖ్యలు చేయడాన్ని సీనియర్ ఐఏఎస్ అధికారులంతా ముక్తకంఠంతో ఖండించి సాంబశివరావుకు తమ సంఘీభావాన్ని తెలియజేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఈవిషయంలో గుంటూరు జిల్లా కలెక్టర్ కోన శశిధర్ అనుసరించిన విధానాన్నే మిగిలిన జిల్లాల కలెక్టర్లు కూడా అనుసరించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక సమస్యలతో లేనిపోని ఇబ్బందులను సృష్టించకుండా సరళమైన విధానాలతో చుక్కల భూములకు త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. సరళీకృత విధానాలను అనుసరించడం వల్ల గుంటూరు జిల్లాలో 28 వేల చుక్కల భూముల ఫిర్యాదులను పరిష్కరించినట్టు గుంటూరు కలెక్టర్ కోన శశిధర్ ఈసందర్భంగా పేర్కొన్నారు. అలాగే, జిల్లాలో 10 వేల మందికి ఇళ్ళ స్థలాలను అందిస్తున్నట్టు ఆయన చెప్పారు.

ప్రజలు ఓకే అంటే.. ప్రతి ఊరూ స్మార్టే!

- పురస్కార గ్రహీతల సత్కార సభలో సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ: నవ్యాంధ్రలోని ప్రతి గ్రామాన్ని స్మార్ట్ గ్రామంగా తీర్చిదిద్దుకోవాలని, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను ఎంతైనా అభివృద్ధి చేసుకోవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. కృష్ణా జిల్లా కొమరవోలు గ్రామంలో జరిగిన అభివృద్ధిని తాను స్వయంగా చూశానని, ఆ గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు ఇతర గ్రామాలకు ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ ఎంపిక చేసిన అత్యుత్తమ 'స్మార్ట్ విలేజ్ - స్మార్ట్ వార్డు' భాగస్వాములను సోమవారం సచివాలయంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఘనంగా సత్కరించారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన 6వ విడత 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమం సందర్భంగా సమున్నత పనితీరును కనబరిచిన 17 మందిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ ఈ స్మార్ట్ విలేజ్ - స్మార్ట్ వార్డు పురస్కారాలకు ఎంపిక చేసింది. వీరందరినీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం విజయవాడలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సమావేశం ముగిసిన అనంతరం సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడు తూ దత్తత తీసుకున్న గ్రామాలు, వార్డులలో వీరందరూ వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రభుత్వం నిర్వహించిన స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమానికి స్ఫూర్తిగా నిలిచారని అభినందించారు.


పురస్కార గ్రహీతలు వీరే..

రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (నర్సింపల్లి), రాష్ట్రీయ సేవా సమితి (మమందూర్), ఎస్‌కె అబ్దుల్ అలీ (దీనదారుపల్లె), తోట నరసింహం (బూరుగుపూడి), నాట్కో ట్రస్టు (గొల్లంపూడిపాడు), ఆనంద్ కూచిబోట్ల (కూచిపూడి), టాటా ట్రస్ట్స్ (265 గ్రామ పంచాయతీలు), రామోజీ ఫౌండేషన్ (పెదపారుపూడి), మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డోకిపర్రు), ఎ. రవికృష్ణ (కప్పట్రాళ్ళ), ఎంవీ శివకుమార్ రెడ్డి (పోలూరు), సెయింట్ టెక్నాలజీస్ (మోక్షగుండం), అరవిందో ఫార్మా (పెయ్యలపాలెం), దివీస్ లాబొరేటరీస్ (చిప్పాడ, మంతంఎన) శర్ధ మోటల్స్ అండ్ అల్లాయిస్ (కంటకపల్లి), విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ (కె. అన్నవరం), కే. విజయానంద్ (ఎస్. ఉప్పలపాడు).

సీమ కామ్రేడ్లకు సేన ఊపిరి!

- తొలి దశలో కాంగ్రెస్‌తో ఢీ
- మలి దశలో తెదేపా చేయూత
- ఇక జనసేన పొత్తుతో పోటీకి సిద్ధం

తిరుపతి, ప్రభన్యూస్‌బ్యూరో(రాయలసీమ): దాదాపు ఏడు దశాబ్దాల రాయలసీమ ఎన్నికల చరిత్రలో పలు రకాల ఎగుడుదిగుడులను చవిచూసిన వామపక్షాలు రాబోయే ఎన్నికలలో జనసేన పార్టీ పొత్తుతో మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమౌతుంది. 1952, 72 మద్యకాలంలో కాంగ్రెస్ పార్టీతో ముఖాముఖి ఢీకొని చెప్పుకోదగిన ఫలితాలను సాధించిన వామపక్షాలు 1985, 2009 మద్యకాలంలో కొన్ని సార్లు తెలుగుదేశం పార్టీ చేయూతతో పోటీ చేశాయి. 2014 ఎన్నికలలో నిరాశజనకమైన ఫలితాలు చవిచూసిన వామపక్షాలు, వచ్చే ఎన్నికలలో జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సహకారంతో కనీసం 10 స్థానాలలో అయినా తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమౌతున్నాయి. సమాజంలోని పాడిత, పీడిత వర్గాల తరపు పోరాడే శక్తిగా పేరొందిన వామపక్ష పార్టీలకు వర్గ రాజకీయాలకు నిలయమైన రాయలసీమ జిల్లాల ఎన్నికల చరిత్రలో తొలి నుంచి ఎగుడు దిగుడు అనుభవాలో ఎదురయ్యాయి. 1952 ఎన్నికల చరిత్ర ఆరంభమైన దశలో కమ్యూనిష్టు పార్టీ కాంగ్రెస్ పార్టీతో ముఖాముఖి పోటీ చేసి చట్ట సభలలో అడుగు పెట్టగలిగింది. ఆ దశలో ఇటు శాసనసభలో అటు లోక్‌సభలో తరిమెళ్ళనాగిరెడ్డి, ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శివరామిరెడ్డి, గంగమనేని శివయ్య వంటి నేతలు విజయం సాధించగలిగారు. మళ్ళీ 70 వ దశకంలో నిరాశజనకమైన ఫలితాలను చవిచూసిన సిపిఐ, సిపియం పార్టీల నేలతలకు 1983లో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టి ఊపిరి పోసింది. 1985, 2009 మద్యకాలంలో జరిగిన ఎన్నికలలో పలు సార్లు తెలుగుదేశం పార్టీ తోడ్పాటుతో గఫూర్, రామకృష్ణ వంటి మలితరం వామపక్ష నేతలు చట్టసభలకు వెల్లగలిగారు. గత ఏడున్నర దశాబ్దకాల రాయలసీమ ఎన్నికల చరిత్రలో పలుసార్లు పోటీ చేసిన సిపిఐ, సిపియం పార్టిల అభ్యర్దులు 30 స్థానాలలో 14 సార్లు గెలుపును, 40 సార్లు రెండవ స్థానాన్ని దక్కించు కోగలిగారు. మొత్తం చరిత్రలో జరిగిన శాసనసభ ఎన్నికలలో కడప జిల్లాలో 6 స్థానాలకు పోటీ చేసిన వామపక్షాల అభ్యర్దులు వేర్వేరు ఎన్ని కల లో రెండు చోట్ల (రాజంపేట, కమలాపురం) గెలవగా, 8 చోట్ల రెండవ స్థానంలో నిలిచారు. కర్నూ లు జిల్లాలో 8 స్థానాలలో పోటీ చేసి వేర్వేరు ఎన్నికలలో నాలుగుచోట్ల నందికొట్కూరు, కర్నూలు, పత్తికొండలలో గెలిచి 12 చోట్ల రెండవ స్థానంలో నిలిచారు. అనంతపురం జిల్లాలో 10 స్థానాలకు పోటి చేసిన వామపక్షాలు వేర్వేరు ఎన్నికలలో 4 చోట్ల గుత్తి, సింగనమల, అనంతపురం, కల్యాణదుర్గం గెలిచి 20 చోట్ల రెండవ స్థానంలో నిలిచారు. చిత్తూరు జిల్లా విషయానికి వస్తే 6 స్థానాలకు పోటీ చేసి వామపక్షాల అభ్యర్థులు వేర్వేరు ఎన్నికలలో 4 చోట్ల పుత్తూరు, కుప్పం, మదనపల్లె గెలిచి 10 చోట్ల రెండవ స్థానంలో నిలిచారు. లోక్‌సభ ఎన్నికల విషయానికి వస్తే కడప ఎంపీ స్థానానికి 1952 నుంచి 71 వరకు 5 సార్లు పోటీ చేసిన సిపిఐ అభ్యర్థి ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి 4 సార్లు విజయం సాధించారు. అనంతపురం, నంద్యాల ఎంపీ స్థానాలకు 6 సార్లు పోటీ చేసిన సిపిఐ అభ్యర్దులు ఒకసారి విజయం సాధించి 5 సార్లు రెండవ స్థానంలో నిలిచారు. ఇక చివరిసారిగా 2014 లో జరిగిన ఎన్నికలలో దాదాపు 20 స్థానాలలో పోటీ చేయగా రాష్ట్ర విభజనను సమర్ధించిన సిపిఐ అభ్యర్థులతో విభజనను వ్యతిరేకించిన సిపియం అభ్యర్దులకు డిపాజిట్లు కూడా దక్కలేదు. 2014 ఎన్నికల తర్వాత కాలంలో రెండు వామపక్ష పార్టిలు కేంద్రంలో అధి కారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వంతో సిద్దాంతపమైన పోరాటం సాగిస్తూనే ప్రత్యేక హోదా సాధన రాయలసీమ సమస్యల పేరుతో రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తూనే ఉన్నాయి. ఆ పార్టీలకు ఉన్న ఉద్యమ పోరాట చరిత్రను దృష్టిలో ఉంచుకుని వచ్చే ఎన్నికలలో పోటీకి ప్రజాబలాన్ని కూడగడుతున్న జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పొత్తుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన తొలిదశ సమావేశాలలో వామపక్షాలతో కలసి పోటీ చేయడానికి పవన్ కల్యాణ్ సంసిద్దత వ్యక్తం చేశారు. ఈ పరిణా మాలు సహజంగానే రాయలసీమకు చెందిన వామపక్షాలకు ఊపిరినిచ్చా యని చెప్పక తప్పదు. త్వరలో జరిగే సాధారణ ఎన్నికలలో జనసేన సహకారంతో కనీసం 10 స్థానాలలో అయినా పోటి చేయడానికి సిపిఐ, సిపియం నాయకులు సన్నాహాలు చేసుకుంటున్నారు. సీమ జిల్లాలో బలమైన రాజకీయ శక్తిగా బరిలో దిగనున్న జనసేన పార్టీతో పొత్తుతో ఎక్కువ స్థానాలు గెలుచోగలమన ధీమా ఆ పార్టి నాయకులలో కనిపిస్తోంది. పోటీకి తాము సిద్ధం కావడంతో పాటు సమైఖ్య ప్రచార సభల నిర్వహణకు వామపక్షాల నేతలు సిద్దమౌతున్నారు. తాము పోటీ చేసే స్థానాల విషయంలో వచ్చేనెలలో తమ అధినేతలకు పవన్‌కల్యాణ్‌కు జరిగే చర్చలలో స్పష్టత వస్తుందని రాయలసీమ ప్రాంత వామపక్షాల నేతలు చెబుతున్నారు. ఏది ఏమైనా రాయలసీమ ఎన్నికల చరిత్రలో ఎన్నో ఆటుపోట్లను చవిచూస్తూ వచ్చిన వామపక్షాలు జనసే అని పవన్‌కల్యాణ్ సహకారంతో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సర్వసన్నద్దమవుతున్నాయి.



19న వైఎస్‌ఆర్‌సీపీ బీసీ గర్జన

త్వరలో వేదిక ఖరారు



హైదరాబాద్,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో వచ్చే నెల 19న పెద్ద ఎత్తున బీసీ గర్జన సభ నిర్వహించా లని వైఎస్‌ఆర్‌కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణ యించింది. అయితే వేదిక ఎక్కడ అన్నది త్వర లోనే ఖరారవుతుందని పార్టీ బీసీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జంగా మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్ ఏడాదిన్నర కిందట ఏర్పాటు చేసిన బీసి అధ్యయన కమిటీ రాష్ట్రంలోని 13జిల్లాలు 25పార్లమెంట్ నియోజకవర్గాల్లో పర్యటించి బీసీల సమ స్యలపై నివేదిక రూపొందించిందన్నారు. ఈ నివేదికను పార్టీ అధినేత జగన్‌కు సమర్పించామన్నారు. వచ్చేనెల 19న బీసీ గర్జన సభ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. నాలుగేళ్లపాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రలో బీసీలకు ఏవిధమైన న్యాయం చేయకపోగా అన్నిరకా ల అణగదొక్కారన్నారు.బీసీలు న్యాయమూర్తులు దుర్మార్గుడు చంద్రబాబు కాదా అని ప్ర శ్నించారు. జస్టిస్ ఈశ్వరయ్య ఏంచెప్పారో ప్రజలంతా చూశా రన్నారు. బీసీలకు వ్యక్తిత్వ, క్యారెక్టర్ ఉండదని కించపరిచేలా చంద్రబాబు మాట్లాడారన్నారు. నాయి బ్రాహ్మనులకు తోకలు కత్తిరిస్తానని, మత్యకారులను తాట తీస్తానని మాట్లాడార న్నారు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరకుంటారా అని నీచంగా మాట్లాడింది చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. తిరిగి ఏమోహం పెట్టుకుని జయహో బీసీ సభ పెట్టారో చెప్పాలన్నారు. ఇప్పటికీ సంచార జాతులకు కులం పేరు తెలియని పరిస్థితి ఉందన్నారు. బీసీలకు ఏం ఒరగబెట్టారని చంద్రబాబు వైపు ఉంటారన్నారు. అవసరానికి తగినట్టు మాట్లాడే నీచమైన మనిషి చంద్రబాబు అన్నారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. తమ నాయకుడు జగన్ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే నవరత్నాలు ప్రకటిస్తే వాటిని చంద్రబాబు కాపీ కొడుతున్నారన్నారు. జగన్ ప్రతికులానికి కార్పోరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటిస్తే దాన్ని కూడా కాపీ కొట్టారన్నారు. గర్జన సభలో బీసీలకోసం చేపట్టబోయే కార్యక్రమాలను పార్టీ నేత జగన్ వివరిస్తారని జంగా కృష్ణమూర్తి పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

- వైఎస్‌ఆర్ టీచర్స్ ఫెడరేషన్

అమరావతి, ఆంధ్రప్రభ: ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుండా దగా చేసిందని ఆంధ్రప్రదేశ్ వైయస్‌ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.రెడ్డి శేఖరరెడ్డి, కె.వెంకటరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్ని విధాలా ఉద్యమించినా సీపీఎస్‌ను రద్దు చేయలేదన్నారు. ఉద్యోగ,ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రెండు విడతల డీఏను చెల్లించకపోగా, పీఆర్‌సీ గడువు ముగుస్తున్నా ఇంతవరకు తాత్కాలిక భృతిని కూడా ప్రకటించకపోవడం దారుణమన్నారు. స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వలేదన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతుల సమస్య అలాగే ఉందన్నారు. త్వరలో ఎన్నికల కోడ్ రానున్నదని, ఈలోపు సమస్యలు పరిష్కరించకుంటే రానున్న ఎన్నికల్లో అధికార పార్టీకి ఉపాధ్యాయులు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

నత్తనడక వీడని రెవెన్యూ!

- కొత్త చట్టం తెచ్చినా తప్పని తిప్పలు
- చుక్కల భూములపై ఫిర్యాదులు కుప్పలు తెప్పలు

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో నిరు పేదలకు చుక్కల భూముల అధికారాలను నిరుపేద రైతులకు అప్పగించాలన్న ప్రయత్నాలకు అడుగడుగున ఆటంకాలు ఎదురవుతున్నాయి. రాష్ట్రంలో సుమారు 24.52 లక్షల ఎకరాల చుక్కల భూము లకు సంబంధించి సమస్యలు పరిష్కరించేందుకు వీలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత 11 నెలలుగా కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇందుకోసం రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రభుత్వ ఉత్తర్వులు నెం. 12 ను విడుదల చేసింది. ప్రభుత్వం ఉత్తర్వుల్లో నిర్దేశించిన అంశాలకు క్షేత్రస్థాయిలో అడుగడుగున ఆటంకాలు ఎదురవుతున్నాయి. 1954 ముందు ఎవరైతే సాగు చేస్తున్నారో వారికి ధారాదత్తం చేయడానికి గత నాలుగు కేబినెట్ సమావేశాల్లో దీనిపై విస్తృతంగా చర్చించింది. అలాగే చుక్కల భూములపై అధికారాలను 1964 తర్వాత ఎవరు సాగు చేస్తున్నారో వారికే సర్వాధికారాలు అప్పగించాలని, క్రయవిక్రయాలకు పూర్తి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర శాసనసభలో గత శీతాకాల సమావేశాల్లో ఒక చట్టాన్ని ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఏడాది కాలంగా ఈ చట్టాన్ని అమలు చేయాలని ఎంతో తీవ్రంగా ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి అటు జిల్లా స్థాయిలోను, క్షేత్ర స్థాయిలోను సరైన రికార్డులు లభించకపోవడంతో నత్త నడకన సాగుతున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా 2018 నవంబర్ మాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహిం చిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో డిసెంబర్ 24వ తేది నాటికి చుక్కల భూముల సమస్యను పూర్తిగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. క్షేత్ర స్థాయిలో భూ రికార్డులు సక్రమైన పద్ధతిలో లేకపోవడంతో పాటు 1964 నుండి ఇప్పటి వరకు ఆయా భూములు దాదాపు నలుగురు నుండి ఆరుగురు రైతుల వరకు చేతులు మారినట్లు అధికారులు కనుగొన్నారు. దీంతో ప్రభుత్వంనిర్దేశించిన అర్హతలు ప్రస్తుతం చుక్కల భూముల్లో సాగు చేస్తున్న రైతులకు లేకపోవడంతో దీనిపై పూర్తిగా ఎలాంటి నిర్ణయాన్ని తీసుకోలేక పోతున్నామని మండల, జిల్లా స్థాయి అధికారులు రాష్ట్ర స్థాయి అధికారులకు తెలియజేయడంతో మరింత సంధిగ్దంలో పడాల్సి వచ్చింది. ఈ వ్యవహారం ఇలా కొనసాగుతున్న నేపథ్యంలో మరో 3నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్నం దున రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన చుక్కల భూములపై ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు క్షేత్ర స్థాయిలో అమలు కాకపోవ డంతో మంత్రులకు, ఉన్నతాధి కారుల మధ్య అవరోధాన్ని సృష్టిస్తున్నాయి. ఇప్పటికే చుక్కల భూముల వ్యవహారంలో కోట్లాది రూపాయలు చేతులు మారాయంటూ విమర్శలు వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర శాసనసభలో చట్టాన్ని ఆమోదించిన ఇప్పటి వరకు రాష్ట్రంలోని 2లక్షల 45వేల మంది నిరుపేద రైతులకు చుక్కల భూములపై యాజమా న్యపు హక్కులు కల్పించడం లో అధికారులు పూర్తిగా విఫలమైనట్లు స్పష్టమౌతోంది. ఈ అంశం ప్రతిపక్షపార్టీల వారికి ఎన్నికల ప్రచారాస్త్రంగా మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అధికార పార్టీలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు,మంత్రులు పదే పదే ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తుండడంతో గత నాలుగు రోజులు క్రితం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోను పలు సవరణలు చేపట్టి కేబినెట్ ఆమోదించిన సవరణల ఫైల్ ను గవర్నర్ ఆమోదానికి పంపించింది. రేపటినుంచి జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ఆమోదం పొందిన బిల్లును అమలు అయ్యేలా చూసేందుకు ముఖ్యమంత్రి చొరవ తీసుకున్నారు. కాని క్షేత్రస్థాయిలో రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన డిజిటలైజేషన్ ఆన్‌లైన్ రికార్డులను పొందుపరచడంలో రెవెన్యూ శాఖాధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్పష్టం అవుతున్నది.ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయేఎన్నికల్లో ప్రతి పక్షాలు చుక్కల అంశాన్ని ప్రజల ముందుకు తీసుకువెళ్ళి బలమైన వాదనను వినిపించి అధికార పార్టీకి చుక్కలు చూపించే అవకాశం వున్నందున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం జరిగిన కలెక్టర్ల సదస్సులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవిన్యూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. నిబంధనల కారణంగా సమస్యను మరింత జటిలం చేయ కుండా పరిస్థితులకు అనుగుణంగా సరళీకృత విధానాలను అనుసరించాల్సిందిగా సూచించారు.


ప్రభుత్వ విప్ బుద్ధా వెంకన్న

ఊసరవెల్లిలా దగ్గుబాటి కుటుంబం

అమరావతి, ఆంధ్రప్రభ: అవసరాలకు అనుగుణంగా ఊసరవెల్లి రంగుల్ని మార్చినట్లు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ఆయన కుటుంబ సభ్యులు ఏఎండకు ఆగొడుగు పడుతూ పార్టీలు మారడం వారికి పరిపాటిగా మారిందని ప్రభుత్వ విప్ బుద్ధా వెంకన్న మండిపడ్డారు. సోమవారం విజయవాడ రాష్ట్ర అతిథి గృహంలో మీడియాతో మాట్లాడుతూ దగ్గుబాటి కుంటుంబానికి పదవులంటే పర మాన్నంలాగా మారాయని, తమ రాజకీయ లబ్ధికోసం రాష్ట్రంలోని అన్ని పార్టీలను వారు తిరగేశారన్నారు. పురందేశ్వరి బీజేపీలో ఉంటా రని, కానీ తాను, తన కుమారుడు వైసీపీలో ఉంటామని దగ్గుబాటి చెప్ప టాన్ని తప్పుపట్టారు. అంటే ఇది బీజేపీ, వైసీపీ జాయింట్ వెంచర్‌గా అర్థమవుతోందని విమర్శించారు. ఈ దేశంలో అత్యంత అవినీతి పరుడిగా గుర్తింపు పొందిన జగన్ పంచన చేరి చిలకపలుకులు పలకడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేవలం కొడుక్కి పర్చూరు సీటు కోసమే జగన్‌ను దగ్గుబాటి పొగడ్తలతో ముంచెత్తుతున్నారని,ఒక సీటు కోసం తన స్థాయిని, వ్యక్తిత్వాన్ని దిగజార్చుకుని టిడిపిపై అవాకులు చవాకులు పేలుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీ, వైసీపీ, టీఆర్ఎస్ ఒకే గూటి పక్షులని తేలిపోయిందని, జగన్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు లోపాయికారి ఒప్పందం చేసుకొని ముఖ్యమంత్రి చంద్రబాబుపై విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్టీఆర్ వారసులుగా చెప్పుకునే ఆయన సతీమణి పురందేశ్వరి కాంగ్రెస్‌లో పదేళ్లపాటు కేంద్రమంత్రిగా పదవులు అనుభవించి, బీజేపీ అధికారంలోకి వస్తోందని భావించి 2014లో బీజేపీలో చేరారని, తమ స్వార్థం కోసం భార్యా, భర్త వేరు వేరు పార్టీల్లో ఉంటామని ప్రకటించడం నీచ రాజకీయ మనస్తత్వానికి అద్దం పడుతున్నదన్నారు.

స్కూల్ బస్సు బోల్తా

- కల్వర్ట్‌లోకి దూసుకెళ్లిన బస్సు
- 15 మంది విద్యార్థులకు తీవ్ర గాయాలు
- ఫిట్‌నెస్ లేని కారణంగా ప్రమాదం



గుంటూరు, ప్రభన్యూస్ బ్యూరో: ఫిటెనెస్ లేని బస్సు... పరిమితికి మించి ఎక్కిన విద్యార్థులు .. స్కూల్ యాజమాన్యం, రవాణాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా 15మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. తప్పు ఎవరిదైనా శిక్ష అనుభవిస్తున్నది మాత్రం అభంశుభం తెలియని చిన్నారులే. వివరాల్లోకి వెళ్తే ... గుంటూరు జిల్లా మాచర్లలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ బస్సు ఉదయం 8 గంటలకు వెల్దుర్తి మండలం ఉప్పలపాడు గ్రామం నుంచి 55మంది విద్యార్థులను ఎక్కించుకుని స్కూల్‌కి వెళ్తున్న సమయంలో మండాది గ్రామ శివారులో ఎక్స్‌లేటర్ విరగటంతో ఒక్కసారిగా బస్సు అదుపుతప్పి కల్వర్ట్ నుంచి పక్కనే ఉన్న వాగులో పడిపోయింది. దీంతో బస్సులో ఉన్న 55 మంది విద్యార్థుల్లో 15 మందికి తీవ్ర గాయాలు కాగా, 40 మందికి చిన్నపాటి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి బస్సులో ఉన్న విద్యార్థులను బయటకు తీసి మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన 10 మంది విద్యార్థులను నర్సరావుపేట ప్రభుత్వాసుపత్రికి, ఐదుగురిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. 40 మంది కెపాసిటి కలిగిన స్కూల్ బస్సులో 55 మంది విద్యార్థులను ఎక్కించటంపై స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనంగా కన్పిస్తుంది. మరోవైపు స్కూల్ బస్సు ఫిటెనెస్ లేకపోవటం వలన ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. రన్నింగ్‌లో ఉన్న బస్సు ఎక్స్‌లేటర్ ఒక్కసారిగా విరగటంతో బస్సు మొత్తం తిరగబడాల్సి ఉండగా డ్రైవర్ చాకచాక్యంగా వ్యవహరించటంతో పక్కనే ఉన్న వాగులోకి పడినట్లు తెలుస్తోంది. దీంతో విద్యార్థులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

ప్రమాదం తెలుసుకున్న వెంటనే మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ ఇన్‌ఛార్జ్ కొమ్మారెడ్డి చలమారెడ్డి హుటాహుటిన మాచర్ల ప్రభుత్వాసుపత్రికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గురజాల డీఎస్పీ శ్రీహరిబాబు సంఘటన స్థలానికి చేరుకొని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని ప్రమాదానికి గల కారణాలను సేకరిస్తున్నారు. అయితే కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యం మాత్రం ప్రమాద స్థలానికి రాకుండా స్కూల్‌కు తాళాలు వేసి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం, రవాణాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. జరిగిన సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరుపుతామని డీఎస్పీ శ్రీహరిబాబు స్పష్టం చేశారు.

మంత్రి గంటా విచారణకు ఆదేశం

గుంటూరు జిల్లా వెల్దుర్తి మండలం మండాది వాగు వద్ద ప్రైవేట్ స్కూల్ బస్సు బోల్తా పడిన ఘటనపై రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు సోమవారం సీరియస్‌గా స్పందించారు. ఘటనలో గాయపడిన 15 మంది విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించాలని మంత్రి గంటా జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు ఘటనపై సత్వరమే విచారించి, నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి స్పష్టంచేశారు.

ఘటనపై మంత్రి కిడారి ఆరా

బస్సు ప్రమాదంలో గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ జిల్లా వైద్యాధికారులకు ఆదేశించారు. స్కూల్ బస్సు బోల్తా ఘటనపై ఫోన్‌లో ఆరా తీశారు. ప్రమాదం జరిగిన సమయంలో మాచర్ల ఆసుప త్రిలో డాక్టర్లు అందుబాటులో లేరన్న ఎమ్మెల్యే పీఆర్కే వ్యాఖ్యలను ఆయన తీ వ్రంగా ఖండించారు. 50మంది విద్యార్థులు ఆసుపత్రికి వచ్చారని, 14 మందికి చికిత్స అందించామని ఇందులో ఇద్దరికి తీ వ్ర గాయాలైనట్లు వైద్యులు తెలిపినట్లు మంత్రి వివరించారు.

సిరీస్ మనదే...

క్రీడాప్రభ

3-0 తేడాతో న్యూజిలాండ్‌పై విజయబావుటా

- 7 వికెట్ల తేడాతో మూడో వన్డేలో గెలుపు
- కొనసాగుతున్న టీమిండియా జైత్రయాత్ర
- 10 ఏళ్ల తరువాత కివీస్ గడ్డపై తొలి సిరీస్
- రాణించిన రోహిత్(62), కోహ్లీ(60)


(62; 77 బంతుల్లో 3×4, 2×6)

టీమిండియా జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆస్ట్రేలియా పర్యటనలో రెండు ఫార్మాట్ లో సిరీస్‌లను కైవసం చేసుకున్న టీమిండియా ఇప్పుడు న్యూజిలాండ్‌పై వరుసగా మూడు వన్డేలు గెలిచింది. 5 వన్డేల సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకుంది. ప్రతి ఒక్కరు ఆలౌ రౌండర్ ప్రతిభ కనబర్చి సమష్టిగా రాణించడంతో భారత్ విజయ బావుట ఎగురవేసింది. సోమవారం జరిగిన మూడో వన్డేలో టీమిండియా 7 వికెట్ల తేడాతో హ్యాట్రిక్ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఒకప్పుడు ఆసీస్, కివీస్‌పై గెలవాలంటేనే చెమటోడ్చాల్సి వచ్చేది. ఒకవైపు పటిష్టమైన టాప్, మిడిల్ ఆర్డర్, మరోవైపు పేస్‌ను ఉపయోగించి రెండు వన్డే సిరీస్‌లను కైవసం చేసుకుంది. 10 ఏళ్ల తరువాత విరాట్ సారథ్యంలో వన్డే సిరీస్‌ను టీమిండియా దక్కించుకుంది.

మౌంట్ మాంగనుయ్ : బే ఓవల్ వేదికగా సోమవారం కివీస్-భారత్ మధ్య జరిగిన మూడో వన్డేలో ముందుగా న్యూజిలాండ్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 49 ఓవర్లలో 244 పరుగుల లక్ష్యాన్ని భారత్ ముందు ఉంచింది. ఓపెనర్ శిఖర్ ధావన్ (28; 27 బంతుల్లో 6×4), రోహిత్ శర్మ (62; 77 బంతుల్లో 3×4, 2×6) చేశారు. రెండు మ్యాచులు మిగిలి ఉండగానే 7 వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసుకున్నారు. భారత్ ఆది నుంచి దూకుడు ప్రదర్శించింది. ధావన్‌ను బౌల్ట్ పెవిలియన్ పంపించడంతో టీమిండియా 39 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయింది. ఆ తరువాత వచ్చిన కెప్టెన్ కోహ్లీ, రోహిత్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లారు. ఇద్దరూ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకుని పరుగుల వరద పారించారు. రెండో వికెట్‌కు 113 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. ఆ తరువాత శాంట్నర్ బౌలింగ్‌లో రోహిత్ (62) వద్ద పెవిలియన్ చేరాడు. ఆ తరువాత కోహ్లీ రూపంలో టీమిండియా 168 పరుగుల వద్ద మూడో వికెట్ కోల్పోయింది. బౌల్ట్ బౌలింగ్‌లో విరాట్ కోహ్లీ (60; 74 బంతుల్లో 6×4, 1×6) ఔటయ్యాడు. ఆ తరువాత అంబటి రాయుడు- దినేష్ కార్తీక్‌లు సమయోచిత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నారు. ఆచితూచి ఆడుతూనే షాట్లతో ప్రత్యర్థులపై విరుచుకుపడ్డారు. ఫలితంగా టీమిండియా మూడో వన్డేలో 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. రాయుడు (40; 42 బంతుల్లో 5×4, 1×6)తో, దినేశ్ కార్తీక్ (38; 38 బంతుల్లో 5×4, 1×6) తో నాటౌట్‌గా నిలిచారు. భారత్ 43 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. న్యూజిలాండ్ బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్ 2 వికెట్లు, సాంత్నార్ ఒక వికెట్ తీశారు. షమీకి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. విరాట్ కోహ్లీ మరో ఘనత సాధించాడు. 63 వన్డేలకు సారథ్యం వహించగా 47 మ్యాచుల్లో జట్టును గెలిపించాడు. క్లైవ్ లాయిడ్, పాంటింగ్ (50) వన్డే విజయాల రికార్డుకు చేరువలో నిలిచాడు.

టేలర్ రాణించినా.. తప్పని ఓటమి

అంతకు ముందు బ్యాంటింగ్ చేసిన న్యూజిలాండ్ 243 పరుగులకు ఆలౌటైంది. రాస్ టేలర్ (93; 106 బంతుల్లో 9×4), లాథమ్ (51; 64 బంతుల్లో 1×4, 1×6) ఆకట్టుకున్నారు. దీంతో న్యూజిలాండ్ గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. కివీస్ మున్రో (7) రూపంలో తొలి వికెట్ కోల్పోగా కొద్ది సేపటికే గప్టిల్ (13) వద్ద ఔటయ్యా డు. దీంతో 26 పరుగులకు కివీస్ ఓపెనర్లను కోల్పోయింది. కేన్, టేలర్ వచ్చి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దడానికి ప్రయత్నించారు. విలియమ్సన్ (28) వద్ద ఔటయ్యాడు. ఆ తరువాత వచ్చిన లాథమ్, టేలర్‌తో జత కట్టి 119 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. హాఫ్ సెంచరీ చేసిన లాథమ్ (51) వద్ద ఔటయ్యాడు. నికోలస్, సాంత్నార్‌లు వెనువెంటనే ఔటయ్యారు. 20 పరుగుల వ్యవధిలో కివీస్ 3 వికెట్లు కోల్పోయింది. టేలర్ కూడా 91 పరుగుల ఏడో వికెట్‌గా పెవిలియన్ చేరాడు. షమీ 3 వికెట్లు, పాండ్యా, చహల్, భువనేశ్వర్ రెండేసీ వికెట్లు తీశారు.


(60; 74 బంతుల్లో 6×4,1×6)

బ్యాటింగ్ లైనప్ పుంజుకుంది: విరాట్

ప్రపంచ కప్ ముందున్న సమయంలో టీమిండియా ఇలా వరుసగా ఆస్ట్రేలియాపై 2, కివీస్‌పై 3 వన్డేలు గెలుపొందడం ఎంతో ఆనందంగా ఉంది. టీమిండియా ఆటో మోడ్ లో ఉందని, భయపడాల్సిన అవసరం లేదు. 4వ స్థానం ఎంతో కీలకం. రాయుడు వచ్చాక బ్యాటింగ్ లైనప్‌పై ఉన్న బాధ తీరిపోయింది. దినేష్ కార్తీక్‌ను ఎప్పుడు దించినా పరుగుల వరద పారిస్తుంటాడు. ధోనీ కూడా అదే విధమైన ఆటతీరును కనబరుస్తాడు. సిరీస్‌ను సొంతం చేసుకోవడం సంతోషంగా ఉంది. నేను లేకపోయినా విజయాల పరంపర కొనసాగుతూ నే ఉంటుంది. విశ్రాంతి కోసం వెళ్తున్న సమయంలో సిరీస్‌ను కైవసం చేసుకోవడం ఆనందం వేస్తోంది. ఇక సంతోషంగా బ్రేక్ తీసుకుంటాను. ఆస్ట్రేలియా సిరీస్ నుంచి విశ్రాంతి లేకుండా ఆడుతున్నాను. ఆటగాళ్లందరూ ఆల్ రౌండర్ ప్రతిభకనబర్చారు. వన్డేల్లో కివీస్ కూడా మంచి జట్టే. క్లీన్ స్వీప్ చేయడమే మా లక్ష్యం. హార్దిక్ పాండ్యా మంచి క్రికెటర్. సస్పెండ్ ఎత్తేసిన తరువాత ఇంకా బాగా రాణిస్తాడని భావిస్తున్నాను. కివీస్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ క్యాచ్ అద్భుతంగా పట్టడం, 2 వికెట్లు తీయడం వంటివి క్రికెట్‌లో పాండ్యా మరింత ఎదుగుతాడు అనడానికి నిదర్శనం.

ఇండియా మాకు పాఠాలు నేర్పుతోంది:కేన్



వరుసగా మూడు మ్యాచులు ఓడిపోవడం బాధగా ఉంది. ఐదు వన్డేల సిరీస్‌లో టీమిండియా మాకు క్రికెట్ పాఠాలు నేర్పుతోంది. సిరీస్‌ను ఇప్పటికే కోల్పోయాం. రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న ఆటతీరును చూసి మేం చాలా నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. వారి వ్యూహాలు మమ్మల్ని తప్పులు చేసేలా చేసింది. మేము ఊహించినదానికంటే బాగానే ఆడారు. టేలర్ (93), లాథమ్ (51) పరుగులు చేయడంతో జట్టు 243కు చేరుకుంది.

స్కోరుబోర్డు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్ : మార్టిన్ గప్టిల్ (సి) కార్తీక్ (బి) భువనేశ్వర్ 13; కొలిన్ మున్రో (సి) రోహిత్ (బి) షమీ 7; కేన్ విలియమ్సన్ (సి) హార్దిక్ (బి) చాహల్ 28; రాస్ టేలర్ (సి) కార్తీక్ (బి) షమీ 93; లాథమ్ (సి) రాయుడు (బి) చాహల్ 51, హెన్రీ నికోల్స్ (సి) కార్తీక్ (బి) హార్దిక్ పాండ్యా 6; మిచెల్ శాంట్నర్ (సి) కార్తీక్ (బి) హార్దిక్ పాండ్యా 3; బ్రాస్‌వెల్ (రనౌట్) (కోహ్లీ) 15; ఇష్‌సోధీ (సి) కోహ్లీ (బి) షమీ 12; ట్రెంట్ బౌల్ట్ (సి) షమీ (బి) భువనేశ్వర్ 2; ఫెర్గ్యుసన్ (2 నాటౌట్). ఎక్స్‌ట్రాలు : 11. మొత్తం : (49 ఓవర్లలో 10 వికెట్లకు) 243. **వికెట్ల పతనం** : 1-10, 2-26, 3-59, 4-178, 5-191, 6-198, 7-222, 8-239, 9-239, 10-243. **బౌలింగ్ :** భువనేశ్వర్ కుమార్ 10-1-46-2, మహ్మద్ షమీ 9-0-41-3, చాహల్ 9-0-51-2, హార్దిక్ పాండ్యా 10-0-45-2, కుల్దీప్ యాదవ్ 8-0-39-0, కెదార్ జాదవ్ 3-0-17-0.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (స్టంప్ లాంథమ్) (బి) శాంట్నర్ 62; శిఖర్ ధావన్ (సి) టేలర్ (బి) బౌల్ట్ 28; విరాట్ కోహ్లీ (సి) హెన్రీ నికోలస్ (బి) బౌల్ట్ 60; అంబటి రాయుడు (40 నాటౌట్); దినేష్‌కార్తీక్ (నాటౌట్ 38). ఎక్స్‌ట్రాలు : 17. మొత్తం (43 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 245). **వికెట్ల పతనం:** 1-39, 2-152, 3-168. **బౌలింగ్ :** బౌల్ట్ 10-1-40-2, బ్రాస్‌వెల్ 6-0-49-0, ఫెర్గ్యుసన్ 10-1-57-0, శాంటర్న్ 10-0-45-1, ఇష్ సోధి 7-0-53-0.

అతని బ్యాటింగ్ చూసి ఆశ్చర్యపోయా: కోహ్లీ


శుభ్‌మన్ గిల్

చిచ్చరపిడుగు శుభ్‌మన్ గిల్ నెట్‌లో ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు చూశాను. ఆశ్చర్యం వేసింది. 19 ఏళ్లప్పుడే ఎంతో బాగా బ్యాటింగ్ శైలి ఉంది. 19 ఏళ్లు ఉన్నప్పుడు గిల్‌లో ఉన్న 10 శాతం ప్రతిభ కూడా నాలో లేదు. టీమిండియా లో ఔట్ స్టాండింగ్ టాలెంట్ ఉన్న వాళ్లు వస్తున్నారు. పృథ్వీషా గురించి చెప్పనక్కర్లేదు. వెస్టిండీస్‌తో మొదటి టెస్టు మ్యాచ్‌లోనే శతక్కొట్టాడు. అదే తరహా టాలెంట్ శుభ్‌మన్ గిల్‌లో కూడా ఉంది. నెట్ ప్రాక్టీస్ చూసినప్పుడు గిల్ ఏంటో తెలుసుకున్నాను. ఇండియన్ క్రికెట్‌కు మంచి ఆటగాడు దొరి కాడని భావిస్తున్నాను. మేనేజ్‌మెంట్ కూడా ఇలాంటి వాళ్లకు అవకా శాలు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఇది ఎంతో ఆనందంగా ఉంది. అండర్ - 19 వరల్డ్ కప్ టీంలో సభ్యుడిగా ఉన్నాడు. 418 పరుగులతో మెరిశాడు.

రాయుడికి ఐసీసీ షాక్

- అంతర్జాతీయ బౌలింగ్‌పై నిషేధం
- బౌలింగ్ యాక్షన్‌పై కౌన్సిల్ అభ్యంతరం
- పరీక్షకు హాజరు కావాలంటూ ఆదేశం

దుబాయ్ : హైదరాబాద్ ఆటగాడు, టీమిండియా క్రికెటర్ అంబటి రాయుడికి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) షాక్ ఇచ్చింది. అంతర్జాతీయ క్రికెట్‌లో రాయుడు బౌలింగ్ చేయకుండా నిషేధం విధించింది. రాయుడి బౌలింగ్ యాక్షన్ అనుమానాస్పదంగా ఉందని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఐసీసీ ఈ నిర్ణయం తీసుకుంది. ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి వన్డేలో రాయుడు ఆఫ్ స్పిన్ బౌలింగ్ యాక్షన్‌ను ఐసీసీ తప్పుబట్టిన విషయం తెలిసిందే. బౌలింగ్ యాక్షన్‌కు సంబంధించిన పరీక్షకు హాజరు కావాలని ఐసీసీ ఆదేశించింది. 14 రోజుల్లో రాయుడు హాజరుకాకపోవడంతో నిబంధనల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. దేశవాళీ, బీసీసీఐ పరిధిలో జరిగే టోర్నీల్లో మాత్రం చేయవచ్చని, అంతర్జాతీయ క్రికెట్‌లో చేయరాదంటూ స్పష్టం చేసింది. జనవరి 13లోగా రాయుడు బౌలింగ్ పరీక్షకు హాజరుకావాల్సి ఆదేశించింది. కానీ న్యూజిలాండ్ పర్యటనతో బిజీగా ఉన్న రాయుడు హాజరుకాలేకపోయాడు. ఐసీసీ నిబంధనల్లోని 4.2 క్లాజ్ ప్రకారం అంతర్జాతీయ అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో బౌలింగ్ చేయకుండా అతనిపై నిషేధం విధించింది. పరీక్షకు హాజరైన బౌలింగ్ సరైందని నిరూపించుకునే వరకు ఈ నిషేధం కొనసాగుతుందని ఐసీసీ వివరించింది. 49 వన్డే మ్యాచులు ఆడిన రాయుడు 20.1 ఓవర్లు మాత్రమే వేసి 3 వికెట్లు తీసుకున్నాడు. దేశవాళీ వన్డేలు, టీ20ల్లో ఒక్కసారి కూడా బౌలింగ్ చేయలేదు. సిడ్నీ వన్డేలో 2 ఓవర్లు వేసి 13 పరుగులు ఇచ్చిన విషయం తెలిసిందే.




నొవాక్ జకోవిచ్ (సెర్బియా)


రఫేల్ నాదల్ (స్పెయిన్)

నొవాక్ జకోవిచ్ టాప్

- ఆరో స్థానానికి పడిపోయిన ఫెదరర్
- మూడు, నాల్గో స్థానాల్లో జ్వేరెవ్, మార్టిన్

ప్యారిస్ : అంతర్జాతీయ టెన్నిస్ రంగంలో నొవాక్ జకోవిచ్ (10,955 పాయింట్లు) మొదటి స్థానంలో కొనసాగుతున్నాడు. సోమవారం ఏటీపీ తాజా ర్యాంకులను విడుదల చేసింది. ఆదివారం జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ ఫైనల్‌లో నాదల్‌పై జకోవిచ్ గెలిచిన విషయం తెలిసిందే. జకోవిచ్, రెండు గంటల్లోనే వరుసగా మూడు సెట్‌లలో విజయం సాధించాడు. రఫెల్ నాదల్ (8,320 పాయింట్లు) రెండో స్థానంలో ఉన్నాడు. రోజర్ ఫెదరర్ మూడో స్థానం నుంచి ఆరో స్థానానికి పడిపోయాడు. ఫెదరర్ ఉన్న 3వ స్థానాన్ని అలెగ్జాండర్ జ్వేరెవ్ (6,475 పాయింట్లు) చేజిక్కించుకున్నాడు. మార్టిన్ డెల్ పోట్రో (5,060 పాయింట్లు) నాల్గో స్థానంలో ఉన్నాడు. క్వార్టర్ ఫైనల్‌లో అడుగుపెట్టిన నిషికోరి (4,110 పాయింట్లు) రెండు స్థానాలు పైకి ఎగబాకి 7వ స్థానంలో ఉన్నాడు. సెమీ ఫైనల్స్‌లో నాదల్ చేతిలో ఓడిపోయిన థెస్టిపాస్ (2,805 పాయింట్లు) మూడు స్థానాలు మెరుగుపర్చుకుని 12వ స్థానంలో ఉన్నాడు. టాప్ టెన్‌లో వచ్చేందుకు ద్వారం వద్ద సిద్ధమయ్యాడు. కెవిన్ అండర్సన్ (4,845 పాయింట్లు) ఐదో స్థానంలో, డోమినిక్ థీమ్ (3,960 పాయింట్లు) 8వ స్థానంలో, జాన్ ఇస్నర్ (3,155 పాయింట్లు) 9వ స్థానంలో, మారిన్ సిలిక్ (3,140 పాయింట్లు) 10వ స్థానంలో కొనసాగుతున్నాడు.

సైనా.. కంగ్రాట్స్
ట్విట్టర్‌లో కేటీఆర్

ఇండోనేసియా ఓపెన్‌టైటిల్ - 2019 విజేతగా నిలిచిన సైనా నెహ్వాల్‌ను టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ ద్వారా అభినందించారు. సోమవారం తన విజయాన్ని పేర్కొంటూ ఆమె చేసిన ట్వీట్‌ను రీట్వీట్ చేస్తూ అభినందనలు తెలిపారు.



స్పెయిన్-భారత్ హాకీ మ్యాచ్ డ్రా

మ్యూరికా (స్పెయిన్): స్పెయిన్-భారత్ మధ్య జరిగిన రెండో అంతర్జాతీయ మహిళల హాకీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఇరు జట్లు హోరాహోరీగా పోరాడాయి. గోల్స్ చేయకుండా ఇరు జట్ల క్రీడాకారులు ఎంతో పకడ్బందీ వ్యూహాలను అమలు చేశాయి. దీంతో 1-1 గోల్స్‌తో డ్రాగా ముగిసింది. మొదటి మ్యాచ్‌లో భారత్‌ను 2-3 గోల్స్ తేడాతో స్పెయిన్ ఓడించిన విషయం తెలిసిందే. రెండో మ్యాచ్‌లో గుర్జిత్ కౌర్ 43వ నిమిషంలో మొదటి గోల్ చేసి స్పెయిన్‌పై ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఆ తరువాత వెంటనే మరియా 49వ నిమిషంలో గోల్స్ చేయడంతో స్కోరు 1-1కు చేరింది. రెండో మ్యాచ్‌లో మాత్రం భారత జట్టు తీవ్రంగా శ్రమించింది.

హాఫ్ టైం వరకు కూడా ఎలాంటి గోల్స్ నమోదు కాలేదు. మూడో క్వార్టర్‌లో స్పెయిన్ పెనాల్టీ కార్నర్ ఛాన్స్ వచ్చినా దాన్ని ఇండియా గోల్ కీపర్ అడ్డుకుంది. ఇరు జట్ల మధ్య సాగిన హోరా హోరీ పోరు చివరికి 1-1తో డ్రాగా ముగిసింది.


బోయిన్‌పల్లిలోని ఎస్ఐఎంహెచ్ 35వ క్రీడా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టెన్నిస్ స్టార్ సానియా మిర్జా హాజరై చిన్నారులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న దృశ్యం.

ప్రజ్నేష్, అంకిత రైనాకు కెరీర్ బెస్ట్ ర్యాంకులు

న్యూఢిల్లీ : ఇండియన్ టెన్నిస్ ప్లేయర్ ప్రజ్నేష్ గున్నేశ్వరన్, సింగపూర్ ఐటీఎఫ్ టైటిల్ విన్నర్ అంకితా రైనా కెరీర్ బెస్ట్ ర్యాంకింగ్స్‌లకు చేరుకున్నారు. పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రజ్నేష్ 102వ ర్యాంకులో కొనసాగుతున్నాడు. గతం కంటే 7 స్థానాలు పైకి ఎగబాకాడు. ఇక మహిళ సింగిల్స్‌లో అంకితా రైనా ఏకంగా 35 స్థానాలు దాటుకుని ప్రస్తుతం 168వ ర్యాంకు వద్ద స్థిరపడింది. వచ్చే వారంలో అస్తానా, ఖజకిస్తాన్‌లో జరగబోయే ఫెడ్ కప్‌లో అంకితా పాల్గొనబోతోంది. ఈ సందర్భంగా అంకితా మాట్లాడుతూ.. ఈ ఏడాది ఆస్ట్రేలియాలో టెన్నిస్ జర్నీ బాగానే ప్రారంభమైందని, మళ్లీ కెరీర్ మంచి ర్యాంకు రావడం ఒకే నెల్లో జరిగా యని అన్నారు. ఎంతో ఆనందంగా ఉందని చెప్పుకొచ్చింది. ఈ ర్యాంకు రావడానికి కృషి చేసిన అందరికీ నా ధన్యవాదాలు తెలియజే స్తున్నట్టు వివరించింది. లక్ష్యానికి అనుగు ణంగా ముందుకు వెళ్తానని తెలిపిం ది. ఓఎన్‌జీసీ,






స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ గుజరాత్ అంకితకు సహాయం అందిస్తోంది. కర్మన్ కౌర్ థండి 5 స్థానాలు దిగజారి 210వ స్థానంలో ఉంది. రాంకుమార్ రాంనాథ్ రెండు స్థానాలు దిగి 133 వద్ద, యూకీ భాంబ్రీ 151 వద్ద నిలిచారు. సాకేత్ 4 స్థానాలు దిగజారి 260 వద్ద, శశి కుమార్ 292 వద్ద నిలిచారు. డబుల్స్‌లో రోహన్ బోపన్న 3 స్థానాలు దిగి 37 వద్ద, దివిజ్‌శరణ్ 3 స్థానాలు దిగి 40వద్ద, జీవన్ 3 స్థానా లు దిగజారి 76 వద్ద, లియండర్‌పేస్ 19 స్థానాలు దిగజారి 78వద్ద, పూరవ్ 12 స్థానాలు దిగజారి 103 వద్ద నిలిచారు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

L ively
I nteraction
F or
E ver
ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com
లైఫ్
మంగళవారం 29 జనవరి 2019



ఒక బిందువు..చిన్నపాటి చుక్క. దాని ఆకారం మన కళ్లకు అలాగే కనబడుతుంది. కానీ ఒక బిందువునుండి మొదలుపెట్టి ...విశ్వవ్యాపితంగా గీతలు గీయవచ్చు. అలాగే ఒక బిందువునుండి వందల వేల ఆకారాలను సృష్టించవచ్చు. అలా చూస్తే బిందువులో అనంత విశ్వం ఉంది. దానికి పరిమితే లేదు. ఈ భావన ఆధారంగానే తమ పుస్తకానికి 'ది డాట్ ..దట్ వెంట్ ఫర్ ఎ వాక్'...అని పేరు పెట్టారు దాని రూపకర్తలు...శారద అక్కినేని, లక్ష్మి నంబియార్, రీమా గుప్తా. భిన్నవృత్తుల్లో తమ నైపుణ్యాలను చాటుతున్న ఈ వనితలు ముగ్గురు...నేటి చిన్నారులకు అత్యంత స్ఫూర్తినిచ్చే మహిళల జీవన కథలు చెప్పారు. జాతి నిర్మాణంలో తమవంతు కృషి చేసిన వివిధరంగాలకు చెందిన మహిళా మూర్తులను పరిచయం చేశారు. నేటితరం వనితలుగా, తల్లులుగా, పుస్తక రూపకర్తలుగా వారు ఎన్నో అంశాలపై తమ అభిప్రాయాలను ఆంధ్రప్రభ లైఫ్‌తో పంచుకున్నారు. ఆవిశేషాలు మీకోసం-



బిందువు... విజయ దుందుభి!

♦ స్త్రీని బిందువుతో పోలుస్తూ ఆమె శక్తిని ఆవిష్కరించిన పుస్తకం

♦ 51 మంది మహోన్నత మహిళల జీవిత కథనాల సమ్మేళనం 'ది డాట్ ..దట్ వెంట్ ఫర్ ఎ వాక్'

♦ నేటి తరానికి విభిన్న రోల్ మోడల్స్‌ని అందించిన ముగ్గురు మహిళల వినూత్న కృషి

ఆడవారు తాము అనుకున్నది సాధించాలంటే మగవారికంటే మరింత ఎక్కువ శ్రమపడాలి...ఎన్నో ఆటంకాలను ధైర్యంగా ఎదుర్కోవాలి...ఇవి అందరికీ తెలిసిన వాస్తవాలే. నిన్న మొన్నటి తరాలు ఈ విషయంలో మరింత ఎక్కువగా అడ్డంకులు విమర్శలు ఎదుర్కొన్నారు. అయినా వారు తమ ప్రయత్నాలను ఆపలేదు. మహిళలు ఈ పని చేయగలరా...అనే రంగంలోనూ ప్రవేశించి తొలి ముద్రలు వేసిన వారు మనదేశంలో కోకొల్లలు ఉన్నారు. వారి గురించి తెలుసుకున్నపుడు మనకు.. స్త్రీలు తాము సాగించిన జీవన ప్రయాణంలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా అనుకున్నది సాధించారని అర్థమవుతుంది. అప్పుడు వారి జీవితాలను మనం సమస్యల కోణంలో కాకుండా సాధించిన విజయాల కోణంలో చూడగలం. అలాంటి ఎంతోమంది స్త్రీలను గురించి నేటి పిల్లలకు తెలియదు. నిజం చెప్పాలంటే పెద్దలకూ తెలియదు. వారిలో 51మందిని ఎంపిక చేసి 'ది డాట్..దట్ వెంట్ ఫర్ ఎ వాక్' ని రూపొందించారు...ఈ ముగ్గురు మహిళలు. వీరిలో శారదా అక్కినేని బ్లేజ్ ఆటోమేషన్ కంపెనీ డైరక్టర్ కాగా, లక్ష్మి నంబియార్ సృష్టి ఆర్ట్ గ్యాలరీని నిర్వహిస్తున్నారు. రీమా గుప్తా ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ సంస్థకి కార్పొరేట్ రిలేషన్స్ అండ్ సెంటర్ ఫర్ లెర్నింగ్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రాక్టీస్ విభాగపు హెచ్‌ఓడిగా పనిచేస్తున్నారు.

'ది డాట్..దట్ వెంట్ ఫర్ ఎ వాక్' పుస్తకం ఈ నెల 16న ముంబయిలో బాలివుడ్ నటి దీపికాపదుకొనే మరికొందరు ప్రముఖ మహిళల చేతులమీదుగా ఆవిష్కృతమైంది. తదనంతరం హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో ఈనెల 27న ఆవిష్కరించారు. ఈ పుస్తక రూపకల్పనలో తామే కాకుండా తమ చిన్నారులను సైతం పాల్గొనెలా చేశారు. రీమా గుప్తా కుమార్తె, ఏడవ తరగతి చదువుతున్న సహానా నాలుగు కథనాలు రాయగా, రెండవ తరగతి చదువుతున్న లక్ష్మి నంబియార్ కుమార్తె తమారా... పుస్తకంలోని ఆర్ట్ సెక్షన్‌లో కొన్ని లైన్లు రాసింది. అంతే కాదు...పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో కూడా చిన్నారులు ఇద్దరూ అందులోని రచనలను గురించి వెల్లడించారు. శారదా అక్కినేని 11 కథనాలు రాశారు. మొత్తం మీద 10మంది రచయితలు పుస్తకాన్ని రూపొందించడంలో పాలుపంచుకోగా ఇందులో నలుగురు చిన్నారులు ఉండటం విశేషం.

వారంతా కర్మయోగులు శారద అక్కినేని



జాతి నిర్మాణంలో తమవంతు పాత్రని పోషించిన మహిళలు ఎంతోమంది ఉన్నారు మనకు. అలాంటివారి వివరాలను శోధించి...నాటి రాణీ ఝాన్సీ లక్ష్మీ బాయి నుండి మనదేశపు మొదటి మహిళా ఫైటర్ పైలట్ అవనీ చతుర్వేది వరకు 51మందిని ఎంపిక చేసుకున్నాం. ఈ క్రమంలో ఎంతోమంది అద్భుత విజయాలు సాధించిన మహిళా మణుల కథనాలతో పుస్తకం తయారైంది. నాటి పోరాటయోధురాలితో మొదలుపెట్టి నేటి పోరాట యోధురాలితో ముగించాము. ఈ మహిళల జీవితాలు చెబుతున్నపుడు వారి చరిత్రలో భాగంగా దేశంలో సంభవించిన చారిత్రక మార్పులు ప్రగతి లాంటివి కూడా వెల్లడయ్యాయి. ప్రవేశమే కష్టమైన భిన్నరంగాల్లో తమ ప్రావీణ్యాన్ని చూపిన మహిళల కథలు అద్భుతంగానూ, అసాధారణంగానూ అనిపించాయి. మేమే ఎంతో ఉత్తేజభరితులం అయిపోయాం. అతి ప్రాచీన మార్షల్ ఆర్ట్ కలరీ పయిట్ ప్రావీణ్యురాలు మీనాక్షీగురుకాల్, 100ఏళ్ల యోగా గ్రానీ ననమ్మాల్ కథలు ఇందులో ఉన్నాయి. రంగాలను బట్టి, వృత్తులను బట్టి వివరాలను సేకరిస్తూ పోయాం. న్యాయవాద వృత్తిలో వైద్య వృత్తిలో నిపుణులు, మొదటి వెంచర్ కాపిలిస్ట్, ఆంకాలజిస్ట్... ఇలా భిన్న రంగాల్లో తమ ముద్రని వేసిన మహిళల వివరాలు ఇచ్చాము. కళా క్షేత్రాన్ని స్థాపించిన రుక్మిణీ అరండేల్, పంచదార ఉత్పత్తిలో పరిశోధనలు చేసిన బొటానిస్ట్ జానకి అమ్మాల్...ఇలా నమ్మలేని విజయాలు సాధించిన మహిళలను గురించి తెలుసుకుంటుంటే మాకే అదొక ట్రెజర్ హంట్‌లా అనిపించింది. పుస్తకంలో ఇచ్చినవారిలో దాదాపు 15మంది లేరు. ఉన్నవారితో వీలయినంత వరకు మాట్లాడాం. కొందరిని కలిశాం. వారి మాటల్లో ఎంతో నిరాడంబరత. వారంతా తాము గొప్పవాళ్లమని ఏమాత్రం ఫీలవటం లేదు. వారు పనిని ఎంజాయ్ చేశారు. కర్మయోగుల్లా పనిచేశారు. మేము కూడా పుస్తకంలో వారికి వచ్చిన అవార్డులు, బహుమతులను గురించి ప్రస్తావించలేదు. వారి పనిని మాత్రమే చెప్పాము.

మన పిల్లలకు మన రోల్ మోడల్స్ కావాలి: రీమా గుప్తా...



ఈ పుస్తక రచనలో మా కుమార్తెలే మాకు ఇన్‌స్పిరేషన్‌గా నిలిచారు. స్కూల్లో ఫాన్సీ డ్రస్ కాంపిటేషన్ కోసం మా పాప సహానా... ఝాన్సీ లక్ష్మీ పాత్రని తీసుకుంది. అయితే ఇందిరా గాంధీ, ఝాన్సీ లక్ష్మీ బాయి ఇలా కొంతమంది తప్ప ఇంకెవరూ మనకు లేరా...అని మాకు మేము ప్రశ్నించుకున్నపుడు మాకు ఒక విషయం అర్థమైంది. ఆడపిల్లలకు బాలివుడ్ తారలు, క్రీడాకారిణులు రోల్‌మోడల్స్ కాగా మగపిల్లలకు స్ఫూర్తినివ్వగల మహిళా మణుల వివరాలు మనకు ఏమాత్రం అందుబాటులో లేవు. ఆ విషయంలో చాలా గ్యాప్ ఉంది. ఇలా భట్, కమలాదేవి ఛటోపాధ్యాయ లాంటివారి గురించి పిల్లలకు ఏమాత్రం తెలియదు. సహానా ఈ విషయంలో సర్వే చేసినప్పుడు ఈ విషయాలు మాకు అర్థమయ్యాయి. పిల్లలకు రోల్ మోడల్ అవసరం ఉంది. వారు ఆ వ్యక్తి గొప్పతనంతో ఎంతో ప్రభావితం అవుతారు. అలాగే మన పిల్లలకు మన దేశంలోనే రోల్‌మోడల్స్ ఉండాలి. బరాక్ ఒబామాని మన పిల్లలు రోల్ మోడల్‌గా అనుకోలేరు కదా. అలాగే వారికి భిన్నమైన రోల్ మోడల్స్ కావాలి. ఈ విషయంలో వారి ఆలోచనలు ఊహలను మనం పరిమితం చేయకూడదు. రవీంద్రనాథ్ ఠాగూర్ అదే అంటారు. తల్లిదండ్రులు తమ ఆలోచనలతో పిల్లల ఆలోచనలను పరిమితం చేయకూడదు. ఎందుకంటే వారు వేరే కాలంలో జన్మించారు అంటారాయన. అందుకే పిల్లల ఊహాశక్తికి, వారు సాధించగల విజయాలకు ఎల్లలు ఉండకూడదనే...డాట్..అన్నాం. ఒక చుక్క.....ఉంది అంటే అది మాస్టర్ పీస్ కావడానికి సిద్ధంగా ఉందని అర్థం. ఈ పుస్తకం ద్వారా పిల్లలకు అంతటి స్ఫూర్తి అందాలని భావించాము. ఇందులోని విషయాలు ప్రతి చిన్నారికీ తెలియాలి. దీనిని తెలుగు కన్నడ హిందీ భాషల్లో కూడా తెస్తున్నాము. ఇంకాస్త తక్కువ ధరకు ఈ పుస్తకం పిల్లలకు చేరే ప్రయత్నం చేస్తాము. ఈ బుక్ చదివితే...ప్రముఖులు కూడా కష్టాలు పడ్డారు...వారు కూడా బాధలు అనుభవించారు అయినా...జీవితంలో గెలిచారు అనేది అర్థం కావాలి.

పిల్లలకు కళలను పరిచయం చేస్తే... మానసిక స్వేచ్ఛని ఫీలవుతారు: లక్ష్మి నంబియార్



సృష్టి ఆర్ట్ గ్యాలరీని పదిహేడు సంవత్సరాల క్రితం ప్రారంభించి నిర్వహిస్తున్నాను. పుస్తకంలో ఇచ్చిన కథనాల తాలూకూ 51మంది మహిళల చిత్రాలను 51 మంది చిత్రకారిణుల చేత వేయించడం జరిగింది. దేశవ్యాప్తంగా జల్లెడ పట్టి చిత్రకారిణులను ఎంపిక చేశాము. మరొక ఆసక్తికరమైన అంశం ఏమిటంటే...ఈ చిత్రాలన్నీ భిన్న విధానాల్లో చిత్రించడం జరిగింది. రంగుల్లో వేసినవే కాకుండా...ఎంబ్రాయిడరీతో, పేపర్‌రోల్స్ సహాయంతో, ఫ్యాబ్రిక్‌తో ....ఇలా రకరకాల పద్ధతుల్లో వీటి రూపకల్పన జరిగింది. అంతేకాదు...పిల్లలు పుస్తకాన్ని చదవటంతో పాటు అందులోని వివరాల ఆధారంగా భిన్నమైన యాక్టివిటీస్ చేసేలా ప్రశ్నలను ఇచ్చాము. పుస్తకంలో ఈ యాక్టివిటీ సెక్షన్ ప్రత్యేకంగా ఉంటుంది. పుస్తకం మరీ సీరియస్ గా అనిపించకుండా పిల్లల్లో ఆసక్తిని పెంచేందుకు ఈ ప్రయత్నం చేశాము. తల్లిదండ్రులు కూడా పిల్లలతో కలిసి దీనిని చదివేలా రూపొందించాము. పిల్లలకు మనం చెప్పే కథలన్నీ కల్పితాలు. రాకుమారిని మాంత్రికుడు ఎత్తుకుపోవటం, రాకుమారుడు వచ్చి రక్షించడం లాంటి కథలనే పిల్లలకు చెబుతుంటాం. కానీ పిల్లలకు ఇలాంటి వాస్తవ జీవిత కథలను చెప్పాలి. వీటిలో జీవితం ఉంది. స్ఫూర్తి ఉంది. ఆడపిల్లలు తలచుకుంటే అనుకున్నది సాధించగలరనే సందేశం ఉంది. పుస్తకంలో చిత్రాలు చాలా ముఖ్యం. వీరంతా చాలా ప్రముఖ చిత్రకారులు, మంచి పేరున్నవారు.51మంది బొమ్మలను పుస్తకంలో స్టిక్కర్లుగా ఇచ్చాము. తల్లిదండ్రులు పిల్లలతో కలిసి ఇందులోని యాక్టివిటీస్‌ని చేసేలా ఫన్ వచ్చేలా పుస్తకాన్ని రూపొందించాము. పిల్లలకు వాస్తవ జీవిత కథల అవసరం ఉంది. వారు వాటిని చదవాలి... ప్రభావితం అవ్వాలి. ఫీల్ కావాలి. అలాగే పిల్లలకు ఆర్ట్ చాలా అవసరం. గీయటం, కలరింగ్‌తో వారిలోని ఒత్తిడి నెగెటివ్ ఎమోషన్లు తగ్గుతాయి. ఆర్ట్‌తో స్వేచ్ఛ భావన, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత ఇవన్నీ పెరుగుతాయి.

ఊహా శక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి: సహానా, ఏడవ తరగతి



పుస్తకంలో నేను నలుగురి కథనాలు రాశాను. మేరీకామ్, మిథాలీరాజ్, రీతూ కుమార్, సరోజినీ నాయుడు...వీరి గురించిన వివరాలను, సాధించిన విజయాలను వెల్లడించాను. ఇంటర్‌నెట్ ద్వారా పుస్తకాల ద్వారా వారి గురించి తెలుసుకున్నాను. అమ్మ ప్రారంభించిన ఈ వర్క్‌లో నేనూ పాలుపంచుకోవటం చాలా ఆనందంగా ఉంది. ఈ పుస్తకం వలన నాకు చాలామంది గురించి తెలిసింది. ఇంతకుముందు పేర్లు కూడా తెలియని గొప్ప మహిళలను గురించి తెలుసుకున్నాను. నాకు పుస్తకాలు చదివే అలవాటు ఉంది. హిస్టారికల్ ఫిక్షన్ రచనలంటే చాలా ఇష్టం. నా తోటి విద్యార్థులకు పుస్తకం గురించి చెప్పాను. వారికి కూడా ఇందులోని విషయాలు చాలా నచ్చాయి. వాళ్లు అమెజాన్‌లో ఆర్డర్ చేస్తున్నారు. నాకు బాడ్‌మింటన్, అథ్లెటిక్స్ ఇష్టం. ఈ పుస్తకంతో ఊహా శక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. పట్టుదల ఉంటే ఆటంకాలు ఉన్నా వాటిని అధిగమించే అవకాశం ఉందని ఈ పుస్తకం ద్వారా తెలుస్తుంది.

- వడ్లమూడి దుర్గాంబ

చెదరని అందం కోసం చిట్కాలు!



నాకు జుట్టు చివరలు చిట్లిపోతున్నాయి. పార్లర్‌లో జుట్టు చిట్లినమేరకు కట్ చేస్తామంటున్నారు. నాకు నా జుట్టు కత్తిరించుకోవడం ఇష్టం లేదు. వేరే ఏదన్నా మార్గం ఉందా?

మీ జుట్టును చన్నీళ్లతో తడపండి. వేడినీళ్లతో అయితే జుట్టు మరింత పొడిబారి చిట్లే అవకాశం ఉంది. తరచుగా కండిషనర్ వాడుతుంటే వెంట్రుకలు తేమగా ఉంటాయి. ఇంటినుంచి బయటకు వెళ్లినప్పుడల్లా జుట్టుకి సన్ ప్రొటెక్షన్ వాడాలి. ఎప్పుడూ పెద్ద పళ్లతో ఉన్న దువ్వెన మాత్రమే వాడాలి. దాంతో జుట్టు చిక్కులుపడి పాడవకుండా ఉంటుంది. ఎక్కువ గాఢత లేని షాంపూలు వాడాలి. జుట్టును తిన్నగా చేయడానికి స్ట్రెయిటెనర్స్ వాడతారు. ఆ పరికరం నుంచి వేడితనం జుట్టుకు తగులుతుంది. అలానే హెయిర్ డ్రయ్యర్లు కూడా వేడిగాలిని వదులుతాయి. వాటి వలన జుట్టుకు రక్షణగా హీట్ ప్రొటెక్షన్ సీరమ్ వాడాలి. నిద్ర పోయేటప్పుడు శాటిన్ దిండు కవర్ వాడాలి.

నేను మస్కారా వేసుకున్నప్పుడల్లా నా కనురెప్పలు ఒకదానికొకటి అతుక్కున్నట్లు అవుతుంటాయి. మంచి బ్రాండ్లనే ప్రయత్నించి చూశాను. ఎందుకు అలా జరుగుతుంది? కళ్ల నుంచి మస్కారా తొలగించడానికి మంచి ఉపాయం ఏంటి?

కనురెప్పలు అతుక్కుంటున్నాయంటే కారణం మీరు మస్కారా ఎక్కువగా పులుముతున్నారని అర్థం. వ్యాండ్ నుంచి ఎక్కువగా ఉన్న మస్కారాను టిష్యూ పేపర్‌తో తుడిచి వాడటం మంచిది. మస్కారా పెట్టుకునేముందు కనురెప్పలకు వంపును తెచ్చే ల్యాష్ కర్లర్ వాడాలి. కనురెప్పలు వేటికవే ఉండేలా ఒక దూది ఉండతో సున్నితంగా సరిచేయాలి. తర్వాత మస్కారా పెట్టుకోవాలి. మస్కారా ట్యూబ్‌లోకి గాలి ఊదకూడదు. ట్యూబ్‌కు రెండువైపులా నొక్కితే లోపల ఉన్న మస్కారా బయటకు వస్తుంది. బేబీ ఆయిల్‌తో కాని ఐ మేకప్ రిమూవర్‌తో కాని మస్కారాను తొలగించడం ఉత్తమం.

నాకు మేకప్ వేసుకోవడం ఇష్టం. కాని ఎక్కువ మేకప్ వేసుకుంటే చెమటకి అంతా పోతుందని భయం. కొన్ని మేకప్ టిప్స్ చెప్పండి?

వర్షాలు పడ్డప్పుడు గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. అటువంటప్పుడు ఆయిలీ మేకప్‌లు, లేక జిడ్డుతో ఉన్న చర్మ సంరక్షణ ఉత్పత్తులు వాడకూడదు. ఫౌండేషన్, లిప్‌స్టిక్ లలో మాట్, క్రీమీ మాట్ మాత్రమే వాడాలి. మీ చర్మాన్ని క్రీమ్‌లకు బదులు జిడ్డురహిత లోషన్లను వాడండి. ఎమ్ఎసి స్టూడియో ఫిక్స్ లాటి పౌడర్ కాంపాక్ట్ ప్యాంఈ వాడాలి. దాంతో అధికంగా ఉన్న నూనె తొలగిపోతుంది. ఈ సీజన్‌లో ఏదయినా కొద్దిగా ఉపయోగిస్తే చాలు. వాటర్ ప్రూఫ్ మస్కారా, రంగు ఐపెన్సిల్స్‌ను లేదా ఐలైనర్లను వాడాలి.

చిల్లీ గార్లిక్ పొటాటో



250 గ్రాముల ఆలూ
1 స్పూన్ కార్న్‌ఫ్లోర్
1 కట్ట సన్నగా తరిగిన ఉల్లికాడలు
1 స్పూన్ టొమాటో కెచప్
1 స్పూన్ వెనిగర్
1 చిటికెడు ఉప్పు
1 స్పూన్ వెన్న
1 స్పూన్ సన్నగా తరిగిన వెల్లుల్లి ముక్కలు
2 సన్నగా తరిగిన పచ్చిమిర్చి
2 స్పూన్ల సోయా సాస్
పావు స్పూన్ ఎడిబుల్ ఫుడ్ కలర్
ఒక చిటికెడు మిరియాల పొడి


భలే రుచి

ఆలూని కడిగి చెక్కుతీసుకుని వేలి ఆకారంలో పొడవుగా తరగాలి. మైక్రోవేవ్‌లో 100 శాతం పవర్‌లో 8 నిమిషాలు ఉంచాలి. తర్వాత వాటిని బయటకు తీసి చల్లారేదాకా ఉంచాలి. ఇంకొక మైక్రోవేవ్ సేఫ్‌బౌల్‌లో బటర్ లేదా నూనెను 100 శాతం పవర్‌లో 30 సెకండ్లు ఉంచాలి. దానికి తరిగిన వెల్లుల్లి, ఉల్లికాడలు, పచ్చిమిర్చి కలపాలి. మైక్రోవేవ్‌లో 100 శాతం పవర్‌లో 2 నిమిషాలు ఉంచాలి. తర్వాత ఆ మిశ్రమానికి ఆవిరిలో పెట్టిన ఆలూ పెట్టి బాగా కలపాలి. దానికి ఒక పావుకప్పు నీటిలో కలిపిన కార్న్‌ఫ్లోర్, సోయా సాస్, టొమాటో సాస్, వెనిగర్, ఎడిబుల్ ఫుడ్ కలర్, ఉప్పు, మిరియాల పొడి వేసి కలపాలి. ఆ మిశ్రమాన్ని 3-4 నిమిషాలు 100 శాతం పవర్ లో మైక్రోవేవ్‌లో ఉంచాలి. మధ్యలో ఒకటిరెండుసార్లు కదుపుతుండటం మర్చిపోవద్దు. బయటకు తీశాక వేడిగా వడ్డించడమే.

చింతన

పాపఫలానుభవం

దేహాంతస్థ ఆత్మ, పరమాత్మలనెరిగినవాడు యథార్థ దర్శి



అధ్యాయం-13
శ్లోకం -28

సమం సర్వేషు భూతేషు
తిష్ఠంతం పరమేశ్వరమ్।
వినశ్యత్స్వవినశ్యంతం
యః పశ్యతి స పశ్యతి ॥

తాత్పర్యం

సర్వదేహములందు ఆత్మనుకూడియుండు పరమాత్మను గాంచువాడు, నాశవంతమైన దేహము నందలి ఆత్మ, పరమాత్మ లిరువురిని ఎన్నడును నశింపని వారుగా తెలిసికొనగలిగినవాడు యథార్థ దృష్టిని కలిగినవాడు.

భాష్యం

సత్సాంగత్యముతో మూడు విషయాలను స్పష్టముగా అర్థం చేసుకొన వచ్చును. ఈ శరీరము, దాని ఈశ్వరుడైన ఆత్మ, అతని స్నేహితుడు, పరమేశ్వరుడూ అయిన పరమాత్మ తత్త్వాన్ని తత్త్వ దర్శి సాంగత్యము లేనిదే అర్థం చేసుకొనలేరు. వారు ఈ శరీరమే సర్వస్వమని, మరణముతో అంతా నశిస్తుందని భావిస్తారు. అయితే వాస్తవానికి అది నిజము కాదు. ఆత్మ పరమాత్మలు శాశ్వతమైనవి శరీరము నశించిన తరువాత కూడా వారు కొనసాగుచునే ఉంటారు. ఈ అవగాహన కలవారే సత్యాన్ని చూడగలుగుతారు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

ఇప్పుడు మనకు జరిగే మంచి చెడులన్నీ పూర్వ జన్మ కర్మలననుసరించి వచ్చినవి కావచ్చు. సుఖాలు, లాభాల విషయానికొస్తే అది సుకృతం వల్ల కావచ్చు లేదా ఈ జన్మలో భగవంతుని ప్రార్థిస్తే ఆయన కనికరించి ఇచ్చినదే. అందుచేత మనకున్న దాంట్లో కొంత భాగమైనా దాన ధర్మాలకూ, సత్కార్యాలకూ తప్పనిసరిగా వినియోగించాలి.



మానవ జన్మనెత్తిన ప్రతి ప్రాణీ అరిషడ్వర్గాలైన కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలకు లోనవుతూనే ఉంటాడు. మహర్షులు కూడా ఏదో ఒక క్షణంలో వీటికి లొంగిపోయి వ్యవహరించిన సందర్భాలు ఉన్నాయి. వీటికి దాసోహం అన్న వారికి పాపం అంటుతుంది, కష్టాలు దాపురిస్తాయి. పాపం అంటిన వారు ఎప్పుడో ఒకప్పుడు ఆ పాప ఫలాన్ని అనుభవించవలసి ఉంటుంది. ఈ పాపం మూడు స్థాయిల్లో ఉంటుందన్నారు. స్థూల దేహాన్ని రోగాలుగా, సూక్ష్మ దేహాన్ని అరిషడ్వర్గాల రూపంలో, కారణ దేహాన్ని విచక్షణా జ్ఞాన శూన్యతగా బాధిస్తాయి. ఇక పాపాలను మూడు విధాలుగా విభజించారు. అనేక జన్మల నుంచి చేసిన పాపాలను అంటే అసత్యము, ఇంద్రియ లాలసత్వము, కామ క్రోధాదులు వంటి వాటిని ప్రారబ్ధ రూపంలో అనుభవించాలి. తండ్రి తాతల వలన ఈ దేహం ఏర్పడినట్లే వంశానుగతంగా కొంత పాపం వస్తుంది. దేవతల గురించి పరిజ్ఞానం లేకపోవడం వల్ల మరి కొంత బాధపడాల్సి వస్తుంది. ప్రతి వ్యక్తి ఈ మూడు రకాలైన పాపాలతో బాధపడుతూ ఉంటాడు. క్రోధమనేది సర్వనాశనానికి కారణం అవుతుందని తెలిసీ, దానిని అదుపులో ఉంచుకోలేక బాధలకు గురవుతూ ఉన్నారు. కోపం వలన జ్ఞానం నశిస్తుంది. అజ్ఞానం వల్ల ఆలోచనా శక్తి నశిస్తుంది. ఇది వినాశనానికి హేతువు. క్రోధం అంటే దుష్టత్వం. కోపం కలవాడు యాగాలు చేసినా, హోమాలు చేసినా, పూజలు చేసినా వాటి ప్రయోజనం శూన్యం అని చెబుతారు. కోపం కలవాడు ఎన్ని సత్కార్యాలు చేసినా వాటి ఫలం పొందలేడు. లోభ గుణం కూడా ప్రమాదకరమే. లోభ గుణం ఉన్న వారికి తమకు ఉన్నదీ, లేనిదీ కూడా అనుభవించాలనే కోరిక ఉంటుంది. ఈ గుణం ఉన్న వారు కొందరు ఆ సంపదను తాము కూడా అనుభవించకుండా, దాచిపెట్టి బికారులుగా తిరుగుతూ ఉంటారు. వీరిని పరమ లోభులనవచ్చు.

లోభ గుణం ఉన్నవారికి ధనార్జన విషయంలో ఉచ్చనీచాలు ఉండవు. డబ్బు కోసం ఏ పనైనా చేస్తారు. పాప పుణ్యాల మాటకాదు కదా కనీసం మానవత్వం కూడా ఉండదు. ఇలాంటివారు ఎక్కువ తప్పులు చేస్తుంటారు. అదే పాపం. పాపమనేది నరకానికి మార్గం. అందువల్ల లోభ గుణం నరకానికి మార్గమని చెప్పబడింది. కామానికి, లోభానికి రావణాసురుణ్ణి కొందరు ఉదాహరణగా చెబుతారు. తనకు ఎంత ఉన్నా ఇంకా కావాలనుకోవడం లోభమే. ఉన్నది చాలు అనుకోవటం తృప్తి. ఇంకా కావాలనునకోవటం ఆశ. మొత్తం తనకే కావాలనుకోవటం దురాశ. అంతా తానే అనుభవించాలనుకోవటం లోభం. తనకున్న దానిని పదిమందికీ పంచటం ఔదార్యం. తనకున్న దానిని అవసరం లేదని ఇతరులకు ఇచ్చివేయటం త్యాగం. లోభ గుణానికి పూర్తిగ వ్యతిరేకమైనది త్యాగ గుణం. ఇప్పుడు మనకు జరిగే మంచి చెడులన్నీ పూర్వ జన్మ కర్మలననుసరించి వచ్చినవి కావచ్చు. సుఖాలు, లాభాల విషయానికొస్తే అది సుకృతం వల్ల కావచ్చు లేదా ఈ జన్మలో భగవంతుని ప్రార్థిస్తే ఆయన కనికరించి ఇచ్చినదే. అందుచేత మనకున్న దాంట్లో కొంత భాగమైనా దాన ధర్మాలకూ, సత్కార్యాలకూ తప్పనిసరిగా వినియోగించాలి. సద్గతుల కోసం కాకపోయినా, మరు జన్మలో అనుభవించటం కోసమైనా దానధర్మాలు చేసి తీరాలి. ఒకరికి మనం సాయం చేస్తేనే మరొకరు మనకు సాయం చేస్తారు. లోభం అనేది ఇంద్రియాలకు సంబంధించినది.ఆత్మకు సంబంధించింది కాదు. స్వార్జితమైన ద్రవ్యం, ప్రతిఫలాపేక్ష లేకుండా, అర్హత కలిగిన వారికి ఇవ్వటాన్నే దానం అంటారు. దీని వలనే ఉత్తమ గతులు వస్తాయి.



- డాక్టర్ పులివర్తి కృష్ణమూర్తి

సంక్షిప్త రామాయణం

ఉపదేశం-తిరస్కారం




వసిష్ఠుడు రాముని కోపాన్ని చూసి, 'రామా! ఇహపర లోక ప్రయాణాల గురించి జాబాలికి తెలుసు. అతడు నాస్తికుడు కాదు. నిన్ను అయోధ్యకు కొనిపోవడానికే అలా మాట్లాడాడు. ఇక్ష్వాకు వంశ ధర్మం జ్యేష్ఠుడు రాజు కావడమే! నీవు దశరథుని జ్యేష్ఠ పుత్రుడవు. వంశధర్మాన్ని అనుసరించి రాజ్యాన్ని స్వీకరింపుము. రామా! ప్రతి వ్యక్తికి జన్మనిచ్చిన తల్లిదండ్రులు మొదటి గురువులు. మూడవ గురువు విద్య నేర్పినవాడు. తల్లిదండ్రుల కంటె జ్ఞాన బోధ చేసిన గురువే శ్రేష్ఠుడని నీకు తెలుసు కదా! నీకే కాదు నీ తండ్రికి కూడ గురువును నేనే! అందువలన నా మాట వినుము. సమస్త ప్రజలు ఏకగ్రీవంగా నిన్నే కోరుతున్నారు. వృద్ధురాలైన నీ కన్న తల్లి మాటను పాటించి, భరతుని కోరిక మన్నించి, రాజ్యాన్ని స్వీకరింపు' మన్నాడు.

రాముడు వసిష్ఠుని మాటలు విని, 'మహాత్మా! తల్లిదండ్రులు జన్మను ఇవ్వడమే కాక పెంచి పెద్ద చేస్తారు. విద్యాబుద్ధులు చెప్పించి బిడ్డను ప్రాణానికి ప్రాణంగా భావిస్తారు. తల్లిదండ్రుల ఋణం తీర్చుకోవడం ఎవరి వల్ల కాదు. నాకు తండ్రి ఇచ్చిన ఆజ్ఞ అను ల్లంఘనీయం' అన్నాడు. ఈ మాటలు విని భరతుడు నిరాశా నిస్పృహలకు గురయ్యాడు.

భరతుడు గత్యంతరం లేక నిరాహారదీక్ష చేయబూని, దర్భాసనం తెప్పించుకుని దానిపై పండుకున్నాడు. రాముడు అయోధ్యకు రావడానికి సమ్మతించే వరకూ ఈ దీక్షను విరమించను అన్నాడు. దానికి రాముడు, 'భరతా! బ్రాహ్మణుడు తనకు అన్యాయం జరిగినప్పుడు ఈ విధంగా చేయవచ్చు, కాని క్షత్రియునికి ఇది తగదు. నీ దీక్షను చాలించి అయోధ్యకు వెళ్లు'మన్నాడు. భరతుడు పౌరులను చూసి, 'మీరు మౌనంగా ఉన్నారేమి? మీరైనా రామునికి నచ్చజెప్పండి' అన్నాడు. పౌరులు రాముని స్థిరబుద్ధిని గ్రహించిన వారు అవడం వల్ల, 'ఇప్పుడు రాముని అయోధ్యకు రప్పించలేము' అన్నారు.

భరతుడు పౌరులను ఉద్దేశించి 'అన్నను వనవాసానికి పంపడంలో నా పాత్ర ఏమీ లేదు. రామునికి బదులుగా పద్నాలుగేండ్లు వనవాసం చేస్తాను' అన్నాడు. రాముడు పౌరులను ఉద్దేశించి, 'మాత తండ్రి బ్రతికి ఉండగా చేసిన నిర్ణయాన్ని నేను గాని, భరతుడు గాని మార్చడానికి వీలు లేదు. అసమర్థుడైనవాడు మాత్రమే తాను చేయాల్సిన పనిని ఇతరులకు అప్పచెబుతాడు. నాకు బదులు వనవాసం చేయడానికి నా ప్రతినిధిని నియమించడానికి నేను అసమర్థుడను కాదు కదా! నా తుది నిర్ణయం చెబుతున్నాను వినండి. తండ్రి ఆజ్ఞ ప్రకారం పద్నాలుగేండ్లు అరణ్యవాసం చేసిన తరువాత భరతునితో కూడి రాజ్యాన్ని పాలిస్తాను' అని ప్రకటించాడు.



పాదుకా పట్టాభిషేకం

చిత్రకూట పర్వతమునందున్న మునీశ్వరులందరూ అన్నదమ్ముల అన్యోన్యాను రాగాన్ని చూసి ఆనందించారు. వారు తమ మనస్సులలో రావణ వధ శీఘ్రంగా జరగాలి అనే ఉద్దేశంతో 'మీ తండ్రి ఆత్మశాంతించాలని నీవు కోరుతూ ఉంటే, రాముని మాటలను సమ్మతింపు'మని భరతునికి చెప్పారు. 'దశరథుడు కైకేయి అడిగిన వరాలను ఇచ్చి ఋణం తీర్చుకున్నాడు. రాముడు పితౄణం తీర్చుకోవలసిఉన్నది కదా' అన్నారు. వారి మాటలను విని రాముడు ఆనందించాడు. భరతుడు వేదనతో నీరుకారిపోయాడు. అయినా మరల మరల అనేక విధాలుగా ప్రయత్నించి విఫలుడు అయ్యాడు.

భరతుడు బంగారు పాదుకలను నేలపై ఉంచి, 'అన్నా! ఒక్కసారి పాదుకలను తొడుగుకుని విడువుము' అన్నాడు. రాముడు అట్లే చేశాడు. 'అన్నా! నేను అయోధ్య నగరం వెలుపల నీకై నిరీక్షిస్తూ ఉంటాను. ఆ పాదుకలకు పట్టాభిషేకం జరిపిస్తాను. జడలను, నార చీరలను ధరించి, కందమూల ఫలాలనే తింటూ, ఈ పద్నాలుగేండ్లు జీవిస్తాను. అన్ని విషయాలను నీ పాదుకలకే నివేదిస్తూ రాజ్యపాలన చేస్తాను. పద్నా లుగేండ్లు దాటిన మరుసటి రోజు నీవు రాకపోతే నేను అగ్ని ప్రవేశం చేస్తాను' అని భీకరమైన ప్రతిజ్ఞ చేశాడు. శ్రీరాముడు తొడిగి, విడిచిన బంగారు పాదుకలను శత్రుం జయం అనే పట్టపేనుగు అంబా రీపై ఉంచి, అన్నకు నమస్కరించి వెనుతిరిగాడు. ముగ్గురు తల్లులూ నోట మాట రాక కొయ్యబారి పోయారు.

తరువాత భరతుడు శత్రుం జయం అంబారీపై ఉంచిన పాదుకలను శిరస్సున ధరించి రథాన్ని అధిరోహించాడు. భరద్వా జుని ఆశ్రమం చేరి, ఆ మహర్షి అనుమతిని పొంది అయోధ్య చేరాడు. కళావిహీనమైన అయోధ్యను చూసి భరతుడు కన్నీరు పెట్టుకున్నాడు. తల్లులను అంతఃపు రానికి చేర్చాడు. వసిష్ఠాది పురోహి తులు, మంత్రులు, పుర ప్రముఖులను రప్పించాడు. 'నేను అయోధ్యలో మన శ్శాంతితో ఉండలేను. నంది గ్రామంలో శ్రీరాముని పాదుకలను స్వర్ణ సింహాసనంపై ఉంచి, వాటి తరపున నేను పాలన కార్య క్రమాన్ని నిర్వహిస్తాను' అన్నాడు. భరతుని ధర్మ నిరతిని వారు అభినందించారు.

భరతుడు సుమంత్రుని పిలిచి, రథం సిద్ధం చేయమన్నాడు. శ్రీరాముని పాదుకలను తలపై ఉంచుకుని నంది గ్రామం చేరాడు. పాదుకలకు పట్టాభిషేకం జరిపాడు. జటాధారియై, నార చీరలు ధరించి, కందమూల ఫలాలను తింటూ, సకల విషయాలు శ్రీరాముని పాదుకలకు నివేదిస్తూ రాజ్యపాలన చేశాడు.

- కె.ఓబులేశు
9052847742

దేవతావృక్షాలను పెరట్లో ఎందుకు పెంచరాదు?

- లక్ష్మి, నిజామాబాద్


రావి, మర్రి, జువ్వి, మోదుగ, వేప ఈ ఐదు దేవతా వృక్షాలు. రావి చెట్టుకు మూడు మార్లు ప్రదక్షిణ చేస్తే త్రిమూర్తులకు ప్రదక్షిణ



చేసినట్లుగా భావన. 'అశ్వత్థః సర్వ వృక్షాణాం' అని భగవద్గీత వాక్యం. రావి విష్ణు స్వరూపమని, మర్రి శివ స్వరూపమని, జువ్వి బ్రహ్మ స్వరూపమని, వేప లక్ష్మీ స్వరూపమని పురాణాలు

కుశల సందేశాలు

చెబుతున్నాయి. 'అశ్వత్థః నారాయణః న్యగ్రోదః మహేశ్వరః అనే వాడుక కలదు. దేవతా వృక్షాలను రోజు ఆరాధించలేము. కావున ఇంట్లో ఉంచు కోరాదు. అలాగే మహా వృక్షాలు కావున వేర్లు క్రిందకు పారి పునాదులకు, గోడలకు భంగం ఏర్పడుతుంది కావున లౌకికంగా కూడా ఉంచుకోరాదు.



- డా॥ కందాడై రామానుజాచార్య

దిన ఫలాలు

మేష రాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. మంచి కార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయమార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యా విషయాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ పనికిరాదు. ఆర్థిక విషయాల్లో విస్మయాలు ఉంటాయి. ఆదాయవృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: సాహస నిర్ణయాలు ఊరట కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాలలో ఉపశమనం ఉంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ప్రారంభమవుతుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు కలసి వస్తాయి.

కర్కాటక రాశి: శ్రమ అధికమవుతుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఉంటుంది. అనవసర ఆందోళనలు పెరుగుతాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

సింహ రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల ప్రతిబంధకాలు ప్రబలమవుతాయి. ఆరోగ్యం అనుకూలత పెరుగుతుంది. వ్యాపార మోసాలను గ్రహించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించ గలుగుతారు.

కన్యా రాశి: తెలివైన నిర్ణయాలు తద్వారా విజయాలు చేకూరుతాయి. ఆహ్లాద పరిస్థితులు గృహరీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి.

తులా రాశి: విదేశీ లావాదేవీలు/ సంభాషణలు కలసి వస్తాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.


వృశ్చిక రాశి: రాజకీయ నిర్ణయాలు అనుకూలం. నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. పరీక్షలు ఆరోగ్య పరంగా ఉపకరిస్తాయి. శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో ఆలస్యం ఉంటుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.


మకర రాశి: సంభాషణల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కోర్టు వ్యవహారాలు ఊరట కలిగిస్తాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత ఆకస్మికం. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభ రాశి: నూతన ఉత్సాహం పెరుగుతుంది. విద్యా ప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. శుభ వ్యయం ఉంటుంది. ఆరోగ్య విషయంలో ప్రతికూలత తగ్గుతుంది. పోటీని తట్టుకోగలుగుతారు. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి: ఋణ ప్రయత్నాలు లాభిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో ఉపశమనం ఉంటుంది. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్యరీత్యా శ్రద్ధ పాటించాలి. ముఖ్యమైన పనుల విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com







థైరాయిడ్ అదుపు జీవితం గెలుపు

నిసత్తువ ఆవహిస్తుంది. కంటినిండానిద్ర, కడుపునిండా ఆహారం తీసుకుని గంటల తరబడి విశ్రాంతి తీసుకున్నా అలసట మాత్రం వదల బొమ్మాళీ అని అంటుంది. బరువు పెరుగుతారు. వెంట్రుకలు ఊడిపోతుంటాయి. ఒళ్లంతా చెమటలు పట్టేస్తుంది. మనసునిండా ఆందోళన ఉంటుంది. ఒకేసారి ఇన్ని లక్షణాలు కనిపిస్తే వ్యాధి లక్షణాలుగా అనుమానించాలి. ఆ వ్యాధి ఏంటో నిర్థారణ చేసుకునేందుకు థైరాయిడ్ నిర్థారణ పరీక్ష చేసుకుంటే సరిపోతుంది. కానీ మనలో చాలామంది ఇటువంటి పరీక్షలకు దూరంగా ఉండటం వ్యాధి ముదిరి పాకానపడుతుంది. ప్రాణాంతకమవుతుంది. మహిళల్లో ఎక్కువగా వచ్చే ఈ వ్యాధి పేరు థైరాయిడ్. మానసికంగా, శారీరకంగా చిత్ర హింసలకు గురికావడం తప్పనిసరి. కాబట్టి థైరాయిడ్ వ్యాధిని ఆరంభంలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే బెటర్. థైరాయిడ్ అవగాహనా మాసం సందర్భంగా 'కులాసా' అందిస్తున్నప్రత్యేక కథనం ఇప్పుడు చూద్దాం.

థైరాయిడ్ గ్రంథి అంటే ఏమిటి?

సాధారణంగా తోటల్లో, పంటచేల్లో సీతాకోకచిలుకలను మనం చూస్తుంటాం. వీటి వల్ల నష్టం ఏం జరగదు. పైగా కనులవిందుగా ఉంటుంది. కానీ మన శరీరంలో క రాడా సీతాకోకచిలుక ఆకారంలో ఒక గ్రంథి ఉంటుంది. ఈ గ్రంథి వల్ల శరీరానికి ఉపయోగాలు ఉన్నాయి. నష్టాలు ఉన్నాయి. ఇది మెడ ముందు భాగంలో ఉంటుంది.
హార్మోన్ల ఉత్పత్తికి ఈ గ్రంథి కేంద్ర బిందువు అని చెప్పాలి. ఉత్పత్తి అయిన హార్మోన్‌లను అదుపు చేయడం కూడా థైరాయిడ్ గ్రంథి చేతుల్లోనే ఉంటుంది. శరీరం వినియోగించి శక్తి కోసం ఈ గ్రంథి పాత్ర ఎక్కువగానే ఉంటుంది.
హార్మోన్ స్థాయి కొద్దిగా లేదా ఎక్కువగా ఉండటానికి థైరాయిడ్ కీలకపాత్ర వహిస్తుంది.


బరువు పెరగడం లేదా తగ్గడం

థైరాయిడ్ గ్రంథి లోపం వల్ల బరువు పెరగడం లేదా బరువు తగ్గడం వంటివి సంభవిస్తాయి. థైరాయిడ్ గ్రంథి తక్కువ పరిమాణంలో హార్మోన్ విడుదల చేస్తే బరువు పెరగతారు. దీన్ని హైపో థైరాయిడిజం అని అంటారు.
ఇందుకు విరుద్ధంగా థైరాయిడ్ గ్రంథి హార్మోన్లను ఎక్కువగా విడుదల చేస్తుంది. శరీర అవసరానికి మించి హార్మోన్లను విడుదల అవుతాయి. దీంతో అనుకోకుండా మీ బరువు తగ్గిపోతారు. దీన్ని హైపర్‌థైరాయిడిజం అని అంటారు. ఇది సాధారణంగా ఉండే వ్యాధి అని చెప్పవచ్చు.

మెడ ముందు భాగంలో వాపు

మెడ ముందు భాగంలో వాపు ఉంటుంది. దీన్ని చాలా సులువుగా గుర్తించడానికి వీలుంటుంది. మెడ ముందు భాగంలో వాపు ఉంటే కచ్చితంగా థైరాయిడ్ వ్యాధి ఉన్నట్టు అర్థం చేసుకోవాలి. థైరాయిడ్ క్యాన్సర్ ఉంటే వాపు కనిపిస్తుంది. థైరాయిడ్ గ్రంథి లోపలి భాగంలో గడ్డలు ఏర్పడతాయి.

గుండె పనితీరు



థైరాయిడ్ గ్రంథి విడుదల చేసే హార్మోన్‌ల మీదే గుండెపనితీరు ఆధారపడుతుంది. గుండెకొట్టుకోవడంలో వేగం పెరగడం వెనుక థైరాయిడ్ గ్రంథి పనితనం ఉంటుంది. హైపో థైరాయిడిజం ఉన్నవారికి గుండె కొట్టుకోవడంలో వేగం పెరుగుతుంది. దీనివల్ల రక్తపోటు వచ్చే అవకాశం లేకపోలేదు.

శక్తి సన్నగిల్లుతుంది

థైరాయిడ్ లోపాల వల్ల మీ మనసు మారిపోతుంది. శరీరంలో శక్తి సన్నగిల్లుతుంది. బాగా అలసిపోయినట్టు అనిపిస్తారు. ఆత్మనూన్యత భావం ఉంటుంది. ఆందోళన నెలకొంటుంది. నిద్రవేళల్లో మార్పులు సంభవిస్తాయి. విశ్రాంతి దొరకదు. చికాకు కనిపిస్తారు.

జుట్టు ఊడిపోతుంది

థైరాయిడ్ గ్రంథిలోపం వల్ల వెంట్రుకలు రాలిపోతాయి. దీనివల్ల తలమీద జుట్టు నిలవదు. హైపోథైరాయిడిజం లేదా హైపర్‌థైరాయిడిజం వల్ల వెంట్రుకలు రాలడం ఖాయం. దాదాపు అన్ని కేసుల్లో ఈ విషయం రుజువయ్యింది.
ఊడిన జుట్టు రావడం కష్టమే.

ఒళ్లంతా చెమటలు

థైరాయిడ్ గ్రంథిలోపం వల్ల శరీరంలో వేడి లేదా చలి ప్రారంభమవుతుంది. శరీరం తన ఉష్ణోగ్రతను బ్యాలెన్స్ చేసుకోవడంలో థైరాయిడ్ గ్రంథి సహకరిస్తుంది. అయితే ఈ వ్యాధి వల్ల శరీరం ఈ బ్యాలెన్స్ కోల్పోతుంది. ఒళ్లంతా చెమటలు పడతాయి.

ఇతర లక్షణాలు

హైపోథైరాయిడిజం వల్ల చర్మం పొడిపొడిగా మారిపోతుంది. అంటే చర్మంలో తేమ ఏ మాత్రం ఉండదు. గోళ్లు పాలిపోతాయి. అరచేతులు తడిగా మారిపోతాయి. మలబద్ధకం ఎక్కువగా ఉంటుంది. మహిళల్లో రుతుచక్రంలో తేడాలు వస్తాయి. హైపర్ థైరాయిడిజం వల్ల కండరాలు బలహీనంగా మారతాయి. కంటి దృష్టి లోపిస్తుంది. అతిసార వ్యాధి వంటివి వస్తాయి.

మెనోపాజ్




మహిళలకు అతి భయంకరఘట్టం మెనోపాజ్. అంటే మెనోపాజ్ వచ్చిందంటే రుతుచక్రం నిలిచిపోయినట్టు భావించాలి. థైరాయిడ్ వస్తే మెనోపాజ్ దశకు చేరుకున్నట్టే అని భావించాల్సి ఉంటుంది. థైరాయిడ్ వచ్చిందని అనుమానమొస్తే అతిసులభమైన రక్తపరీక్ష చేసుకోవాలి.

ఎవరికి పరీక్ష ?

మీకు థైరాయిడ్ లక్షణాలు కనిపించగానే డాక్టర్‌ను సంప్రదించాలి. హైపో థైరాయిడిజం 60 ఏళ్లు దాటిన మహిళలకు ఎక్కువగా వస్తుంది. కుటుంబ చరిత్రలో థైరాయిడిజం ఉంటే జాగ్రత్తపడాలి.

మెడ పరీక్ష



థైరాయిడ్‌ను తెలుసుకునేందుకు మన ఇంట్లో ఉన్న అద్దం సరిపోతుంది. అద్దం ముందు నిల్చుని మెడ భాగాన్ని పరీక్షించుకుంటే సరిపోతుంది. డాక్టర్ పర్యవేక్షణలో పరీక్ష చేసుకోవాలి. తలను వెనక్కి వాల్చాలి. మంచినీళ్లు త్రాగాలి. బాగా వాచిపోయినట్టు అనిపిస్తే పరీక్ష చేసుకోవాలి. ఆపిల్ ఆకారంలో కనిపిస్తే థైరాయిడ్ ఉన్నట్టు నిర్థారణ చేసుకోవచ్చు.

నిర్ధారణ

మీ డాక్టర్‌కి అనుమానమొస్తే సులభమైన రక్తపరీక్షకి సిఫారసు చేస్తారు. థైరాయిడ్ ఉందా లేదా అనే విషయాన్ని తెలుసుకోవడానికి థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ స్థాయిల ద్వారా తెలుసుకోవచ్చు. టిఎస్‌హెచ్ స్థాయి ఎక్కువగా ఉంటే థైరాయిడ్ కార్యకలాపాలు మందకొడిగా సాగుతాయి. దీన్నిహైపో థైరాయిడ్ అంటారు. అలాగే టిఎస్‌హెచ్‌స్థాయి తక్కువగా ఉంటే థైరాయిడ్ క్రియాశీలకంగా ఉన్నట్టు అర్థం చేసుకోవాలి. దీన్నిహైపర్ థైరాయిడ్ అని అంటారు. అవసరమైతే బయాప్సి చేస్తారు.

హషిమొటో వ్యాధి

హషిమొటో వ్యాధి రావడానికి థైరాయిడ్ ప్రధాన భూమిక వహిస్తుందని గమనించాలి. వారసత్వంగా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది.

హైపోథైరాయిడిజం

హైపో థైరాయిడిజం వల్ల పిట్యుటరీ గ్రంథి సమస్యలు వస్తాయి. పిట్యుటరీ మెదడుభాగంలో ఉంటుంది. ఈ గ్రంథి వల్ల థైరాయిడ్‌ను నిలువరించ గలుగుతుంది.


గ్రేవ్స్ వ్యాధి

గ్రేవ్స్ వ్యాధి రావడానికి థైరాయిడ్ గ్రంథి కారణమని తెలుస్తోంది. ఎందుకంటే కంటిచూపులో తేడా వస్తుంది. థైరాయిడ్ హార్మోన్ మోతాదు మించి విడుదల చేస్తే ఈ వ్యాధి వస్తుంది.

అవలక్షణాలు

థైరాయిడ్ గ్రంథిని నిలువరించకపోతే మరిన్ని సమస్యలు కొనితెచ్చుకున్నట్టు అవుతుంది. అంతేకాదు గుండెపోటు, కొలెస్ట్రాల్ పెరుగుదల, ఎముకలు పెలుసులుపెలుసులుగా విరిగిపోతాయి. ఒక్కోసారి ప్రాణాంతకమవుతాయి.

మందులు తీసుకోవాలి



థైరాయిడ్ వ్యాధి ఉన్నట్లయితే మందుల ద్వారా నయం చేయవచ్చు. థైరాయిడ్ గ్రంథి విడుదల చేసే హార్మోన్‌ల స్థాయిని పెంచడం లేదా తగ్గించడం అనేది మందుల ద్వారా సాధ్యపడుతుంది.
రేడియోఆక్టివ్ ఐయోడైన్ ద్వారా చికిత్స చేయవచ్చు. ఆరునుంచి 18వారాల పాటు కోర్సు పూర్తిచేయవచ్చు. ఒకసారి ఈ గ్రంథి నిర్మూలన చేస్తే ఇటువంటి సమస్యలు పునరావృతం కావు. లేదా సర్జరీ చేయాలి. కానీ చాలామంది రోగులు థైరాయిడ్ వ్యాధి నివారణకు మందు బిళ్లలు తీసుకుంటారు.


ఆహారం

థైరాయిడ్ గ్రంథి ద్వారా సమస్యలు నివారించడానికి అయోడైజ్డ్ ఉప్పు బాగా ఉపయోగపడుతుంది. అలాగే ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. పాలకూరలో మెగ్నీషియం ఎక్కువగా ఉంటుంది. అలసట బాగా తగ్గిస్తుంది.
బాదం, ఖాజులో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. థైరాయిడ్ గ్రంథి ద్వారా వ్యాధులను నివారించడానికి చేపలు చాలా మంచిది. సముద్రంలో దొరికే జీవులను తినడం వల్ల అనేక సమస్యలను పరిష్కరించగలుగుతాం. సోయా గింజలు కూడా చాలా మంచిది. మేకమాంసంతో పాటు కాలేయం, గుండె, కిడ్నీ వంటివి తీసుకోవడం వల్ల లిపోయిక్ ఆసిడ్ సమకూరుతుంది. ఇలా సమకూరడం వల్ల థైరాయిడ్ వ్యాధి ఉన్నవాళ్లు మందుబిళ్లలకు బదులుగా ఈ ఆహారంను ప్రత్యామ్నాయంగా వినియోగించుకోవచ్చు.గోధుమల్లో ఉండే గ్లూటెన్ చాలా మంచిది.

మందులు ఎలా తీసుకోవాలి?

థైరాయిడ్‌ను నివారించడానికి ఖాళీ కడుపుతో మందులు తీసుకోవాలి. ఉదయం ప ూట ఈ మందులు తీసుకుంటే అన్ని విధాల మంచిది. కొన్ని రకాల మందులను ఉదయం పూట తీసుకోవాలి.

వ్యాయామం



థైరాయిడ్‌ను కంట్రోల్ చేయడానికి వ్యాయామం చాలా ముఖ్యం. వ్యాయామం చేయడం వల్ల థైరాయిడ్ హార్మోన్‌ను నిలువరించడం చాలా తేలిక.
నడక: నడకను మించిన వ్యాయామం లేదు. ఎందుకంటే గంటకు 280 కేలరీలు వ్యాయామం ద్వారా ఖర్చవుతాయి. గుండెలో రక్తం సరఫరా బాగుంటుంది.

వాటర్ ఏరోబిక్స్

వాటర్ ఎరోబిక్స్ వల్ల పాదాలు, మడిమలు వంటివి ఉపశమనం పొందుతాయి.

యోగా



యోగా చేయడం వల్ల థైరాయిడ్‌ను అరికట్టవచ్చు. యోగా, ప్రాణాయామం వల్ల మనశరీరం పూర్తిగా మన అదుపులో ఉంటుంది.

డాక్టర్ రాహుల్ అగర్వాల్
ఎండి (జనరల్ మెడిసిన్)
సీనియర్ జనరల్ ఫిజిషియన్



నొప్పి తెలియని లాప్రోస్కోపిక్ సర్జరీ

లాప్రోస్కోపిక్ సర్జరీ అంటే ఏమిటి?

సాధారణంగా శస్త్రచికిత్స కోసం పొట్టలో 10 నుంచి 12 అంగుళాల కోతవేసి చేతులతో నేరుగా చేయడం జరుగుతుంది. కానీ లాప్రోస్కోపిక్‌లో చిన్న చిన్న గొట్టాలద్వారా సన్నని పొడవైన పరికరాలను పొట్టలోకి పంపి శస్త్రచికిత్స చేయడం జరుగుతుంది. దీనికోసం కీహోల్ అనబడే కేవలం 2 సెంటీమీటర్ల రంధ్రం మాత్రమే చేయడం జరుగుతుంది. దీనిని బ్యాండ్ ఎయిడ్ సర్జరీ అని కూడా అంటారు.

సన్నని రంధ్రాల ద్వారా శస్త్ర చికిత్స చేయడం ఎలా వీలవుతుంది?

రోగి శరీరంలో చేసిన రంధ్రాలనుండి మంచి నాణ్యత గల కెమెరాలను లోపలికి పంపి శరీరం లోపలి పరిస్థితిని శస్త్రచికిత్స నిపుణులు టీవీలో చూస్తూ సన్నని, పొడవైన పరికరాలను ఉపయోగించి శస్త్రచికిత్స చేస్తారు.


ల్యాప్రోస్కోపిక్ అనేది నూతన శస్త్ర చికిత్సా విధానమా?

సంప్రదాయ చికిత్సను కొత్తపద్ధతిలో శస్త్రచికిత్స చేయడం జరుగుతుంది. లాప్రోస్కోపిక్ చికిత్సలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తారు.

లాప్రోస్కోపిక్ సర్జరీలో నొప్పి ఎందుకు తెలియదు?

సాధారణంగా శస్త్రచికిత్స అంటే శరీరంపై గాటు పెట్టడం ద్వారా చేస్తుంటారు. అవి కండరాలకు నొప్పిని కలిగిస్తాయి. కానీ లాప్రోస్కోపిక్‌లో ఈ కోత చాలా చిన్నదిగా వుండి, కండరాలకు నొప్పి కలిగించకుండా, శరీరంలోని ఇతర అవయవాలకు హాని కలగకుండా చేయడం జరుగుతుంది. అందువల్ల నొప్పి కొద్దిగా మాత్రమే వుంటుంది.

లాప్రోస్కోపిక్ వల్ల ఇంకేమైనా ప్రయోజనాలున్నాయా?



ఈ పద్దతిలో శస్త్రచికిత్స చేసిన తర్వాత రోగి త్వరగా కోలుకుంటాడు. నొప్పి కొద్దిగా మాత్రమే వుండడం వల్ల రోగిని పడకమీద నుండి త్వరగా లేచి తిరగగలుగుతారు. కడుపులోని ప్రేగులకు నేరుగా చేతులతో తాకనందువల్ల 24 గంటల నుండి 48 గంటలలోపే రోగి ఆహారం తీసుకోవడంలో ఎటువంటి ఇబ్బంది వుండదు. సాధారణ శస్త్రచికిత్సలో ఆహారం తీసుకోవడంలో ఇబ్బంది ఐదు నుంచి ఏడు రోజులవరకు వుంటుంది.


లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్స సౌందర్యపరంగా ఎందువల్ల మెరుగైంది?

కోత చిన్నదిగా చేసే కారణం వల్ల మచ్చలు ఎక్కువగా కనబడవు. వైద్య నిపుణులు కోత వేసే సమయంలో మచ్చ కనపడకుండా వుండే విధంగా చూసుకుంటారు. అంతేగాక ఆస్పత్రిలో ఎక్కువకాలం మందులతో గడపాల్సిన అవసరం వుండదు. రక్తం కూడా ఎక్కువగా కారిపోదు. లాప్రోస్కోపిక్ సర్జరీలో ఈ సౌకర్యాలన్నీ వున్నాయి. ముఖ్యంగా క్యాన్సర్ శస్త్రచికిత్స నుండి త్వరగా కోలుకోవటం వలన రేడియోథెరపీ, రీమోథెరపీ త్వరగా తీసుకునే అవకాశం ఉంటుంది.

లాప్రోస్కోపిక్ అనేది శస్త్ర చికిత్సా విధానంలో సురక్షితమైనదా?

శస్త్రచికిత్స సాంకేతిక విధానంలో లాప్రోస్కోపి పద్దతి రెండు దశాబ్దాలుగా ఎంతో ఉపయోగకరంగా వుంది. ప్రారంభంలో ఈ పద్దతి గైనకాలజీలో మాత్రమే ఉపయోగించబడి తదనంతరం సాధారణ శస్త్రచికిత్సలకు కూడా ఇదే పద్దతి ఉపయోగించబడుతోంది. సాంకేతికతతో మెరుగుదలతో బాటు రక్త స్రావ నివారణ పరికరాలు కూడా తయారు చేయడం వల్ల లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్స క్యాన్సర్ వ్యాధిలో కూడా బాగా ప్రచారంలోకి వచ్చింది.

లాప్రోస్కోపిక్ ద్వారా ఎటువంటి వ్యాధులను నయం చేయవచ్చు?



గర్భాశయ క్యాన్సర్‌లు, పొట్ట, పెద్ద ప్రేగు క్యాన్సర్లు నయం చేయడంలో ఈ శస్త్ర చికిత్స ఎంతో పేరుపొందింది. అన్నవాహిక క్యాన్సర్‌కు కూడా ఎంతో ఉపయోగపడుతుంది. లాప్రోస్కోపిక్ పద్దతుల్లో ఎంతో అనుభవం వున్న వైద్య నిపుణులు మాత్రమే ఈ శస్త్రచికిత్స నిర్వహించాల్సి వుంది. కేవలం శస్త్రచికిత్స నిర్వహించగలగడమే గాక, పరిస్థితులు అనుకూలించినప్పుడు లాప్రోస్కోపిక్ పద్దతి నుండి సంప్రదాయ శస్త్రచికిత్స పద్దతికి మార్చుకోగల విజ్ఞత, నిపుణత కూడా కలిగివుండాలి.

డాక్టర్ శ్రీనివాస్ జూలూరి
డైరెక్టర్ సర్జికల్ ఆంకాలజిస్ట్
కేర్ హాస్పిటల్, హైటెక్ సిటీ




పద్మశ్రీ అవార్డు పొందిన సినీ గీత రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రిని సోమవారం హైదరాబాద్‌లో మెగాస్టార్ చిరంజీవి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీతారామశాస్త్రి కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు.

ఆ ఒక్క విషయం...!


ప్రియాంక

బాలీవుడ్ అగ్ర తారగా వెలిగిన ప్రియాంక...ఇప్పుడు ప్రపంచ తార అయ్యింది. క్వంటికో టీవీ సిరీస్ ద్వారా విశ్వ వినోద రంగంలో ఆమె గుర్తింపు తెచ్చుకుంది. ప్రియుడు నిక్ జోనాస్‌తో వివాహం అనంతరం విదేశీయులకు మరింత దగ్గరైంది ప్రియాంకా. సినిమాల్లో నటిస్తూనే హాలీవుడ్‌లో వీలైనంత ఎక్కువ తీరిక లేకుండా గడుపుతోంది. ప్రియాంకా చేస్తున్న వాటిలో సినిమాలతో పాటు టీవీ సీరియల్స్, ఇంటర్నెట్ కార్యక్రమాలూ ఉన్నాయి. తాజాగా యూట్యూబ్ కోసం ఆమె ఇఫ్ ఐ క ఎడ్ టెల్ యూ వన్ థింగ్ అనే కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ప్రియాంకా...ప్రపంచంలో వివిధ రంగాల్లో విజయవంతమైన వాళ్లను ముఖాముఖి చేయనుంది. మిమ్మల్ని జీవితంలో గెలిపించిన ఆ ఒక్క విషయం ఏంటనేది ఈ కార్యక్రమానికి వచ్చే అతిథులను ప్రియాంకా ప్రశ్నించనుంది. మరి మీ జీవితంలో ఆ ఒక్క విషయం ఏంటని ప్రియాంకాను అడిగితే...సమాధానం ఆమె మాటల్లో...పక్కవాళ్ల జీవితాలు ఎందుకు బాగున్నాయి, వాళ్లెలా ఎదుగుతున్నారు అని ఆలోచించే ఉత్సుకతే నా విజయాలకు కారణం. మంచి ఎక్కడున్నా తీసుకోవాలి అన్నట్లు..ఇతరుల అభివృద్ధికి కారణమైన అంశాలను నేనూ అనుసరించాను. ఈ క్రమంలో నేను కలిసిన అసాధారణ వ్యక్తులు నా జీవితాన్ని మరో మెట్టుకు ఎదిగే స్ఫూర్తినిచ్చారు. నాకు ఆదర్శమైన వాళ్ల నుంచి సలహాలు తీసుకుంటాను. నిత్యం నేర్చుకుంటూ ముందుకు సాగుతున్నాను. అని చెప్పింది.


పరీక్షలో పాసయ్యాకే...!

చేపల పట్టి ఇవ్వడం కాదు చేపలు పట్టడం నేర్పాలంటారు. తారలు తమ వారసులకు నేర్పాల్సింది ఇదే. బాలీవుడ్ ఖాన్ స్టార్ అమీర్ ఖాన్ తన కొడుకు జునైద్ ఖాన్‌కు ఈ మార్గాన్నే చూపిస్తున్నారు. కొన్నేళ్లుగా జునైద్ తెరంగేట్రం గురించి ప్రచారం


అమీర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్

జరుగుతోంది. అగ్ర కథానాయకుడి వారసుడి కాబట్టి అనుకున్న క్షణంలో ప్రకటన చేయొచ్చు అని అంతా అనుకున్నారు. కానీ అమీర్ వీళ్ల ఆలోచనకు భిన్నంగా స్పందించాడు. స్క్రీన్ టెస్టులు పాసయితేనే అతన్ని సినిమాల్లోకి పంపిస్తామని, లేకుంటే ఇంకొన్నాళ్లు ఆగాల్సిందే అని చెప్పాడు. అమీర్ మాటల్లో వింటే...జునైద్ అందరిలాగే స్క్రీన్ పరీక్షల్లో పాసవ్వాలి. అప్పుడే అతనికి అవకాశం ఇస్తాం. లేకుంటే లేదు. అతను లాస్ ఏంజెలీస్‌లో నటనలో శిక్షణ తీసుకున్నాడు. పలు నాటక ప్రదర్శనల్లో పాల్గొన్నాడు. బాగానే నటిస్తున్నాడని తెలుసు. అయితే సినిమాలో ఎంత వరకు రాణిస్తాడో చూడాలి. రాగానే హీరో అని కాకుండా మంచి పాత్రల్లో నటించమని నేను సలహా ఇస్తున్నాను. పాత్రలను అనుసరిస్తూ వెళ్తేనే నటుడిగా పేరు తెచ్చుకోవచ్చు. నేను సినిమా ఎంచుకునేప్పుడు హీరో అని అంగీకరించను. పాత్ర ఎంత ఆకట్టుకునేలా ఉంది అనేదే చూస్తాను. అందుకే నా సినిమా విడుదలైతే నన్ను ఆ పాత్ర పేరుతో ప్రేక్షకులు పిలుస్తారు. జునైద్‌కూ అదే సలహా ఇస్తున్నాను. అన్నారు.

బాలీవుడ్ ప్రతినిధిగా


కరణ్ జోహార్

దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు బాలీవుడ్ ప్రతినిధిగా హాజరయ్యారు ప్రముఖ దర్శక నిర్మాత కరణ్ జోహార్. హిందీ చిత్ర పరిశ్రమ నుంచి ఈ సదస్సులో పాల్గొన్న ఏకైక వ్యక్తి కరణ్. కరణ్ జోహార్ ఈ సదస్సుకు హాజరవడం ఇది మూడోసారి. ఈ సందర్భంగా చిత్ర పరిశ్రమ అభివృద్ధికి పలు ఆలోచనలు చేసినట్లు కరణ్ చెప్పారు. ఆయన మాట్లాడుతూ... సాంస్కృతిక సారథిగా దావోస్‌లో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నా. ప్రపంచ స్థాయి వేదికపై చిత్ర పరిశ్రమ అభివృద్ధికి అనేక చర్చలు, సమాలోచనలు జరిపాం. ఇంకా మనకు కావాల్సిన సదుపాయాలను గురించి చర్చించాం. సరికొత్త ఆలోచనలపై సమావేశం నిర్వహించిన రెండు ప్యానెల్స్‌లో మాదీ ఒకటి. విశ్వ వేదికలపై భారతీయ చిత్రాలపై చాలా అపోహలు ఉన్నాయి. భారతీయ చిత్రాలంటే ఆటపాటల సినిమాలనే అభిప్రాయం ఉంది. మనం మాట్లాడటం ద్వారానే ఈ దురాభిప్రాయాన్ని మార్చగలం. మంచి కథలను చెప్పడంలో చాలా అభివృద్ధి చెందాం. మనవి ఒకే తరహా చిత్రాలు అనే దృష్టికోణం వల్ల చాలా నష్టపోతున్నాం. ఈ పరిస్థితి త్వరలో మారుతుంది. అన్నారు.

విడుదలయ్యాక విమర్శలు

★ తానే మణికర్ణిక దర్శకురాలని చెప్పిన కంగనా
★ అబద్ధమన్న దర్శకుడు క్రిష్


మణికర్ణికలో ఓ దృశ్యం

మణికర్ణిక చిత్రం చుట్టూ మొదట్నుంచి ఏదో ఒక వివాదం రాజుకుంటూనే ఉంది. కథానాయిక కంగనారనౌత్, దర్శకుడు క్రిష్‌కు మధ్య తలెత్తిన విభేదాలు ఇప్పుడు బయటపడుతున్నాయి. ప్రస్తుతం ఆరోపణలు, విమర్శనాస్త్రాల పర్వం కొనసాగుతోంది. ఇంతకీ అసలు విషయంలోకి వస్తే...ఝాన్సీ లక్ష్మీబాయి జీవిత చరిత్ర ఆధారంగా టైటిల్ పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటి కంగనారనౌత్ నటించిన మణికర్ణిక చిత్రం ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్‌తో అధిక రోజులను వెచ్చించి తీసిన ఈ చిత్రం నిర్మాణంలో ఉండగానే పలు వివాదాలకు కారణమైంది. ఓ వైపు బడ్జెట్ పెరిగిపోవడంతో నిర్మాతలలో ఒకరు తప్పుకున్నట్లు అప్పట్లో వార్తలొచ్చాయి. మరోవైపు కంగనా వ్యవహారశైలి నచ్చలేదంటూ కీలక పాత్ర పోషిస్తున్న నటుడు సోనూసూద్ చిత్రం నుంచి తప్పుకున్నారు. అలాగే సినిమాకు కెప్టెన్ అయిన దర్శకుడు క్రిష్ చిత్రం నుంచి వైదొలగారు. సన్నివేశాలను వక్రీకరిస్తున్నారంటూ మహారాష్ట్రకు చెందిన కర్ణిసేన చిత్రబృందాన్ని హెచ్చరించడం. విడుదల సమయంలో వారిపై కంగనా మండిపడటం వంటి వివాదాలు ఈ చిత్రం చుట్టూ తిరిగాయి. ఇక ఎన్టీఆర్ బయోపిక్ చిత్రాల కోసమే మణికర్ణిక చిత్రం నుంచి క్రిష్ తప్పుకున్నట్లు అప్పట్లో ప్రచారం జరిగింది కూడా. అయితే ఈ విషయంపై అప్పట్లో క్రిష్ ఎలాంటి కామెంట్స్ చేయలేదు. ఎన్టీఆర్ బయోపిక్ చిత్రం కోసం తన పని తాను చేసుకుంటూ పోయారు. కంగనా కూడా ఆ సమయంలో క్రిష్‌పై ఎలాంటి విమర్శనాస్త్రాలు సంధిస్తూ బయట పడలేదు. క్రిష్ ఆ చిత్రం నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆమె దర్శకత్వం వహించారు. ఇప్పుడు చిత్రం విడుదలైన తర్వాత వారి మధ్య నెలకొన్న విభేదాలు ఒక్కొక్కటి బయటపడుతూ భగ్గుమంటున్నాయి. చిత్రం కలెక్షన్లు ప్రస్తుతం నిలకడగానే ఉన్నాయి. కేవలం మూడు రోజులకు 42 కోట్ల రూపాయల కలెక్షన్లను ఈ చిత్రం వసూలుచేసింది. ఇంకా రాబోయే రోజులలో కూడా ఈ చిత్రం మంచి కలెక్షన్లను వసూలు చేయడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి. అయితే వీరి మధ్య విభేదాలు ఈ దశలో బయటపడి...తారాస్థాయికి చేరుకోవడం మాత్రం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. వీరి మనసుల్లో ఈ స్థాయి అభిప్రాయ భేదాలు ఉన్నాయా? అని సినీ వర్గాలే కాదు ప్రేక్షకులు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. ఇదిలావుండగా... కంగనాతో తనకు ఏర్పడిన విభేదాల గురించి క్రిష్ ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇలా చెప్పుకొచ్చారు....కంగనా చాలా గొప్ప నటి. నిర్మాతలు మణికర్ణిక టైటిల్ పాత్రకు ఎంచుకుందామని నాతో చెప్పినపుడే నేను కూడా ఎంతో సంతోషించాను. కంగనా నటించేందుకు అంగీకరించడం వల్లే నేను మణికర్ణిక సినిమాకు దర్శకత్వం వహించేందుకు అంగీకరించాను. కానీ చిత్రం నిర్మాణ సమయంలో నాకు, కంగనాకు మధ్య కొన్ని అభిప్రాయ భేదాల వల్ల విభేదాలు తలెత్తాయి. చరిత్రకు సంబంధించిన వాస్తవాలను ఈ సినిమాలో చూపించాలని ఎంతో తపన చెందాను. ఆ విషయంలో ఆమె అభిప్రాయాలు వేరే రకంగా ఉన్నాయి. తాంతియా తోపే పాత్ర గురించి చెప్పకలేకపోవడం నన్నెంతో బాధించింది. కథలో అత్యంత కీలకమైన దానినే తొలగిస్తే చరిత్రను పక్కన పెట్టినట్లువుతుంది. అప్పటికీ దీనిపై ఆమెకు నచ్చచెప్పే ప్రయత్నం చేశాను. అయితే ఆమె మాత్రం సోనూసూద్ పాత్ర చాలా బలంగా ఉందంటూ కుస్తీ సన్నివేశాలు అవసరం లేదని, వాటిని తొలగిద్దాం అని చెప్పింది. అయినా మా మధ్య పెద్దగా చర్చలు కూడా ఏం జరగలేదు. అతుల్ కులకర్ణి చేసిన యుద్ధ సన్నివేశాలను కంగనా తొలగించేశారు. వాటిని తొలగించడానికి నేను ఒప్పుకోలేదు. నా గురించి కంగనా అన్నీ అబద్ధాలే చెప్పింది. నేను చేసింది తప్పు అంటే నాకు బాధ కలగదా? ఈ సినిమా కోసం దాదాపు 400 రోజులు వెచ్చించాను. 70 శాతం సినిమాను నేను చేస్తే...30 శాతం సినిమాను కంగనా తెరకెక్కించింది. నేను తీసిన సన్నివేశాలనే మళ్లీ చిత్రీకరించి ఆమె పేరు వేసుకుంది. నేను బంగారం లాంటి సినిమాను తెరకెక్కించాను. కానీ ఇప్పుడు చూస్తున్నది మాత్రం వెండి లాంటి సినిమా అని చెప్పుకొచ్చారు.


క్రిష్

కంగనాను ప్రశాంతంగా ఉండనీయండి: కంగనా సోదరి రంగోలి

దర్శకుడు క్రిష్ వ్యాఖ్యలపై కంగనా సోదరి రంగోలి ప్రతిస్పందించారు. సినిమా అంతా మీరే తీశారని మేం ఒప్పుకుంటాం. కానీ తెరపైన మొత్తం కంగనానే కనిపిస్తుంది. విడుదల తర్వాత మణికర్ణిక చిత్రానికి...అలాగే టైటిల్ పాత్ర నటనకు వస్తున్న అభినందనలను ఆస్వాదించే పనిలో కంగనా ఉంది. ఆమెను ప్రశాంతంగా ఉండనీయండి అంటూ వ్యంగ్యంగా సోషల్‌మీడియాలో ట్వీట్ చేశారు. ఏదిఏమైనప్పటికీ ఈ వివాదం ఇప్పట్లో చల్లారుతుందో? లేదో ముందు ముందు తెలుస్తుంది. క్రిష్ మాత్రం ఇకపై కంగనాతో సినిమా చేయనని స్పష్టం చేశారు.



శుక్రా ప్రొడక్షన్స్ కొత్త చిత్రం

విషాన్ జైన్, హేమలతా రెడ్డి జంటగా దర్శకుడు వీఎస్ ఫణీంద్ర ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. శుక్రా ప్రొడక్షన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. యువతరానికి నచ్చే కథా కథనాలతో తెరకెక్కుతున్న ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ జరుపుకుంటోంది. ఫిబ్రవరి 4వ తేదీ నుంచి నాల్గవ షెడ్యూల్‌కు చిత్ర యూనిట్ సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు ఫణీంద్ర మాట్లాడుతూ....యువతకు నచ్చే అంశాలతో సినిమాను తెరకెక్కిస్తున్నాం. యాక్షన్ ఎపిసోడ్స్ బాగా ఆకట్టుకుంటాయి. ఇప్పటిదాకా రూపొందించిన సినిమా సంతృప్తికరంగా ఉంది. హీరో హీరోయిన్‌ల పాత్రలు బోల్డ్ గా ఉంటాయి. రాజా రవీంద్ర కీలక పాత్రలో నటిస్తున్నారు. అన్నారు.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - గోపీనాథ్ కాకర్ల, సంగీతం - హర్ష ప్రవీణ్, ఎడిటర్ - రామారావు జేపీ, నిర్మాత - సంజయ్ జాదవ్


హేమలతా రెడ్డి , విషాన్ జైన్